






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



కమ్యూనిస్టుకు మరణం లేదు.. కమ్యూనిజానికి అంతం లేదు
సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవం దేనికి సంకేతం??
కమ్యూనిస్టు పార్టీ భవిష్యత్తు ఏమిటి? 03



సంపుటి 28, సంచిక: 205 | శనివారం | 17-01-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## మరో చారిత్రక ఘటనకు
# ఖమ్మం వేదిక

### 18న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ

హాజరుకానున్న డి. రాజా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం





ఖమ్మం విప్లవోద్యమాల గుమ్మం. దేశ స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత ఎన్నెన్నో ఘటనలకు వేదికైంది. ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి నిన్న మొన్నటి తెలంగాణ సాధనోద్యమం ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగిన పోరాటాల వరకు ఖమ్మంకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ప్రతి పల్లెకు, ప్రతి చెట్టుకు, పుట్టకు ఒక చరిత్ర ఉంది. ఆ చరిత్ర కమ్యూనిస్టు పార్టీతో ముడిపడింది. ఉమ్మడి జిల్లాకు చెందిన నేతల త్యాగాలు, పోరాటాలు, నిజాయితీ నిత్య స్మరణీయం. తొలి దశలో సిపిఐ తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొన్నా, తెలంగాణ సాయుధ పోరాటంతో గ్రామ గ్రామానా ఎర్ర జెండా రెపరెపలాడింది. ఎందరో యోధులు సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. మంచి ఊపు మీద ఉన్న కమ్యూనిస్టు పార్టీకి చీలిక తీరని శాపంగా మారింది. 1964లో వచ్చిన చీలిక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సిపిఐని నామమాత్రం చేసింది.

**చీలిక నుంచి బలోపేతం :** 1964లో చీలిక తర్వాత సిపిఐ నుండి సిపిఐ(ఎం)గా వీడిపోయింది. ఆ తర్వాత సిపిఐ(ఎం) నుండి సిపిఐ (ఎంఎల్) ఏర్పాటు తరువాయి 12లో



ప్రభుత్వ శాఖల్లో
## ఖాళీలన్నీ త్వరలో భర్తీ

''రాజకీయ పార్టీల చేతుల్లో యవత ఆయుధాలుగా మారొద్దు

'కొలువుల పండుగ' కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

''రాజకీయ పార్టీల చేతుల్లో యవత ఆయుధాలుగా మారొద్దు. ఉస్మానియా యూనివర్సిటీలో, అశోక్ నగర్ చౌరస్తాలో నిరుద్యోగులు ఏం మాట్లాడుకుంటున్నారో తనకు తెలుసు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తాం'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అలాగే లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి ప్రైవేటు రంగంలోనూ లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని ఆయన చెప్పారు. మాదాపూర్‌లోని శిల్పా కళా వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన 'కొలువుల పండుగ' కార్యక్రమంలో టిజిపిఎస్‌సి గ్రూప్ 3 కు ఎంపికైన 1370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను సిఎం రేవంత్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ''గత పదేళ్లలో తరువాయి 2లో




## దేశ సంపద రక్షణలో కమ్యూనిస్టులు

- చారిత్రక ఘటనలో భాగస్వాములు కండి
- మా నినాదాలే పరిపాలనా నిర్ణయాలు
- స్వేచ్ఛను హరిస్తున్న కేంద్ర పాలకులు
- మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/ ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే సభ చరిత్రలో నిలిచి పోనుందని, ఈ చారిత్రక ఘటనలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఖమ్మం ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా తో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఖమ్మం సభ కమ్యూనిస్టుల పురోగమనానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదం లక్ష్యంతో పోరాడిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని ఆయన తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా మా నినాదాలే పాలకుల విధాన నిర్ణయాలుగా మారాయని గతంలో బ్యాంకుల జాతీయకరణ, మిగులు భూముల పంపిణీ, దున్నే వానికే భూమి సహా పలు సంక్షేమ పథకాలు, కమ్యూనిస్టు నినాదాలు, పోరాటాల కారణంగానే చట్టాలుగా మారి అమలయ్యాయని కూనంనేని తెలిపారు. 21వ శతాబ్దంలోనూ జాతీయ ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనన్నారు. దేశ సంపద రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణను కమ్యూనిస్టులు బాధ్యతగా స్వీకరించారని కమ్యూనిస్టులు లేకుంటే ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వేలు, కోల్ ఇండియా సహా దేశీయ సుప్రసిద్ధ సంస్థలు ఎప్పుడో ప్రైవేట్ శక్తుల పరమయ్యేవని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటం ప్రజాసంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసమేనన్నారు. ఏ స్వేచ్ఛ కోసం పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్నామో అదే స్వేచ్ఛను బిజెపి హరించివేస్తుందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థి, యువజనులు ఎదుర్కొంటున్న తరువాయి 2లో

బాసరలో
## 'జ్ఞాన సరస్వతి' వర్సిటీ



పారిశ్రామికంగా, విద్యాపరంగా, సాగునీటి రంగంలో ఆదిలాబాద్ జిల్లాను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం

- పోరాటాల గడ్డపై రైతులకు అన్యాయం జరగనివ్వబోం
- జిల్లా రైతాంగానికి సాగునీరు అందాలంటే తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మించాల్సిందే
- 'ప్రజాపాలన' బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/నిర్మల్/అదిలాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పారిశ్రామికంగా, విద్యాపరంగా, సాగునీటి రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్‌లో నిర్వహించిన ''ప్రజాపాలన–ప్రగతి బాట'' భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఆదిలాబాద్ అభివృద్ధికి సంబంధించి పలు కీలక హామీలను ప్రకటించడమే కాకుండా, తక్షణం అమలుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు చాలా కాలం క్రితమే విశ్వవిద్యాలయం మంజూరైనప్పటికీ, స్థానిక ప్రాంతీయ విభేదాల వల్ల తరువాయి 2లో

### 2034 వరకూ కాంగ్రెస్ రాజ్యమే

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్

తెలంగాణలో రాబోయే పదేళ్ల కాలం కాంగ్రెస్ పార్టీదేనని, 2034 వరకు రాష్ట్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తరువాయి 2లో




## రైతు, ప్రజా వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

జాతీయ విత్తన బిల్లును సవరించాలి

సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కార్మిక సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జాతీయ విత్తన బిల్లును సవరించాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్ల జెండాలను, బ్యాడ్జీలతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, ఆర్ వెంకట్రాములు, జక్కుల వెంకటయ్య, తుకారాం నాయక్,విజయ్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ గత 11సంవత్సరాలుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాయడంతో పాటు రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసిందని విమర్శించారు. ఒక వైపు ప్రజాసంక్షేమాన్ని వల్లిస్తూనే. మరో వైపు కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలను దోచిపెడుతున్నదని, మోదీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు రూ. 18 లక్షల కోట్లు రాయితీలు కల్పించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కూడా అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక పోరాటల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తూ అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్లను అమలు చేస్తుందని మండిపడ్డారు. కార్మికులు ట్రేడ్ యూనియన్లు ఏర్పాటు చేసుకునేందుకు లేబర్ కోడ్‌లో ఆంక్షలను విధించారన్నారు. విత్తనాల ద్వారా నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారాన్ని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని, కేంద్రమే తమ ఇష్టానుసారంగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. వామపక్షాల పోరాట ఫలితంగా 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టం 2005ను తీసుకొస్తే, ఈ చట్టానికి మహాత్మ గాంధీ పేరును, ఆ లక్ష్యాలను తొలగించి, ఆ స్థానంలో తరువాయి 2లో



## ట్రంప్ చేతికి 'నోబెల్ శాంతి'

అందించిన మచాడో.. ప్రతీకాత్మక చర్యగా అభివర్ణన

**వాషింగ్టన్:** భారత్–పాకిస్తాన్‌సహా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో యుద్ధాలను నిలువరించానని, కాబట్టి ప్రతిష్టాతమకమైన నోబెల్ శాంతి బహుమతి తనకే దక్కాలని అమెరికా అధ్యక్షుడు పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, నోబెల్ పురస్కారం వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు దక్కింది. దీనితో డీలాపడిపోయిన ట్రంప్ చేతికి నోబెల్ పురస్కారం లభించింది. మచాడో స్వయంగా ఆయనకు పురస్కారాన్ని అందించారు. నోబెల్‌కు మరొకరికి బదిలీ చేయడానికి వీల్లేదని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ స్పష్టంచేసినట్లు, సమాచారం. ట్రంప్‌కు నోబెల్ బహుమతిని అందించేయడాన్ని ఒక ప్రతీకాత్మక చర్యగా పేర్కొంది. అయితే, ట్రంప్ ఆ పతకాన్ని తన వద్దే ఉంచుకోవాలని భావిస్తున్నట్టు వైట్ హౌస్ తరువాయి 2లో

## మేడారానికి ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరైన'సమ్మక్క సారలమ్మ జాతర'' ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో అమ్మవార్లకు బంగారం సమర్పించాలనకునే భక్తుల కోసం టిజిఎస్‌ఆర్‌టిసి ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేసిందని ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు (వరంగల్) జిల్లాలోని మేడారంలో సమ్మక్కసారలమ్మ దేవతలను పూజించడానికి తండోపతండాలుగా వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని బంగారం సమర్పించుకోవడం ఆనవాయితీ. అయితే, వివిధ కారణాల వల్ల మేడారం వెళ్లలేని భక్తులకు బంగారం ప్రసాదం తమ ఇంటి వద్దకే చేర్చేందుకు టిజిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్ తగు ప్రణాళికలు సిద్ధం చేసింది. దేవాదాయ శాఖ సహకారంతో, మేడారం అమ్మవార్ల బంగారం ప్రసాదం తరువాయి 2లో



## 'విలువల శిఖరం' జైపాల్‌రెడ్డి

కేంద్ర మాజీ మంత్రికి సిఎం, ప్రముఖుల నివాళి

ప్రజాపక్షం/ హైదరాబాద్

మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్, కాంగ్రెస్ సీనియర్ నేత జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా పి.వి.మార్గ్ (నెక్లెస్ రోడ్)లో జైపాల్ రెడ్డి సమాధి 'స్ఫూర్తి స్థల్' వద్ద ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణా రావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు 'స్ఫూర్తి స్థల్' వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు తరువాయి 2లో

కనీస మద్దతు ధరతో
## కందుల కొనుగోళ్లు

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వానాకాల 2025–26 సీజన్‌లో కందుల పంటను (రెడ్ గ్రామ్) కనీస మద్దతు ధరతో (ఎంఎస్‌పి) కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. రైతులు మధ్యవర్తుల వద్ద వెళ్లి తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవద్దని, తమ సమీపంలోని టి.జి. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కందుల కనీస మద్దతు ధర క్వింటా రూ. 8,000లు ఉండగా, ప్రస్తుత మార్కెట్ ధరలు మాత్రం రూ.7,200 వరకు ఉన్నాయని, అందుకే రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మంత్రి తుమ్మల శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మార్కెట్ ధరల హెచ్చుతగ్గులతో నష్టాలను నివారించి, రైతులకు లాభదాయక ధరను కల్పించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య (టి.జి. మార్క్‌ఫెడ్ ) సమన్వయంతో కొనుగోళ్లు తరువాయి 2లో

ధరణి, భూభారతి రిజిస్ట్రేషన్లలో
## రూ.3.90కోట్ల కుంభకోణం

- 15 మంది నిందితుల అరెస్టు, మరో 9 మంది పరారీ
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్

రాష్ట్రంలో సంచలం సృష్టించిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో ధరణి, భూభారతి రిజిస్ట్రేషన్లలో 3.90కోట్ల రూపాయల కుంభకోణంలో ప్రభుత్వ అదాయానికి గండి కొట్టిన మొత్తం ముఠాలోని 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది ప్రస్తుతం పరారీలో వున్నారు. ఈ ముఠా సభ్యుల నుండి పోలీసులు 63.19 లక్షల నగదు, బ్యాంక్‌లో లక్ష రూపాయలు, తరువాయి 2లో

# కెనడాకు కెనోలా.. చైనా వ్యూహాత్మక నిర్ణయం



**బీజింగ్ :** చైనాతో సత్సంబంధాలకు కెనడా చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. చైనా పర్యటనకు వచ్చిన కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ పలురంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో సమావేశమైన తర్వాత ఆయన పేరుతో విడుదలపైన ప్రకటనలో ఒప్పందాల ప్రస్తావన ఉంది. వీటిలో ముఖ్యమైనది వాణిజ్య ఒప్పందం.
కెనడాతో వాణిజ్య ఒప్పందాన్ని కేవలం వ్యవసాయ లావాదేవీగా మాత్రమే చూడడానికి వీల్లేదు. ఇది ఆర్థిక ప్రయోజనాలతో పాటు రాజకీయ, వ్యూహాత్మక అర్థాలను కలిగి ఉందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా కెనడాకు కెనోలా విత్తనాల ఎగుమతి ఈ సంబంధాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం కెనోలా విత్తనాలపై ఉన్న సుంకాలు సుమారు 85 శాతం నుంచి మార్చి 1 నాటికి సుమారు 15 శాతానికి తగ్గనున్నాయి. దీని వల్ల కెనడా రైతులు విత్తే సీజన్ ప్రారంభానికి ముందే తమ ప్రణాళికలను స్పష్టంగా రూపొందించుకునే అవకాశం లభించనుంది. ఈ ఒప్పందాల ద్వారా కెనడా రైతులు, మత్స్యకారులు, ఆహార ప్రాసెసింగ్ రంగాలకు దాదాపు 3 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు లభిస్తాయని, 2007 తర్వాత మొదటిసారి చైనా పర్యటనకు వచ్చిన కార్నీ అభిప్రాయపడ్డారు. చైనా మార్కెట్‌లో ఉన్న విస్తృత అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ఇది కీలక అడుగుగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గత ఏడాది పాటు కొనసాగిన సుంకాల గందరగోళం తర్వాత, ఈ పరిణామం కెనడా ఎగుమతిదారులకు పెద్ద ఊరటగా మారింది.
చైనా మార్కెట్ మళ్లీ అందుబాటులోకి రావడం కెనడా వ్యవసాయ రంగానికి మాత్రమే కాకుండా, ప్రాసెసింగ్ పరిశ్రమలు, అనుబంధ రంగాలకు కూడా ఊపిరి పోసే అంశంగా మారింది. దీర్ఘకాలంలో ఇది ఉపాధి అవకాశాలను పెంచడానికీ, దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడే అవకాశముంది. అంతేకాదు, చైనాకు కీలక వ్యవసాయ భాగస్వామిగా కెనడా తిరిగి బలంగా నిలబడుతున్న సంకేతంగా కూడా ఈ ఒప్పందాన్ని విశ్లేషకులు చూస్తున్నారు. కాగా, ఈ ఒప్పందాన్ని కొత్త భాగస్వామ్యం, కొత్త యుగంకు నాంది పలికే అడుగుగా కార్నీ అభివర్ణించారు. భవిష్యత్తులో ఇది కెనోలా వరకు మాత్రమే పరిమితం కాకుండా, ధాన్యాలు, పప్పులు, లాబ్‌స్టర్, బీఫ్, పోర్క్, పెట్ ఫుడ్ వంటి ఇతర ఉత్పత్తులకు కూడా విస్తరించే అవకాశముందని ఆయన తెలిపారు. అంటే, ఇది ఒకే ఉత్పత్తి ఒప్పందం కాకుండా, విస్తృత వాణిజ్య పునరుజ్జీవనానికి బీజం వేసే ప్రయత్నంగా కనిపిస్తోంది. కార్నీ– జిన్‌పింగ్ భేటీకి ముందు నుంచే కెనడా–చైనా సంబంధాల్లో మెరుగుదల కనిపించిందన్నది గమనార్హం. గత ఆ ఏడాది ఆగస్టులో ఇరు దేశాలు సంయుక్త ఆర్థిక, వాణిజ్య కమిషన్ సమావేశాలను మళ్లీ ప్రారంభించాయి. గతంలో ఎన్నో సంవత్సరాల పాటు నిలిచిపోయిన ఈ సంప్రదింపుల వ్యవస్థ పునఃప్రారంభం కావడం ద్వైపాక్షిక నమ్మకాన్ని సూచించింది. గత సెప్టెంబర్‌లో న్యూయార్క్‌లో కార్నీ చైనా ప్రధాని లీ చియాంగ్‌ను కలవడం, ఆ తర్వాత దక్షిణ కొరియాలో జరిగిన ఎపెక్ సదస్సులో జిన్‌పింగ్‌తో భేటీ కావడం ఈ సంబంధాలకు మరింత బలం చేకూర్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కార్నీ చేసిన వ్యాఖ్యలు గ్లోబల్ ట్రేడింగ్ వ్యవస్థ భవిష్యత్తుపై ఆసక్తికరమైన చర్చకు దారితీస్తున్నాయి. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి ప్రపంచ స్థాయి సంస్థలు భవిష్యత్తులో తక్కువ ప్రాధాన్యం పొందే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా విధిస్తున్న సుంకాలు, కొనసాగుతున్న వాణిజ్య వివాదాలు ప్రపంచ సరఫరా గొలుసులను అస్తవ్యస్తం చేస్తున్న నేపథ్యంలో, దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయని ఆయన సూచించారు. భవిష్యత్తు వాణిజ్య నియమాలు ద్వైపాక్షిక ఒప్పందాలు, బహుళపాక్షిక ఏర్పాట్లు, నిర్దిష్ట రంగాలపై కేంద్రీకృతమైన కూటముల ద్వారా రూపుదిద్దుకుంటాయని కార్నీ అభిప్రాయపడ్డారు. డిజిటల్ ట్రేడ్ వ్యవసాయం, స్వచ్ఛ శక్తి, వాతావరణ ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్షియల్ సేవలు, సరిహద్దులు దాటే చెల్లింపుల వ్యవస్థలు వంటి రంగాలు ఈ మార్పులో కీలక పాత్ర పోషించనున్నాయి.
కాగా, ఏ రకంగా చూసినా, కెనోలా వాణిజ్య ఒప్పందం కెనడాకు కేవలం ఆర్థిక లాభం మాత్రమే కాదు.. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ మారుతున్న దిశలో తన స్థానం పునర్నిర్మించుకునే వ్యూహాత్మక అడుగుగా కూడా నిలుస్తోంది. చైనాతో సంబంధాల పునరుద్ధరణ ద్వారా కెనడా తన వ్యవసాయ శక్తిని రాజకీయ, ఆర్థిక ప్రభావంగా మలచుకునే ప్రయత్నం చేస్తోందని ఈ పరిణామాలు స్పష్టంగా సూచిస్తున్నాయి.

## లంచాలు ఇస్తేనే మృతదేహాల అప్పగింత!

**టెహ్రాన్ :** ఇరాన్‌లో మతపాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలువెల్లువెత్తగా, భద్రతాబలగాలు జరిపిన కాల్పుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. దేశవ్యాప్తంగా రెండు వారాలకు పైగా కొనసాగిన నిరసనల్లో కనీసం 2,435మంది మరణించినట్లు హక్కుల సంఘాలు చెబుతున్నాయి. బిబిసి కథనం ప్రకారం, ప్రదర్శనల సమయంలో మృతి చెందినవారి మృతదేహాల అప్పగింతకు ఇరాన్ అధికారులు భారీ మొత్తాలు కోరుతున్నారు. బాధిత కుటుంబాలు ఈ విషయాన్ని తెలిపినట్టు బిబిసి పేర్కొంది. పలువురిని ఉటంకిస్తూ బిబిసి ఇచ్చిన సమాచారాన్ని అనుసరించి, మృతదేహాలను మార్చువరీలు, ఆసుపత్రుల్లో నిల్వ ఉంచి, బంధువులు డబ్బు చెల్లిస్తేనే భద్రతా దళాలు వాటిని విడుదల చేస్తున్నాయి. ఉత్తర ఇరాన్‌లోని రాష్ట్ నగరానికి చెందిన ఒక కుటుంబం, తమ బంధువు మృతదేహాన్ని విడుదల చేయడానికి భద్రతా బలగాలు 700 మిలియన్ టోమాన్లు (సుమారు 5,000 డాలర్లు; 3,700 పౌండ్లు) డిమాండ్ చేశాయని బిబిసికి తెలిపింది. ఆ మృతదేహం పోర్సినా ఆసుపత్రి మార్చురీలో, మరో కనీసం 70 మంది మృత ప్రదర్శనకారుల మృతదేహాలతో కలిపి ఉంచినట్లు వారు చెప్పారు.
ఇదే సమయంలో, తెహ్రాన్‌లో కుర్దిష్‌కు చెందిన సీజనల్ నిర్మాణ కార్మికుడి కుటుంబం అతని మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వెళ్లగా, దానికి బదులుగా ఒక బిలియన్ టోమాన్లు (సుమారు 7,000 డాలర్లు; 5,200 పౌండ్లు) చెల్లించాలని చెప్పినట్లు బిబిసికి తెలిపారు. ఆ మొత్తం చెల్లించలేని పరిస్థితిలో కుటుంబం తమ కుమారుడి మృతదేహాన్ని తీసుకోకుండా తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇరాన్‌లో సాధారణంగా ఒక నిర్మాణ కార్మికుడి నెలసరి ఆదాయం 100 డాలర్లకు కూడా తక్కువగా ఉంటుంది.

## రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ జి రామ్ జీ' చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రాల వాటాను పెంచి కేంద్రం తన బాధ్యత నుంచి తప్పు కునేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. నూతన విద్యుత్ బిల్లు ప్రకారం ఇక నుండి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ బాధ్యతలను కేంద్రమే చూస్తుందని, విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ద్వారా విద్యుత్ ధరలను కూడా నిర్ణయిస్తుందని, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి, ముందుగానే వసూలు చేస్తారని, ఉచిత విద్యుత్‌ను, క్రాస్ సబ్సిడీని కూడా రద్దు చేస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎం, కార్మిక సంఘం నాయకులు జె. వెంకటేష్ భూపాల్, వంగూరు రాములు, ఈశ్వర్ రావు, బొప్పని పద్మ,శంకర్ ,మూడ్‌శోభన్, ఆర్. శ్రీరామ్‌నాయక్, ఎం.ధర్మా నాయక్, కోట రమేష్, ఎం.వెంకటేష్, ఎం.దశరథ్, తదితరులు పాల్గొన్నారు. విత్తన బిల్లును సవరించి, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే కేంద్రం పునరుద్ధరించాలని, లేదంటే, తమ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని పశ్యపద్మ హెచ్చరించారు.టి.సాగర్ మాట్లాడుతూ అణు బిల్లు ప్రజలకు,పర్యావరణానికి నష్టం కలుగుతందన్నారు.

## త్వరలో భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

రెండు సార్లు ముఖ్యమంత్రి అయిన వ్యక్తులు రాజకీయ, కుటుంబ, పార్టీ ప్రయోజనాల కోసమే పనిచేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ఆలోచన చేయలేదు. కుటుంబం మొదటి ప్రాధాన్యత, పార్టీ రెండో ప్రాధాన్యత, రాజకీయాలు మూడో ప్రాధాన్యతగా గత పాలకులు ఆలోచించారు. తెలంగాణ యువత గురించి ఆలోచించలేదు. వాళ్ల ఉద్యోగాలు తొలగిస్తేనే తమ ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత నడుం బిగించారు. ఫలితంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడింది'' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్య,, ఆహారం తో పాటు నాణ్యమైన నైపుణ్యాలపై దృష్టి పెండుతోందని ఆయన చెప్పారు. నాణ్యమైన నైపుణ్యాలు లేకపోవడంతో అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడలేకపోతున్నామన్నారు. విద్యలో స్కిల్ చాలా ముఖ్యమైనది.. నైపుణ్యాల అభివృద్ధి కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన విద్యను అందించే అవకాశం ప్రభుత్వం దగ్గర ఉందని ఆయన పేర్కొన్నారు. విద్య ఒక్కటే ప్రజల జీవితాల్లో మార్పు, వెలుగులు తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మమ్మద్ అజారుద్దీన్ , సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు ఆరెకపూడి గాంధీ, కాలే యాదయ్య, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ రాజ్యమే

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మారిపోయిందని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ను ఉద్దేశించి మాట్లాడుతూ, బాక్సింగ్ లెజెండ్ మైక్ టైసన్ ఇచ్చే పవర్‌ఫుల్ పంచ్‌తో గత పాలకులను రేవంత్‌రెడ్డి పోల్చారు.''మనం ఒక్క పంచ్ ఇస్తే ప్రత్యర్థుల కథ ముగిసిపోయింది. ఆ దెబ్బకు వారు నేరుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు.''అని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అరాచకాలకు ప్రజలు తమ ఓటుతో సరైన సమాధానం చెప్పారని, ఒక్క దెబ్బతోనే ప్రత్యర్థులు రాజకీయంగా కోలుకోలేని స్థితికి వెళ్లారని ఆయన వ్యాఖ్యనించారు. ఇకపై తాను ఓడిపోయిన నాయకుల గురించి గానీ, కాలగర్భంలో కలిసిపోయిన రాజకీయ శక్తుల గురించి గానీ చర్చించి సమయం వృధా చేయదలచుకోలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని, అందుకే ప్రత్యర్థుల గురించి మాట్లాడకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 2024 నుండి 2034 వరకు వరుసగా రెండు పర్యాయాలు కాంగ్రెస్ జెండానే తెలంగాణపై రెపరెపలాడుతుందని, ప్రజా పాలన నిరంతరాయంగా కొనసాగుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రసంగం ద్వారా తన కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం ఖాయమనే సంకేతాలను ఆయన పంపారు.

## ట్రంప్ చేతికి 'నోబెల్ శాంతి'

(మొదటి పేజీ తరువాయి)

అధికారి ఒకరు తెలిపారు. వైట్ హౌస్‌లో భేటీ అనంతరం మచాడోను ప్రశంసిస్తూ, ఆమె ఎంతో కష్టాలు ఎదుర్కొన్న అద్భుతమైన మహిళ అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ పతకం ఇవ్వడం పరస్పర గౌరవానికి ప్రతీక అని ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. 'నేను చేసిన పనికి గాను ఆమె తన నోబెల్ శాంతి బహుమతిని నాకు అందజేశారు' అని ఆయన అన్నారు. మచాడో మీడియాతో మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడికి నోబెల్ శాంతి బహుమతి పతకాన్ని అందజేశానని అన్నారు. మన స్వేచ్ఛ కోసం ఆయన చూపిన ప్రత్యేక నిబద్ధతకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వెనిజులా అధ్యక్షుడు నికొలాస్ మదురోను డ్రగ్ ట్రాఫికింగ్ వంటి పలు ఆరోపణలపై అమెరికా నేరుగా ఆయన అధికార నివాసంపైనే దాడి చేసి, భార్యతోసహా ఆయనను బందీ చేసి న్యూయార్క్ తీసుకెళ్లిన విషయం తెలిసిందే. మదురో చిరకాల ప్రత్యర్థి మచాడో ఇప్పుడు ట్రంప్‌ను కలుసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. వెనిజులాకు తానే తాత్కాలిక అధ్యక్షుడినంటూ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో, మచాడో చర్యను చాలా మంది పోల్చి చూస్తున్నారు. దీనిని పూర్తిగా రాజకీయ భేటీగానే పేర్కొంటున్నారు. ట్రంప్ గతంలో మచాడోకు దేశంలో విస్తృత మద్దతు లేదని వ్యాఖ్యానించినప్పటికీ, మదురో తిరస్కరించిన 2024 ఎన్నికల్లో ఆమె పార్టీ విజయం సాధించిందనే అభిప్రాయం ఉంది. వాషింగ్టన్ పర్యటనకు ముందు, మచాడో దాదాపు 11 నెలలు వెనిజులాలో రహస్యంగా గడిపారు. నోబెల్ శాంతి బహుమతిని మచాడో స్థానంలో ఆమె కుమార్తె స్వీకరించింది.

## కందుల కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్నదన్నారు. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాలలో కందులు సాగు చేయగా, సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందనే అంచనాలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం వానాకాలం 2025–26కు గాను 1,71,310 మెట్రిక్ టన్నుల కందుల కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చిందన్నారు. ఎంఎస్‌పి ధరలతో కందుల కొనుగోళ్ల ప్రక్రియ గత నెల డిసెంబర్ 27 నుంచి ప్రారంభమై 26 మార్చి, 2026 వరకు కొనసాగుతుందని, రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించగా, ఇప్పటి వరకు 13 కేంద్రాలు ప్రారంభించామని వివరించారు. శుక్రవారం (జనవరి 16వ తేదీ వరకు) 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేశామని, దీని విలువ రూ. 0.24 కోట్లుగా ఉందని వివరించారు. ప్రస్తుతం నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సక్రమంగా కొనసాగుతున్నాయని, ఇతర కందులు సాగు చేసే జిల్లాల్లో కూడా పంట రాకలు పెరిగిన మేరకు దశలవారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, కొనుగోలు చేసిన కందులకుగాను చెల్లింపులు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డిబిటి ద్వారా నిర్ణీత కాలంలో జమ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

## 'విలువల శిఖరం' జైపాల్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

అర్పించారు. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి దేశానికి, రాష్ట్రానికి అందించిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ యోధుడు, విలువల శిఖరం, ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి పోషించిన పాత్రను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని సిఎం గుర్తు చేశారు. రాజకీయాల్లో నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా జైపాల్‌రెడ్డి నిలిచారని సిఎం పేర్కొన్నారు.

**జైపాల్ రెడ్డి స్ఫూర్తిదాయక వారసత్వం చిరస్మరణీయం**

మాజీ కేంద్ర మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని, గాంధీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిపిసిసి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి.కుమార్ రావు, ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.ఎస్.అన్సారీతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుదర్శన్ రావు, మణిలాల్ షా పాల్గొన్నారు. జైపాల్ రెడ్డి దేశానికి, కాంగ్రెస్‌కు అందించిన అమూల్యమైన సేవలను, ఆయన దూరదృష్టి గల నాయకత్వాన్ని, ప్రజాసేవకు అంకితమైన జీవన ప్రయాణాన్ని స్మరించుకున్నారు. జైపాల్ రెడ్డి స్ఫూర్తిదాయక వారసత్వం చిరస్మరణీయమని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన జైపాల్ రెడ్డి**

ఉత్తమ పార్లమెంటేరియన్, మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచారని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు. జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో అపూర్వమైన వ్యక్తిత్వం గల వ్యక్తి, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహానాయకుడని ఆయన ఒక ప్రకటనలో కొనియాడారు. విద్య, పర్యావరణం, భూసంస్కరణలు, పరిశ్రమలు, సమాచార సాంకేతికత వంటి కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ దేశ అభివృద్ధిలో విశేష పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. ప్రత్యేకించి తెలంగాణ ప్రజల హక్కుల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర స్థాయిలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. నిస్వార్థ రాజకీయ జీవితం, వ్యక్తిగత నైతిక విలువలు, ప్రజాస్వామ్యం పట్ల ప్రగాఢ నమ్మకం కలిగిన నాయకుడిగా జైపాల్ రెడ్డి తరతరాలకు ఆదర్శమన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షానే నిలబడి ప్రశ్నించే స్వభావం ఆయనకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో జైపాల్ రెడ్డి ఆలోచనలు, విధానాలు మార్గదర్శకమని, యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ఆచరణలో చూపిన నాయకుడిగా ఆయన సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు.

**దేశానికి, రాష్ట్రానికి జైపాల్ రెడ్డి ఉత్తమ సేవలందించారు : సిపిఐ**



మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డికి సిపిఐ నేతలు నివాళులు అర్పించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, ఇతర నేతలు పి.వి.మార్గ్‌లోని జైపాల్‌రెడ్డి సమాధి 'స్ఫూర్తి స్థల్' వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీ య కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. పార్లమెంట్ సభ్యులుగా, కేంద్ర మంత్రిగా దేశానికి, రాష్ట్రానికి జైపాల్ రెడ్డి సేవలందించారని, తద్వారా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరుప్రతిష్టలు తెచ్చుకున్నారని పల్లా వెంకట రెడ్డి కొనియాడారు.

## రక్షణలో కమ్యూనిస్టులు

(మొదటి పేజీ తరువాయి)

సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాడుతుందన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కే క్రమంలోనే పాలకులు యూనియన్ల రద్దు అంటున్నారని మరో పక్క అర్బన్ నక్సలైట్ ముద్ర వేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. 1925లో సిపిఐ ఆవిర్భావించిన తర్వాత నిర్బంధాల నడుమ నిషేధానికి గురైందని కమ్యూనిస్టుల భావాజాలంతో అనేక మంది కాంగ్రెస్‌లో చేరి సోషలిస్టు విభాగం ఏర్పాటు చేసి పోరాటం చేశారని కూనంనేని తెలిపారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం కమ్యూనిస్టు నాయకుడు అస్లాత్ మహని తొలిసారి ఇచ్చాడని ఆ నినాదాన్ని భగత్‌సింగ్ విశ్వవ్యాపితం చేశాడన్నారు. కమ్యూనిస్టుల ప్రత్యామ్నాయమే సరైన ప్రత్యామ్నాయమని ఆయన తెలిపారు. చిట్టగాంగ్, గదర్, తెబగా, వాయిలార్, పోనప్ప సహా పలు పోరాటాలను నిర్వహించిన వారంతా సిపిఐలో చేరారన్నారు. మీరట్, కాన్పూర్, విషాద సహా పలు కుట్ర కేసులను ఎదుర్కొని నిలబడ్డ సిపిఐ మరో వందేళ్లయినా ప్రజల పక్షాన నిలబడేందుకు సిద్ధమేనని సాంబశివరావు తెలిపారు. వందేళ్ల వేడుక భవిష్యత్తు పోరాటలకు స్ఫూర్తిని ఇవ్వనుందన్నారు.

**రెండవ శతాబ్దంలోనూ ప్రజా పోరాటాలు : ప్రకాష్‌బాబు**

శతాబ్ద కాలం పాటు పోరాటం సాగించిన సిపిఐ రెండవ శతాబ్దంలోనూ ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాష్‌బాబు తెలిపారు. మీడియా సమావేశంలో ప్రకాష్‌బాబు మాట్లాడుతూ 2024 డిసెంబర్ 24 శతాబ్ది ఉత్సవాలు కాన్పూర్‌లో ప్రారంభమయ్యాయని ముగింపు కమ్యూనిస్టు ఖిల్లా ఖమ్మంలో ముగుస్తున్నాయన్నారు. శతాబ్ద కాలం ప్రజల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పనిచేశామని అదే సిద్ధాంతం, లక్ష్యంతో భవిష్యత్తులోనూ పోరాడతామన్నారు. మతోన్మాద శక్తులను నిలువరించే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు.

**మూడు ప్రదర్శనల ద్వారా సభా స్థలికి : బాగం**

మూడు ప్రదర్శనల ద్వారా ప్రజలు బహిరంగ సభా స్థలికి చేరుకుంటారని ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. పెవిలియన్ మైదానం నుంచి జనసేవాదళ్ ప్రదర్శన ప్రారంభమవుతుందని దీనికి రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, నాయకత్వం వహిస్తారని తర్వాత కళాకారుల వృత్తి సంఘాల ప్రదర్శన ఉంటుందన్నారు. రెండవ ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం నుంచి ప్రారంభమవుతుందని దీనికి జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మూడవ ప్రదర్శన నయాబజార్ కళాశాల కాల్వొడ్డు నుంచి ప్రారంభమవుతుందని దీనికి ఏపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దండి సురేష్ నాయకత్వం వహిస్తారని హేమంతరావు తెలిపారు. మూడు ప్రదర్శనలు సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతాయని ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద మూడు ప్రదర్శనలకు జాతీయ నాయకులు స్వాగతం పలికేందుకు వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కళారూపాల ప్రదర్శనకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్ పాల్గొన్నారు.

## రూ.3.90కోట్ల కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్‌టాప్లు, ఐదు డెస్క్‌టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో వసునూరి బసవరాజు, యాదాద్రి జిల్లా, జెల్లా పాండు, యాదాద్రి జిల్లా,మహేశ్వరం గణేష్ కుమార్,ఇయాదాద్రి జిల్లా, ఈగజులపాటి శ్రీనాథ్, జనగామ, యెనగంధుల వెంకటేష్, జనగామ,కోదురి శ్రవణ్, జనగామ, కొలిపాక సతీష్ కుమార్, కొడకండ్ల (ఎం), జనగామ,తడూరి రంజిత్ కుమార్, నర్మెట్ట, జనగామ, దుంపల కిషన్ రెడ్డి, ఆత్మకూర్ (ఎం), యాదాద్రి జిల్లా, దశరథ మేఘావత్, తుర్కపల్లి,నారా భాను ప్రసాద్, యాదగిరిగుట్ట, గొపగాను శ్రీనాథ్, యాదాద్రి జిల్లా ఒగ్గు కర్నాకర్, యాదాద్రి జిల్లా, కమల్ల శివ కుమార్,అమంగల్, నల్లగొండ, అలేటి నాగరాజు, యాదాద్రి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరి గుట్లలో అన్లైన్ సర్వీస్ నిర్వహించేవారని, ఇందులో నిందితుల్లో ఒకడైన గణేష్ తనకు తాను అన్ లైన్ సెంటర్లతో పరిచయం చేసుకోని చేల్లించాల్సన మొత్తాన్ని ఏన్.ఆర్.ఐ ఖాతా పే చేస్తానని చెప్పి రైతుల నుండి మొత్తం డబ్బులను మీ సేవ వ్యక్తుల ద్వారా వసూలు చేయించి అట్టి వసూలు చేసిన డబ్బు నుండి అన్లైన్ సర్వీస్ వ్యక్తులకు మరియు మధ్యవర్తులకు కమిషన్ చొప్పున డబ్బు అందజేస్తూ ఇ చాలాన్ని ప్రధాన నిందితుడుకి పంపిచేవాడన్నారు. ఇలా వచ్చిన చలాన్లను బసవరాజు అట్టి ధరణీ/భూభారతీ వెబ్సైట్లో ఇన్ స్పెక్ట్ ఎడిట్ అప్లికేషన్ ఉపయోగించి చాలన్ రుసుము తగ్గించేవాడని, అనంతరం అట్టి ఛలాన్ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడని,ఇదే క్రమంలో నిందితులు మొబైల్ ఆప్లికేషన్ ను ఉపయోగించి నిందితులు ప్రభుత్వానికి చెల్లించిన రుసుము కు సంబంధించి వెబ్సైట్లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసి అనంతరం మార్పు చేసిన రుసుమును మాత్రమే ప్రభుత్వానికి చెల్లించిన నకిలీ చలాన్లను స్థానిక యం.ఆర్.ఓ/ రిజిస్ట్రేషన్ కార్యాలయములో మధ్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మోసాలకు పాల్పడేవారన్నారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడి కావున జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మధ్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణీ, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్ సైట్లో నమోదు చేసేవారని, ఇందుగాను ప్రధాన నిందితులు మిగితా వారికి పది శాతం నుండి 30శాతం వరకు కమిషన్ చెల్లించేవారన్నారు.ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబందించిన లావా దేవిల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారని, అలాగే ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 22 కేసులు నమోదు కాబడ్డాయని, ఇందులో జనగామ జిల్లాలో 7కేసులు, యాద్రాది జిల్లాలో 15కేసులు నమోదు కాబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.ఈ ముఠా పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, ఎ.ఎస్పీ పండరి చేతన్, జనగామ ఇన్స్పెక్టర్ సత్యనారయణ రెడ్డి, రఘునాథ్‌పల్లి సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఇతర ఎస్.ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## 'జ్ఞాన సరస్వతి' వర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)

దాని ఏర్పాటు జాప్యం జరిగిందని సిఎం అభిప్రాయపడ్డారు. దీనికి పరిష్కారంగా, చదువుల తల్లి కొలువైన బాసరలోనే 'జ్ఞాన సరస్వతి యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బాసర ఐఐఐటి ఆవరణలో దీనిని నెలకొల్పాలని, ఇందుకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావును వేదికపైనే ఆదేశించారు. ఈ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణ విద్యార్థులకు వరంలా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**తుమ్మిడిహట్టి ప్రాజెక్టుతో సస్యశ్యామలం**

''జల్, జంగల్, జమీన్'' అని నినదించిన పోరాటాల గడ్డపై రైతులకు అన్యాయం జరగనివ్వబోనని సిఎం హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ రైతాంగానికి సాగునీరు అందాలంటే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాల్సిందేనని, గత పాలకులు దీనిని విస్మరించారని విమర్శించారు. రాబోయే బడ్జెట్ సమావేశాలలోపు తుమ్మిడిహట్టి ప్రాజెక్టు పై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆదేశించారు. ప్రాజెక్టులోని ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని వెల్లడించారు. అలాగే చనాక–కొరటా ప్రాజెక్టుకు సి.రామచంద్రారెడ్డి పేరు, సదర్మట్ బ్యారేజీకీ నర్సారెడ్డి పేరు పెడుతున్నట్లు ప్రకటించి, వారి సేవలను కొనియాడారు.

**ఎయిర్ బస్ నుంచి పారిశ్రామిక హబ్ వరకు..**

జిల్లా రవాణా, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని సీఎం చెప్పారు. ''ఒకప్పుడు ఎర్రబస్సు తిరగని ఆదిలాబాద్‌లో,ఇప్పుడు ఎయిర్ బస్ తిరిగేలా ఎయిర్‌పోర్టును నిర్మిస్తా'' అని ప్రకటించారు. కేవలం ఎయిర్‌పోర్టుతో ఆగకుండా, దాని అనుబంధంగా 10 వేల ఎకరాలలో అతిపెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తామన్నారు.దీనివల్ల స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు.


**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉండాలని, ఎన్నికలు ముగిశాక కేవలం అభివృద్ధిపైనే దృష్టి సారించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తానని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సాధించుకుంటానని స్పష్టం చేశారు. ఇందుకు బీజేపీ ప్రజా ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు.తనకు ఎలాంటి పర్సనల్ ఎజెండాలు లేవని,కేవలం ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాల అమలు..**

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల గురించి సీఎం వివరిస్తూ.. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500లకే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు సన్నబియ్యం బోనస్ వంటి పథకాలు నిరాటంకంగా కొనసాగుతాయని చెప్పారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని,మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. చివరగా, ఫిబ్రవరి మొదటి వారంలో ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజా ప్రతినిధులు,అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సుదర్శన్ రెడ్డికి సూచించారు. జిల్లాకు కావాల్సిన నిధులపై నివేదిక ఇస్తే వెంటనే మంజూరు చేస్తామని, పాలమూరు జిల్లాకు సమానంగా ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తామని వాగ్దానం చేస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

## సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాలకు సాగునీరు



నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. 2016 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును 676.592 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించగా,ఇందుకోసం 1,176 ఎకరాల భూమిని సేకరించారని పేర్కొన్నారు. ఈ బ్యారేజీ ద్వారా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ మండలాల్లో 12 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ప్రాంతాల్లో 5వేల ఎకరాలు, కలిపి మొత్తం 18,016 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో కడెం, ఖానాపూర్, కోరుట్ల మండలాల్లోని 34 గ్రామాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుందని వివరించారు. పాత సదర్మాట్ అనికట్, గంగానాలా ఆయకట్టు స్థిరీకరణకు 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నీటిని సాగు అవసరాలకు అనుగుణంగా విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

ప్యాకెట్లో దేవతల ఫోటోతో సహా బెల్లం, పసుపు కుంకుమ వస్తువులు అందజేయడం జరుగుతుంది. ఇందుకుగానూ, బంగారం ప్రసాదం ప్యాకెట్ పొందాలనుకునే భక్తులు కేవలం రూ.299 చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు www.tgsrtclogistics.co.in వెబ్సైట్లో లాగిన్ ద్వారా లేదా సమీపంలోని టిజిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్స్ కౌంటర్లలో అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం, టిజిఎస్‌ఆర్‌టిసి కాల్ సెంటర్‌ను 04069440069, 04023450033 నంబర్లలో సంప్రదించవచ్చు.

# కమ్యూనిస్టుకు మరణంలేదు..

# కమ్యూనిజానికి అంతం లేదు




కూనంనేని సాంబశివరావు
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి


ఎన్నో కుట్రలు..ఎన్నెన్నో నిర్బంధాలు..ఉరికొయ్యలను ఛేదించి చెరసాలల్లో పురుడుపోసుకొని భారత గడ్డపై నిండు నూరేళ్ళుగా ప్రస్థానం సాగిస్తున్న అజరామర త్యాగాలగని భారత కమ్యూనిస్టు పార్టీ. 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్‌లో స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల ముగింపు వేడుకలను లక్షలాది మందితో కమ్యూనిస్టుల పురిటిగడ్డ ఖమ్మం పట్టణంలో ఈ నెల 18వ తేదీన జరపడానికి భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయించింది. భారతదేశ చరిత్రలో మహత్తర ఘట్టంగా నిలవబోతున్న ఈ భారీ బహిరంగసభకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతున్నారు. 10వేల మంది అరుణ సైన్యం కవాతు చేయబోతున్నది. ఎర్రసముద్రంగా మారబోతున్న ఖమ్మం బహిరంగసభకు భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సౌహార్ద సందేశం ఇవ్వబోతున్నారు. నాలుగు రోజులపాటు జరుగుతున్న వేడుకలలో 20వ తేదీన నిర్వహించే సెమినార్‌కు డి.రాజాతోపాటు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వార్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరవుతున్నారు.

కంసుడు శ్రీకృష్ణుడిని పుట్టుకతోనే అంతంచేయ ప్రయత్నించిన విధంగా భారత కమ్యూనిస్టు పార్టీని చెరసాలలోనే పసిగుడ్డు ప్రాయంలోనే బ్రిటీష్ సామ్రాజ్యవాద వలస ప్రభుత్వం అంతమొందించే ప్రయత్నం చేసింది. తుదకు బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని మట్టికరిపించడంలో కమ్యూనిస్టు పార్టీ వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసింది.

**కమ్యూనిస్టు పార్టీ పుట్టుక—అవలోకనం**

సిపిఐ పుట్టుకే శ్రామికవర్గ అంతర్జాతీయత, దేశభక్తితో మిళితమై ఉంది. వివిధ విభాగాలుగా ఉన్న దేశభక్తులను, స్వాతంత్ర్య సమరయోధులను కమ్యూనిజంవైపు తీసుకువచ్చింది. ఆవిధంగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటులో నాలుగు ప్రధాన స్రవంతులు కలిశాయి.

1) మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విదేశాలలో, ఆ తర్వాత జర్మనీ, అమెరికా, టర్కీ, ఆఫ్ఘనిస్థాన్‌లలో విప్లవ కార్యాచరణలో ఉన్న భారత జాతీయ విప్లవకారులు అక్టోబర్ విప్లవ ప్రభావం క్రిందకు వచ్చారు. యం.చటోపాధ్యాయ, బర్కాతుల్లాఖాన్, ఎంపిబిటి ఆచార్య, ఎంఎన్.రాయ్, అబని ముఖర్జీ తదితరులు ఒక స్రవంతి.

2) సామ్రాజ్యవాదులు, కాలిఫ్‌ల పట్ల జరిపిన అన్యాయాలకు వ్యతిరేకంగా ఇండియాలోని ముస్లీం ప్రజలు యుద్ధ కాలంలో (1914—16) విదేశాలకు వెళ్లి పాన్ ఇస్లామిక్ ఖిలాపత్ ఉద్యమాన్ని నిర్మించిన ఉద్యమకారులు, యుద్ధానంతరం మహత్తర హిజ్రత్ ఉద్యమానికి సంబంధించిన జాతీయ విప్లవకారులు కూడా అక్టోబర్ విప్లవ ప్రభావం క్రిందకు వచ్చారు. వారిలో మహ్మద్ అలీ షఫిక్, రహమత్ ఆలిఖాన్, ఫిరోజుద్దీన్ మల్సూర్, అబ్దుల్ మజీద్, సౌకత్ ఉస్మానీలు ముఖ్యులు.

3) స్వాతంత్ర్య సాధనలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని సాగించే ఆలోచనతో ఆయుధాల సేకరణకు కొన్ని గ్రూపులు విదేశాలకు వెళ్లాయి. కెనడా, అమెరికా తదితర దేశాల్లో స్థిరపడిన భారతీయులు ముఖ్యంగా పంజాబీలు 1913లో శాన్‌ఫ్రాన్సీస్కోలో 'గదర్ పార్టీ'ని స్థాపించారు. కామా గటమార్ అనే ఒక ఓడను ఆయుధాలతో ఇండియాకు పంపించారు. ఆ పోరాటం విఫలమైన తర్వాత గదర్‌పార్టీ ముఖ్యులందరూ భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వీరిలో రతన్ సింగ్, సంతోష్ సింగ్‌లు ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు వ్యక్తి దర్శి చెంచయ్యలాంటి అనేక మంది ఉన్నారు.

4) భారతదేశంలో ఉన్న జాతీయ విప్లవకారులు, జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా పనిచేస్తున్న సోషలిస్టు కాంగ్రెస్ పార్టీలోని అనేక మంది, అతివాదపక్షం, టెర్రరిస్టు సంస్థలు, ఖిలాపత్ ఉద్యమ నాయకులు, గదర్ పార్టీ నాయకులు 1921—22లో శాసనోల్లంఘన ఉద్యమం విఫలమయిన తర్వాత గాంధీజి ప్రతిఘటన సిద్ధాంతంపట్ల భ్రమలు కోల్పోయిన వ్యక్తులు, గ్రూపులు అక్టోబర్ విప్లవ ప్రభావంతో శాస్త్రీయ సోషలిజంవైపు ఆకర్షితులయ్యారు. ఆ తర్వాత వీరే దేశంలో తొలి కమ్యూనిస్టు గ్రూపులు స్థాపించారు. బొంబాయిలో డాంగే, మద్రాసులో సింగార్‌వేల్ సెట్టియార్, కలకత్తాలో ముజఫర్ అహ్మద్, లాహోర్‌లో ఇంక్విలాబ్ గ్రూపులకు చెందిన గులాం హుస్సేన్ తదితరుల కలయికతో 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు అయ్యింది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో, రైతాంగ పోరాటాలలో, స్వదేశీ సంస్థానాల్లో, విముక్తి పోరాటాల్లో, సంఘ సంస్కరణలు, సామాజిక మార్పుల కోసం జరిగిన పోరాటాల్లో ఇంకా అనేక రీతుల్లో జరిగిన భారత ప్రజల విప్లవ ఉద్యమంలో పాల్గొన్న ముఖ్యుల్లో అత్యధికులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

1920లో రష్యాకు చెందిన తాష్కెంట్‌లో ప్రవాస భారతీయులు భారత కమ్యూనిస్టు పార్టీ అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. సంస్థాపన సమావేశంలో ఏడుగురు పాల్గొన్నారు. వారిలో ఎంఎన్.రాయ్, ఎలెన్ రాయ్, అబని ముఖర్జీ, రోజా ఇటింగఫ్, ఎంపిబిటి ఆచార్య, ఇరువురు విదేశీయులు ఉన్నారు. కార్యదర్శిగా మహ్మద్ షఫి ఎన్నికయ్యారు. ఎం.ఎన్. రాయ్ ఆ సమావేశంలో పాల్గొన్నప్పటికీ దాన్ని ఆయన సమర్థించలేదు. భారత్‌లోని కమ్యూనిస్టు గ్రూపులతో సంబంధాలు పెట్టుకున్నారు. భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపకుడు ఎం.ఎన్.రాయ్ అని వ్యాప్తిలో ఉన్న అభిప్రాయాన్ని ఆయన స్వయంగా తన 'స్మృతుల్లో' నిరాకరించారు. 1920లో విదేశీ గడ్డపైన ఏర్పాటైన ఆ తేదీని పార్టీ సంస్థాపక తేదీగా పరిగణించరాదని ఉమ్మడి పార్టీ రోజుల్లోనే కేంద్ర కార్యదర్శివర్గం నిర్ణయించింది. ఆ విధంగా సత్యభక్త ఆధ్వర్యంలో కాన్పూర్‌లో జరిగిన మహాసభలో 1925 డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన రోజును భారతదేశంలో పార్టీ వ్యవస్థాపక దినంగా పార్టీ గుర్తించింది. సింగార్‌వేల్ సెట్టియార్ మహాసభకు అధ్యక్షత వహించారు. ఎస్‌వి.ఘాటే, జెపి బాగర్‌హెట్‌లు కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా హస్రత్ మొహాని వ్యవహరించారు. ఆయనే ఇంక్విలాబ్ నినాద సృష్టికర్త. భగత్‌సింత్ ఇంక్విలాబ్ జిందాబాద్ నినదిస్తూ ఉరికంబం ఎక్కారు.



**ఎన్నో కుట్ర కేసులు :**

కమ్యూనిస్టు భావాలను అంకురార్పణ దశలోనే అణచివేసేందుకు బ్రిటీష్ పాలకులు కమ్యూనిస్టులపై ఎన్నో కేసులు పెట్టారు. అందులో ముఖ్యమైనవి 1922లో మోపబడ్డ పెషావర్ కుట్ర కేసు, 1924లో కాన్పూర్ కుట్రకేసు, 1929లో మీరట్ కుట్రకేసు. కాన్పూర్ కుట్ర కేసులో ముజఫర్ అహ్మద్, డాంగే, సౌకత్ ఉస్మానిలు ఇరికించబడ్డారు.

**చారిత్రక మీరట్ కుట్రకేసు :**

1929లో కలకత్తాలో అఖిల భారత కార్మిక మహాసభ జరిగిన తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం 31మంది కమ్యూనిస్టు నాయకులను, ఇతర పెద్ద నాయకులనందరిని అరెస్టు చేసింది. ఈ కేసు విచారణ 1929 నుండి 1933వరకు నాలుగేళ్ళు కొనసాగింది. కమ్యూనిస్టులు కోర్టును ప్రచార వేదికగా తమ సైద్ధాంతిక విస్తరణకు మీరట్ కుట్ర కేసును ఉపయోగించుకున్నారు.

**లాహోర్ కుట్రకేసు :**

సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా ఊరేగింపుకు నాయకత్వం వహిస్తున్న పంజాబ్ కేసరి లాలా లజపతి రాయ్‌పై బ్రిటీష్ పోలీసులు విచ్చలవిడిగా లాఠీఛార్జి చేయడంతో ఆయన మరణించారు. దానికి కారకుడైన శాండర్స్‌ను 1928 డిసెంబర్ 17న భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాజ్‌గురులు లాహోర్‌లో కాల్చి చంపారు. దీనికి తోడు కేంద్ర శాసనసభలో 1929 ఏప్రిల్ 8న తమ పార్టీ ఆదేశానుసారం భగత్‌సింగ్, డికే దత్తు బాంబులు వేశారు. రెండు సంవత్సరాలు జరిగిన కోర్టు విచారణ సందర్భంగా దేశభక్తి గేయాలు పాడుకుంటూ, విప్లవం వర్థిల్లాలి (ఇంక్విలాబ్ జిందాబాద్) అనే నినాదాలతో 'మేరారంగ్‌దే.. బసంతి ఛోళా'అనే పాటతో ఈ విప్లవ వీరులు కోర్టు హాల్‌లోకి ప్రవేశించేవారు. తదనంతరం 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీశారు. తదనంతరం భగత్‌సింగ్ సహచరులు అందరూ కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

జితిన్‌దాస్ అనే మరో వీరుడు జైలులో 60 రోజుల పాటు నిరాహారదీక్ష చేసి వీరమరణం పొందాడు.

**కమ్యూనిస్టు పార్టీ నిషేధం**

కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రమాదకరంగా భావించిన బ్రిటీష్ ప్రభుత్వం 1934 జూలైలో పార్టీని నిషేధించింది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులందరూ కాంగ్రెస్‌లోనే ఉండి పనిచేసి దేశస్వాతంత్ర్యం కొరకు ద్విగుణీకృత పోరాటాలు చేశారు.

కాంగ్రెస్‌లోనే అంతర్భాగంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని 1932—34 ఏర్పాటు చేసుకున్నారు. అంతిమంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోని కమ్యూనిస్టులతో పాటు మరెంతో మంది అభివృద్ధి కాముకులు అక్టోబర్ విప్లవ ప్రభావంతో కాంగ్రెస్‌లోని వామపక్ష గ్రూపుగా ఏర్పడ్డారు. తదనంతరం అనేక మంది కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వీరిలో ఇఎంఎస్ నంబూద్రిపాద్, చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, ఏకె. గోపాలన్, కంభంపాటి సీనియర్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు ప్రముఖులు.

**కమ్యూనిస్టు పార్టీ చేసిన వీరోచిత పోరాటాలు**

ఒకనాటి అస్సాం రాష్ట్రంలో ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న చాబర్ సిల్‌హెట్ జిల్లాలోని లోయ ప్రాంతంలో వీరోచిత కౌలు రైతుల పోరాటాలు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగాయి. ఆ పోరాటవీరులు అనేక మంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

మహారాష్ట్రలోని థానే జిల్లాలో భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా వర్లీ తెగకు చెందిన ఆదివాసీలు తిరుగుబాటు చేశారు. 1946లో రాయల్ ఇండియన్ నావీ తిరుగుబాటుదారులు కాంగ్రెస్, ముస్లీంలీగ్ జెండాలతోపాటు కమ్యూనిస్టు పార్టీ జెండాను చేతబూనారు.

పశ్చిమబెంగాల్‌లోని కౌలు రైతులు చేసిన ''తెభాగ'' పోరాటం చరిత్ర ప్రసిద్ధమైంది. కేరళలోని తిరువాన్‌కూర్ సంస్థానంలో కొబ్బరిపీచు కార్మికుల, వ్యవసాయ కార్మికుల, మత్స్య కార్మికుల వీరోచిత పోరాటం ఉన్నప్రవాయిలార్ (మలబార్) పోరాటంగా ప్రసిద్ధిగాంచింది.

ఫ్రెంచ్ వలస పాలన నుంచి పుదుచ్చేరి విముక్తి పోరాటం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో విజయవంతమైంది. పుదుచ్చేరిలో కమ్యూనిస్టు అగ్రనాయకుడైన కీ.శే. వి.సుబ్బయ్యను ఆ రాష్ట్ర విముక్తి ప్రదాతగా గౌరవిస్తారు.

భగత్‌సింగ్ వంటి జాతీయ విప్లవకారుడు సోషలిస్టు సిద్ధాంతం పట్ల ప్రభావితమయ్యారు. చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ తదితరులు హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ పార్టీని ఏర్పాటు చేశారు. తదనంతర కాలంలో భగత్‌సింగ్ సహచరులైన అజయ్ ఘోష్, శివవర్మ, పండిట్ కిషోరీలాల్, విజయ్‌కుమార్ సిన్హా, జయ్‌దేవ్ కపూర్, భగవతి చరణ్, సుఖ్‌దేవ్ లాంటి వారు సిపిఐలో చేరారు. అజయ్ ఘోష్ ఉమ్మడి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూనే 1962లో మరణించారు.


**చారిత్రాత్మక కకోరి పోరాటం**

లక్నో సమీపంలోని కకోరీ రైల్వే స్టేషన్‌పై దాడిచేసి డబ్బు సంపాదించి ఆయుధాలు కొనుగోలు చేయాలనుకొని కొందరు విప్లవకారులు దాడి చేశారు. ఇది కకోరి కుట్రకేసుగా ప్రసిద్ధి చెందింది. ఈ కేసులో ఆసీఫ్ ఖాన్,

(మిగతా 6వ పేజీలో)


ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా — ఎదురుబెదురూ లేక..
చలో ఖమ్మం
2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు


## సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవం దేనికి సంకేతం??




కె.నారాయణ
సిపిఐ సీనియర్ నాయకులు


'పుట్టేవాడికి అన్న, పెరిగేవాడికి తమ్ముడు అదేగా సీపీఐ. నీకు సమకాలికుడు నారా చంద్రబాబు నాలుగు దఫాలు ముఖ్యమంత్రి, నిన్నగాక మొన్నపుట్టిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి, మీపార్టీ పుట్టిన 1925 సంవత్సరమే ఆర్‌ఎస్‌ఎస్ పుట్టింది, అదేమో రాజ్యాధికారానికే వచ్చే .నీవేమో జండాలు పట్టుకుని తిరుగుతున్నావు, అంతేనా??' అని నన్ను ప్రశ్నిస్తుంటారు.

మెరిచేదంతా బంగారం కాదు, చూసేదంతా నిజమూ కాదని నానుడి ఉంది, అది తర్కం ద్వారా నిజమని తేలింది. అయితే ఆ తర్కంలోకి పోవడానికి యిది సందర్భం కాదు.

సిపిఐ గురించి మరోకోణంలో చూడగలిగితే చరిత్రకు న్యాయం జరుగుతుంది.

నిజమే వంద సంవత్సరాలలో సీపీఐ ఏమీ చేయలేదా???

స్వతంత్ర పోరాటం 1757లో ప్లాసీ యుద్ధం తర్వాత 1857లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటంగా గుర్తించబడింది. (అయితే అది సిపాయి తిరుగుబాటుగా దురుద్దేశంతో పిలవబడింది )

1885 లో బ్రిటిష్ వ్యతిరేక పోరాటానికి కాంగ్రెస్ పార్టీ స్థాపించబడింది.

1915 నుండి గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారు. అ ఉద్యమంలో యథాతథ వాదులు ,తీవ్రవాద భావజాలం కలవారు సంయుక్తంగా పని చేశారు. అయితే స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక స్పష్టత కొరవడింది. ఎలాంటి స్వాతంత్ర్యం కావాలి? పరిమిత స్వతంత్రమా లేక సర్వ స్వతంత్రమా? (సంపూర్ణ).

దీనిపై చర్చోప చర్చలు జరిగాయి. కమ్యూనిస్ట్ భావాలు కలిగిన వారి ఒత్తిడి మేరకే కాంగ్రెస్ సభ సంపూర్ణ స్వాతంత్ర్యం తీర్మానం ఆమోదించబడింది. స్వాతంత్ర్యానంతరం ఎలాంటి స్వాతంత్ర్యం అమలు జరగాలో దానిపై గాంధీకి గానీ కాంగ్రెస్ పార్టీకిగాని స్పష్టత లేదు, లేదా యివ్వదలుచుకోలేదో ???

ఇక ముసుగులో గుద్దులాటకన్నా బహిరంగంగా రావడమే మేలని కమ్యూనిస్టులంతా కలిసి 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సమావేశమై జాతీయ స్థాయి పార్టీగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేసుకున్నారు.

మొదటి తీర్మానం సంపూర్ణ స్వాతంత్ర్యం, రెండు, దున్నేవాడికే భూమి తదితర మౌలిక అంశాలతో ప్రజలముందుకు వచ్చింది సిపిఐ.

ఆనాటినుండి భూ సమస్య తెరమీదికి రావడమేగాక, భూమికోసం భుక్తి కోసం తెలంగాణా సాయుధ పోరాటం, బెంగాల్‌లో తేభాగ, కేరళలో పున్నప్ర, ఆంధ్రాలో చల్లపల్లి జమీందారీ వ్యతిరేకపోరాటాలు ఉవ్వెత్తున లేచాయి. భూ సమస్య జాతీయస్థాయి అజెండాగా ముందుకు వచ్చింది.

1917లో రష్యాలో కమ్యూనిస్టు విప్లవ విజయం ప్రభావం మనదేశంపై పడింది. ఆ ప్రభావమే బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వాన రూపొందించిన భారత రాజ్యాంగం, అలాగే ఆనాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్‌పై కూడా ప్రభావం పడబట్టే పబ్లిక్ సెక్టార్ నిర్మాణం.

జమ్మూ కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల వేర్పాటు ఉద్యమాలలో కమ్యూనిస్టుల ప్రతిఘటనే భారతదేశ ఐక్యతకు తోడ్పడింది. ఈ ప్రతిఘటనోద్యమంలో అనేకమంది యోధులను పోగొట్టుకున్న పార్టీ ఏదైనా వుంది అంటే అది సీపీఐ మాత్రమే.

పై ఉద్యమాలలో ఏ ఒక్కరోజయిన ఆర్‌ఎస్‌ఎస్, ఆనాటి జనసంఘ్ ఇప్పటి బిజెపి వ్యక్తులు పాల్గొన్నారా? జైలుకు వెళ్లారా?

అధికారం లేకపోయినా దేశాన్ని కాపాడగలిగాం దళితులకు,గిరిజనులకు యితర బలహీన వర్గాలకు అండగవున్నది కమ్యూనిస్టులేనని గుండె మీద చేయి వేసుకుని చెప్పగలం.

61 మంది వామపక్ష పార్లమెంట్ సభ్యులుండబట్టే గదా పనికి ఆహార పథకం సాధించగలిగాం.


కమ్యూనిస్టులు బలహీనపడబట్టేగదా అటు పార్లమెంట్‌లోనూ, యిటు శాసనసభలలో ప్రజాసమస్యలపై చర్చలు జరగకూడా నీవు వెధవవి నీవే వెధవవి తిట్టిపోసుకుంటూ, సంపద యావత్తూ కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేసే కుటిల యత్నాలు సాగుతున్నాయి.

ఇపుడు చెప్పండి! కమ్యూనిస్టులు దేశ మౌలిక విధానాల యెడల నిబద్ధతగా నిలబడ్డారా,లేదా?

వందేళ్ల సిపిఐ ప్రస్థానంలో భారతదేశ పురోభివృద్ధికి కొలమానంగా నిలబడ్డామా, లేదా?

ప్రస్తుతం కమ్యూనిస్టుల కర్తవ్యమేమిటి? ఎర్రజండాకు అంకితమయిన పార్టీలన్నీ ఒకగూటికి చేరాల్సిన తరుణం ఆసన్నమయింది. ఆలస్యం అమృతం విషం!

# కమ్యూనిస్టు పార్టీ భవిష్యత్తు ఏమిటి?




కె.శ్రీనివాస్‌రెడ్డి


భారతదేశ స్వాతంత్ర్యోద్యమ సాధనలో మహోజ్వల పాత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాలను పూర్తి చేసుకుంది. భారత జాతీయ కాంగ్రెస్ 1885 డిసెంబర్ 28న ఏర్పడింది. ఆ తరువాత 1925 డిసెంబర్ 26న ఏర్పడిన పార్టీ సిపిఐ. సిపిఐ నిర్వర్తించిన మహోజ్వల పాత్రకు ఆనాటికే దేశంలో స్వాతంత్ర సాధన సమరానికి పరిస్థితులు పరిపక్వ దశకు చేరుకుంటున్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేకత, ఫ్యూడలిజానికి వ్యతిరేకమైన వెల్లువలు, వ్యవసాయిక విప్లవం ప్రజల ఆదరణను పొందుతున్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులనేకమంది యువకులేనన్నది ఇక్కడ గుర్తించాలి. ఇందులో అత్యధికులు భారత జాతీయ కాంగ్రెస్‌లో తమ భూమికను పోషిస్తున్నారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలు స్వాతంత్ర్య పిపాసతో పోరాటాలకు సన్నద్ధమవుతున్న ప్రజల మనోభావాలకి అనుగుణంగా లేవన్న భావన వీరిలో నెలకొనటంతో భిన్నాభిప్రాయాలతో బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని విప్లవాత్మక పంథాలో ఎదిరించాలన్న భావాలు ఉన్నందున ఈ ఆలోచనలు చివరికి భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు దారి తీసాయి. అప్పటికే సోషలిస్టు దేశంగా సోవియట్ యూనియన్ అవతరించడంతో సైద్ధాంతిక అవగాహన కూడా పెంపొందించుకోవడానికి, మార్క్సిజం వైపు ఆకర్షించబడటానికి మార్గం సుగమమైంది. అందులో భాగమే మీరట్ కుట్ర కేసు, పెషావర్ కుట్ర కేసు, కాన్పూర్ కుట్ర కేసు, తెభాగ, తెలంగాణ సాయుధ పోరాటం, పున్నప్ర—వయలార్ పోరాటాలు, వీటికి తోడు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల బలిదానాలు. అందుకే జాతీయోద్యమంలో సిపిఐ నిర్వహించిన పోరాటాలను చరిత్రకారులు సువర్ణాక్షరాలతో లిఖించదగినవని పేర్కొన్నారు.

వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో భారత కమ్యూనిస్టు పార్టీ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొన్న మాట వాస్తవం. సాగించిన పోరాటాలన్నీ దేశాభ్యుదయానికి, ప్రజల సామాజిక అభివృద్ధికి సాగించినవే తప్ప మరొకటి కాదు. అందులో ఒడిదొడుకులను ఎదుర్కొన్నది. 1947 దేశ స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య భారతదేశంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలు ఎన్నుకున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ. ప్రజలు ఈ పార్టీని ప్రత్యామ్నాయ పార్టీగా భావించారు. ఆదరించారు. స్వతంత్ర దేశంలో ప్రజాస్వామ్య హక్కులు, కార్మికుల సంక్షేమం, సామాజిక న్యాయం అన్న అంశాలపై నాడు కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు సాగించి నిర్ణయాత్మకమైన విజయాలను సాధించింది. అందుకే ఆనాడు ఇది తప్ప ప్రత్యామ్నాయ పార్టీ అని ప్రజలు గుర్తించారు. ఆ తరువాత జరిగిన పరిణామాలలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆంతరంగిక సైద్ధాంతిక విభేదాలతో ఐక్యతా విఘాతం జరిగింది. చివరికి భారత కమ్యూనిస్టు పార్టీ విభజనకు గురైంది. ఈ విభజన కమ్యూనిస్టు శ్రేణులను, పార్టీ శ్రేయోభిలాషులను, కార్మిక వర్గాన్ని నిరాశకు గురిచేసినప్పటికీ, ఆ తరువాతి కాలంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు (సిపిఐ, సిపిఐ(ఎం)) ఒంటరి పోరాటాలు, ఐక్య పోరాటాల ఫలితంగా కమ్యూనిస్టు పార్టీలని విస్తరించి, ప్రజా విశ్వాసాలను తిరిగి కొంత పొందగలిగాయి. కానీ, ప్రజల పూర్తి విశ్వాసాన్ని చూరగొనలేకపోయాయి. విభజన వల్ల కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయ పార్టీగా అధికారాన్ని చేపట్టే అవకాశాలను, అధికారంలో నిరాటంకంగా కొనసాగుతున్న భారత జాతీయ కాంగ్రెస్‌ను 1967లో అనేక రాష్ట్రాలలో తృణీకరించిన ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు. పలు పార్టీలతో కూడిన సంయుక్త విధాయక్ దళ్ (ఎస్‌విడి) ప్రభుత్వాలకు ప్రజలు అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ కోల్పోవటానికి పార్టీలో అంతర్గత విభేదాలే కారణంగా భావిస్తున్నారు. తరువాత పరిణామాల్లో సోషలిస్టు శిబిరం అంతర్థానం మరో శరాఘాతం.




దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభంతో 1991లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల పేరుతో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలను ప్రవేశపెట్టింది. ఈ సంస్కరణల అమలు ద్వారా ప్రైవేటు పెట్టుబడిదారులకు ద్వారాలు బార్లా తెరిచింది. ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ సంపద ప్రైవేటు వ్యక్తుల సంస్థల పాలవడంతో పాటు సంపద కేంద్రీకరణకు బాహాటంగా తోడ్పడుతున్నది. మరోవైపు, ఆ విధానాలు శ్రమజీవులను, కార్మిక వర్గాన్ని దోపిడీ చేయటానికి నిరాటంకంగా దోహదపడుతున్నాయి. అనేక చట్టాల ద్వారా సాధించుకున్న హక్కులు కాగితాలకు పరిమితమయ్యాయి. దీంతో పాటు నూతన శ్రామిక వర్గం కూడా ఆచరణలోకి వచ్చింది. అప్పటి వరకు కొనసాగుతున్న పారిశ్రామిక కార్మిక వర్గంతో పాటు, ఐటి, బిపిఓ తదితర సాఫ్ట్‌కాలర్ ఉద్యోగవర్గం కూడా వచ్చింది. ఊహించినదానికన్నా మధ్య తరగతి మరింత పెరిగింది. దీనికి తోడు భారతదేశంలో యువజనుల శాతం ఊహకందని రకంగా పెరిగి యువదేశంగా ప్రపంచంలో మొదటిస్థానంలో నిలిచింది.

ఈ పూర్వరంగంలో శ్రామిక వర్గ పార్టీలు, ప్రత్యేకంగా కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల రంగంలో, సంస్థాగత నిర్మాణరంగంలో, ఉద్యమాల రీత్యా ప్రజల ఆకాంక్షలను అందుకోలేకపోతున్నాయన్న ప్రధాన విమర్శను ఎదుర్కొంటున్నాయి. కారణాలేమైనా, ఇందులో వాస్తవం లేకపోలేదు. రోజు రోజుకు ఎన్నికల ప్రక్రియ ధనికవర్గాలు, నేరమయ శక్తుల ఆధిపత్యంలోకి వెళ్ళిపోతున్నది. నిత్యం ప్రజా జీవితంలో ప్రజలకు అందుబాటులో ఉండే పార్టీలకు, శక్తులకు ఎన్నికల్లో పోటీ చేయటం శక్తికి మించినదిగా మారిపోతున్నది. వీటన్నిటి దృష్ట్యా శ్రామిక వర్గ పార్టీగా, మార్క్సిజం సిద్ధాంతంగా అనుసరించే భారత కమ్యూనిస్టు పార్టీ, ఇతర కమ్యూనిస్టు పార్టీలు సుదీర్ఘ సమాలోచనలతో, సామాజిక, సాంకేతిక పెను మార్పుల అవగాహనతో, ప్రజల ఆకాంక్షల పట్ల గౌరవంతో ముందుకు వెళ్ళాల్సిన తరుణమిది. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న 35 సంవత్సరాల యువత ఆలోచనలను, జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల భావాలను పరిగణనలోకి తీసుకోకుండా పార్టీ ముందడుగు వేసే అవకాశం లేదు. దీంతో పాటు, పారిశ్రామిక కార్మిక వర్గం కనుమరుగవుతున్న తీరును గమనంలోకి తీసుకోవడంతో పాటు, సాంకేతిక పెను మార్పుల మూలంగా ఉద్భవించిన నూతన ఉద్యోగులను, శ్రమదోపిడికి గురవుతున్న గిగ్ వర్కర్స్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ లాంటి నూతన ఉద్యోగులను సంఘటితపరచటం కర్తవ్యంగా సాగాలి. భారతదేశం త్వరితగతిన గ్రామీణ భారతం నుండి నగరీకరణ చెందుతోంది. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయరంగం కార్పొరేటీకరణ మార్గాన్ని అనుసరిస్తున్నది. చిన్న, సన్నకారు, ఇతర వ్యవసాయ పనులకు మరొకవైపున శ్రామికుల కొరత నెలకొంటున్నది. ఈ సమస్యలన్నీ కార్మిక వర్గ పార్టీగా కమ్యూనిస్టు పార్టీకి ఒక సవాల్.

కమ్యూనిస్టు ఉద్యమం, భారత కమ్యూనిస్టు పార్టీ మన దేశంలో బలహీనపడిందన్నది వాస్తవం. అయితే, భారత కమ్యూనిస్టులకు దేశంలో

(మిగతా 6వ పేజీలో)

### సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవడం
## దేశ రైతాంగానికి గొప్ప ప్రేరణ
ఎఐకెఎస్ అధ్యక్షుడు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మం పట్టణంలో జరుగుతున్న 'మహా ప్రదర్శన, భారీ బహిరంగ సభ'కు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) అధ్యక్షుడు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ స్థాపనలో కీలకమైన భూమికను నిర్వహించిన సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవడం దేశ రైతాంగానికి గొప్ప ప్రేరణ అని అన్నారు. పంటల ఉత్పత్తిని పెంచి, దేశ ప్రజల ఆహార భద్రతకు ఇరుసుగా అహర్నిశలు శ్రమిస్తున్న రైతులను సాగు నుండి పూర్తిగా నెట్టివేసి, కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయ రంగాన్ని ధారాదత్తం చేసి, వారి ప్రయోజనాలకు కొమ్ముకాస్తున్న బిజెపి పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములవుదామని వారు సూచించారు. డ్రెస్ కోడ్‌తో ప్రదర్శనలో పాల్గొనే రైతులు ఈనెల 18న ఉదయం 11 గంటలకు పెవిలియన్ గ్రౌండ్‌కు చేరుకోవాలని, మిగతా వారు నయాబజార్ కాలేజీ వద్దకు మధ్యాహ్నం ఒంటి గంటలోపు చేరుకుని, అక్కడి నుంచి ప్రారంభమయ్యే ప్రదర్శనలో పాల్గొనాలని బాగం హేమంత రావు, పశ్యపద్మ తెలిపారు.

## ఐద్వా జాతీయ మహాసభల ప్రచార బెలూన్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం( ఐద్వా) జాతీయ మహాసభలు ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తున్నట్టు జాతీయ మహాసభ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఎ జూలకంటి రంగారెడ్డి తెలిపారు. హైదరాబాద్, బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంపైన ఐద్వా జాతీయ మహాసభల ప్రచార బెలూన్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే అఖిల భారత మహాసభలకు ఐద్వా జాతీయ నాయకులు బృందాకరత్, టీచర్, మరియం దావలే, పుణ్యవతి హాజరవుతారని వివరించారు. ఈనెల 25న బస్ భవన్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుందని, మహాసభలలో మహిళా సమస్యలపైన చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన అన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై పెరుగుతున్న వేధింపులు, అత్యాచారాలు, హింస సమాజాన్ని సవాల్ విసురుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అబ్బాస్, టి.సాగర్, భూపాల్, శ్రీరామ్ నాయక్, వెంకట్ రాములు, మూడు శోభన్, ఉడుత రవీందర్, కోట రమేష్, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గాదె ఇన్నయ్య తల్లి థెరిసమ్మ కన్నుమూత
'నేడు' అంత్యక్రియలు
చంచల్‌గూడ జైలులో ఇన్నయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ మావోయిస్టు, సామాజిక ఉద్యమకారుడు, 'మా ఇల్లు ప్రజాదరణ ఆశ్రమ' నిర్వాహకుడు గాదె ఇన్నయ్య తల్లి థెరిసమ్మ కన్నుమూశారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి. గత ఏడాది కాలంగా ఇన్నయ్య తన తల్లి వద్దే ఉంటున్నారు. అయితే, ఎన్ఐఎ కేసులో ఇటీవలే ఇన్నయ్య అరెస్ట్ అయ్యారు. మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడుతూ ప్రజలను ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలతో ఆయనను ఉపా (యుఎపిఎ) చట్టం కింద అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లోని చంచల్ గూడ జైల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో, తన తల్లి చివరి చూపుకు ఆయనకు అవకాశం లభిస్తుందా? లేదా? అనే చర్చ జరుగుతోంది.

## అనసూయ 'పరువునష్టం' ఫిర్యాదు
59 మందిపై కేసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తన పరువుకు భంగం కలిగే విధంగా కొన్ని యూట్యూబ్ ఛానల్స్, వ్యక్తులు చేస్తున్నారని సెలబ్రిటీ అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు రెండు రోజుల క్రితం 42 మందిపై కేసు నమోదు చేయగా, తాజాగా మరో 17మందిపై కేసులు నమోదయ్యాయి. తనపై వ్యతిరేకంగా చట్టవిరుద్ధ కార్యకలాపాలు బహిరంగంగా కొనసాగుతున్నాయని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె మహిళల శరీరాలను వర్ణించడంపై అభ్యంతరం తెలియజేశారు. ఈ అంశంపై మీడియా ఛానెళ్లతో పాటు కంటెంట్ క్రియేటర్లు ఈ చర్చను మరింతగా పెంచి, తన సోషల్ మీడియా ఖాతాలలో పెద్ద ఎత్తున వ్యాఖ్యల ద్వారా ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆమె పేర్కొన్నారు. సంధ్యా రెడ్డి, ప్రియా చౌదరి, కళ్యాణి, విజయలక్ష్మి, పబ్లిక్ కామెంటేటర్, రోహిత్, బిగ్ టివి ఛానెల్లు, ఆన్‌లైన్ మీడియాతో పాటు పలువురిపై కేసులు నమోదు చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో జనసేనకు హీరో తనీశ్ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన కార్యచరణ రూపొందించినట్లు ఇప్పటికే ఆ పార్టీ ప్రకటించింది. తాజాగా జనసేన పార్టీ తరపున తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులకు ప్రముఖ తెలుగు యువ హీరో తనీశ్ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు వీడియో విడుదల చేశారు. ''యువత, మహిళలు, విద్యావంతులు సమాజానికి మంచి చేయాలనే నిబద్ధత కలిగిన వారు ప్రజా ప్రతినిధులు అయితే సమాజం బాగుపడుతుంది. దీనిని జనసేన అధినేత పవన్ కల్యాణ్ గారు బలంగా నమ్ముతారు. అదే ఆలోచనలతో జనసేన పార్టీలో యువత, మహిళలు, విద్యావంతులకు అవకాశం కల్పించారు. కల్పిస్తూ వస్తున్నారు కూడా. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తున్న ఈ తరుణంలో యువత, మహిళలు, విద్యావంతులు పెద్ద ఎత్తున జనసేన తరపున పోటీ చేసి ప్రజా ప్రతినిధులు అయ్యి.. వ్యవస్థ మార్పులో భాగం కావాలని కోరుకుంటున్నాను. ఆల్ ద బెస్ట్ జనసేన పార్టీ'' అని తనీశ్ పేర్కొన్నారు.

## జర్నలిస్టుల రిమాండ్‌ను మేజిస్ట్రేట్ రిజెక్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర మంత్రి, మహిళా ఐఎఎస్‌లపై ఆరోపణలు ప్రసారం చేసిన కేసులో అరెస్టు అయిన ఎన్‌టివి న్యూస్ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, జర్నలిస్టు సుధీర్‌ల రిమాండ్‌ను మెజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో వీరిద్దరిని బుధవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిద్దరిని పోలీసులు గురువారం తెల్లవారు జామున 1:30 గంటలకు మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. ప్రాథమిక ఆధారాలు సరిపోవడం లేదని, అరెస్టు ప్రక్రియలో నోటీసు ఇవ్వకపోవడం వంటి లోపాలు ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఇది ప్రెస్ స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యగా మారుతుందని పేర్కొంటూ రిమాండును తిరస్కరించి, బెయిల్ ఇచ్చి విడుదల చేయాలని ఆదేశించింది.సంబంధం లేని వార్తతో నాకు లింక్ పెట్టారని తన అరెస్టు విషయంలో దొంతు రమేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు.

**ఎన్‌హెచ్‌ఆర్‌సిలో కేసు నమోదు..**

ఈ కేసులో రమేష్‌ను అక్రమంగా అరెస్టు చేశారని న్యాయవాది రామారావు ఇమ్మానేని శుక్రవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయ్యింది. ఈ నేపథ్యంలో మీడియా వ్యక్తులపై దౌర్జన్యం కింద ఎన్‌హెచ్‌ఆర్‌సి కేసు నమోదు చేసింది.

# నేటి నుండి రెండో విడత 'సిఎం కప్'

ఉత్సాహంగా కొనసాగిన క్రీడాజ్యోతి ర్యాలీలు
తొలిసారిగా అసెంబ్లీ స్థాయిలో ప్రారంభం కానున్న గ్రామీణ పోటీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్న రెండో విడత సిఎం కప్ 2025 కు ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. శనివారం నుండి గ్రామీణ స్థాయి పోటీలు ప్రారంభం కానున్నాయి. 5 అంచలుగా గ్రామీణ, మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈనెల 17 నుండి 23 వరకు గ్రామ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. అందులోని విజేతలను మండల స్థాయికి మండల స్థాయిలో విజేతలైన వారిని నియోజకవర్గ స్థాయికి ఆ తదుపరి జిల్లా స్థాయికి జిల్లా స్థాయి విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. ఈసారి అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో పోటీ నిర్వహించడం విశేషం.

గ్రామపంచాయతీ స్థాయిలో ఈనెల 17 నుండి 22వరకు, మండల, మున్సిపాలిటీ పరిధిలో 28 నుండి 31 వరకు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఫిబ్రవరి 3 నుండి 5వరకు, జిల్లా స్థాయి పోటీలు 9 నుండి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు వచ్చేనెల 20 నుండి 23 వరకు నిర్వహించాలని స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేస్తోంది.

**ఉత్సాహవంతంగా క్రీడాజ్యోతి ర్యాలీలు ...**

యువ క్రీడాకారుల్లో అవగాహన కల్పించేందుకు క్రీడా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్నిమండల కేంద్రాల్లో క్రీడాజ్యోతి ర్యాలీలు నిర్వహించారు. యువ క్రీడాకారులు ఉత్సాహవంతంగా ఈ ర్యాలీలలో పాల్గొన్నారు. దాదాపు రెండు లక్షల మంది క్రీడాకారులు ఇప్పటికే ఆన్ లైన్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

**పల్లె ప్రతిభను గుర్తించడానికే...**

పల్లెల నుండి ప్రపంచ ఛాంపియన్లను తీర్చిదిద్దాలని 2036 ఒలంపిక్ క్రీడల్లో తెలంగాణ ప్రాతినిధ్యం ఉన్నతంగా ఉండాలన్న లక్ష్యంతో క్రీడలకు పెద్దపీట వేస్తూ గ్రామీణ క్రీడాకారులను గుర్తించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు మట్టిలో మాణిక్యాలను గుర్తించే లక్ష్యంతో గత సంవత్సరం నిర్వహించిన సిఎం కప్ విజయవంత మైందని, అదే స్ఫూర్తితో రెండో విడత సిఎం కప్ 2025నిర్వహిస్తున్నామని ఇందులో గ్రామీణ క్రీడాకారులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. సిఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం సమన్వయం ఉంటుందని పిఇటిలు ఫిజికల్ డైరెక్టర్లు క్రీడాభిమానులు పెద్ద సంఖ్య లో పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి అన్నారు. సెకండ ఎడిషన్ సిఎం కప్ 2025 సాంకేతిక సహకారంతో గ్రామీణ క్రీడాకారులకు సంపూర్ణ సమాచారం అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తెలిపారు. ఎఐ కాల్ సెంటర్, వాట్సాప్ బట్, వెబ్సైట్, ఏఐ చాట్ బాట్‌తో సమగ్ర సమాచారం గ్రామీణ క్రీడాకారులకు అధికారులకు అందే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారుల సమాచారం సేకరించి, వారి వివరాలను కంప్యూటీకరించి వారి సమగ్ర సమాచారం భద్రపరచడానికి స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.



## అట్టహాసంగా ముగిసిన అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కన్నులపండువగా జరిగిన అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ 2026 గురువారం ఘనంగా ముగిసింది. ముగింపు ఉత్సవాల్లో టిజిటిడిసి ఎండి వల్లూరు క్రాంతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేడుకలకు నగరవాసులు లక్షలాదిగా తరలివచ్చారు. ఈ ఏడాది కైట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఫ్రాన్స్, శ్రీలంక, జపాన్, కొరియా, వియత్నాం, అల్జీరియా సహా పలు దేశాల నుంచి 40మందికి పైగా అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్ పాల్గొన్నారు. వీరితో పాటు భారత్‌లోని వివిధ రాష్ట్రాల నుండి వృత్తిపరమైన గాలిపటాల ప్రేమికులు తమ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఇందులో ఎలియన్, వందేమాతరం, తిమింగలం వంటి కైట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి వేళల్లో ఎగురవేసిన ఎల్ఇడి గాలిపటాలు ఆకాశంలో రంగుల వెలుగులను విరజిమ్మాయి. సుమారు 60కి పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన స్వీట్ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాల సాంప్రదాయక రుచులు సందర్శకులను అలరించాయి. బెంగాల్, కేరళ, బీహార్, గోవాలతో పాటు తెలంగాణ పిండివంటలు ఈ వేడుకలకు అదనపు హంగులు అద్దాయి.కల్చరల్ ఈవెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కైట్ ఫ్లయర్స్ అందరినీ టిజిటిడిసి ఎండి క్రాంతి వల్లూరు అభినందించి, జ్ఞాపికలతో సత్కరించారు. వీటితో పాటుగా వీకెండ్ వండర్స్ కంటెస్ట్ విన్నర్స్‌ను సైతం వేదికపైకి పిలిచి ప్రైజ్ మనీని అందించారు. ముగింపు రోజైన గురువారం సెలవు దినం కావడంతో పరేడ్ గ్రౌండ్స్ జనసందోహంతో నిండిపోయింది. రంగురంగుల పతంగులతో సికింద్రాబాద్ ఆకాశం ఇంద్రధనస్సును తలపించింది. ఈ ఈవెంట్ అనంతరం జనవరి 16 నుండి 18 వరకు నిర్వహించబోయే హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ మరియు 16న పరేడ్ గ్రౌండ్‌లో సింగర్ మంగ్లీ లైవ్ కాన్సర్ట్ పట్ల పర్యాటకులు ఆసక్తి కనబరుస్తున్నారు.

# రైల్వేలో నెలరోజుల పాటు 'ఆపరేషన్ సంరక్షణ'
అగ్నిమాపక భద్రతపై ప్రచారం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణీకుల భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ నెల రోజుల పాటు సమగ్ర అగ్నిమాపక భద్రతా ప్రచారాన్ని చేపట్టింది. ఈ ప్రచారం ఈ నెల 9 నుంచి ఫిబ్రవరి 8 వరకు కొనసాగనుంది. రైళ్లలో మండే స్వభావం గల పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం, రైల్వే స్టేషన్ ప్రాంగణాల్లో అటువంటి వస్తువుల నిల్వను నివారించడం, ధూమపానాన్ని పూర్తిగా నియంత్రించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. అలాగే ప్రయాణికుల ప్రాణ, ఆస్తి భద్రతను మరింత పెంపొందించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు చేపట్టిన తనిఖీల్లో భాగంగా 43 ఎస్ఎల్ఆర్ (లగేజ్, బ్రేక్ వ్యాన్) కోచ్‌లు, 25 రైల్వే యార్డులు, వాషింగ్ లైన్లు, పిట్ లైన్లు మరియు 17 రైల్వే స్టేషన్లలో విస్తృత స్థాయిలో భద్రతా తనిఖీలు నిర్వహించారు. ధూమపానానికి సంబంధించి అగ్నిమాపక భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై రెండు కేసులు నమోదు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మండే మరియు పేలుడు స్వభావం గల పదార్థాలు, గ్యాస్ సిలిండర్లు, మండే క్యాన్లను అనధికారికంగా రవాణా చేయడంపై ప్రత్యేక నిఘా పెట్టారు. కోచ్ కారిడార్లు, ద్వారాలు, ప్యాంట్రీ మార్గాలను ఖాళీగా ఉంచడం, రైళ్లలో వంట చేయడం మరియు ధూమపానం పై నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. విద్యుత్ భద్రతకు సంబంధించి వదులుగా ఉన్న వైర్లు, బైపాస్ చేసిన ఫ్యూజ్‌లు, ప్యానెల్ గ్యాప్‌లను తొలగించే చర్యలు తీసుకుంటున్నారు. పవర్ కార్లలోని జనరేటర్ గదుల పర్యవేక్షణ కోసం ఏసీ మెకానిక్‌లు, ఎస్కార్టింగ్ సిబ్బందిని నియమించారు.



**విభాగాల వారీగా నిర్వహించిన తనిఖీలు ఇలా ఉన్నాయి :**

ఆర్‌పిఎఫ్ ద్వారా – 52,మెకానికల్ విభాగం – 29,వాణిజ్య విభాగం – 28,రైళ్ల నిర్వహణ విభాగం – 21,విద్యుత్ విభాగం – 14,భద్రతా విభాగం – 6,మొత్తం 150 చోట్ల తనిఖీలు పూర్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆర్‌పిఎఫ్ సిబ్బంది ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు ప్యాంట్రీ సిబ్బందికి ప్రత్యక్ష మార్గదర్శకత్వం అందించారు. అన్ని కోచ్‌లలో అగ్నిమాపక యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది నిరంతరం పరిశీలిస్తున్నారు. కోచ్‌లు, ప్యాంట్రీ కార్లు, పవర్ కార్లలో అగ్ని మరియు పొగ గుర్తింపు వ్యవస్థలు (ఎఫ్ఎస్‌డి) సరిగా పనిచేస్తున్నాయా అనే అంశాన్ని పరీక్షిస్తూ, 'నో స్మోకింగ్' ,అగ్నిభద్రతా సూచిక బోర్డులు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

### చైనా మాంజా విక్రయాలపై
## పోలీసుల ఉక్కుపాదం
సికింద్రాబాద్ జోన్‌లో 12 మంది అరెస్ట్
రూ.1.88 లక్షల విలువైన 162 చైనా మాంజా బాబిన్లు స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిషేధిత చైనా మంజా విక్రయాలు, సరఫరాపై సికింద్రాబాద్ జోన్ పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 12 మంది నిందితులను అరెస్ట్ చేసి, సుమారు రూ.1,88,000 విలువైన 162 చైనా మంజా బాబిన్లను స్వాధీనం చేసుకున్నట్లు సికింద్రాబాద్ డిసిపి రక్షితమూర్తి తెలిపారు. చైనా మంజా విక్రయం వల్ల ప్రజలు, పక్షులు, జంతువులకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని గుర్తించిన పోలీసులు, విశ్వసనీయ సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించారు. చిక్కడపల్లి డివిజన్ కాచిగూడ పీఎస్ పరిధిలో 5 మంది గాంధీ నగర్ డివిజన్ దోమల్‌గూడ పోలీసు స్టేషన్ పరిధిలో నలుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ డివిజన్ అంబర్‌పేట్ పిఎస్ పరిధిలో ఒకరిని అరెస్టు చేశారు. ఈ కేసుల దర్యాప్తు సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డిసిపి జే. నర్సయ్య పర్యవేక్షణలో సాగింది. విధినిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందిని తగిన విధంగా పురస్కరించనున్నట్లు పోలీసులు తెలిపారు.



### ఫోన్ ట్యాపింగ్ కేసులో..
## ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్ మార్చి నెలకు వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో సంచలనవ సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్రావు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ మార్చి 10వ తేదీకి వాయిదా వేస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం వెల్లడించింది. ఇప్పటికే ప్రభాకర్‌రావును సిట్ అధికారులు 14 రోజుల పాటు విచారించారని కోర్టు తెలిపింది. ఇంకా అదనపు విచారణ అవసరంలేదని వ్యాఖ్యానించింది. ప్రభాకర్రావు ముందస్తు బెయిల్ పిటిషన్ పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. బెయిల్ ఇవ్వొదని ప్రభుత్వం తరపున లాయర్ సిద్ధార్థ్ లూథ్రా వాదించారు. దీంతో ముందస్తు బెయిల్ ఇచ్చినంత మాత్రాన ఆయన్ని పిలవకుండా ఉండలేరు కదా..? మీ పర్పస్ పూర్తయిందా లేదా? ప్రభాకర్ రావును మళ్లీ జైల్లో పెట్టాలనుకుంటున్నారా..? అని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. అయితే ఈ కేసు దర్యాప్తులో న్యాయపర మైన అంశాలు ముడిపడి ఉన్నాయని, ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తదుపరి విచార ణను మార్చి 10వ తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.

## 18న మేడారంలో మంత్రివర్గ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలకు మేడారంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన మేడారంలోని హరిత హోటల్‌లో జరుగుతుంది. మేడారం జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, నిధుల విడుదల వంటి అంశాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వివిధ శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, త్వరలో జరగనున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల తేదీల ఖరారు తదితర అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, మున్సిపల్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణపై సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రైతులకు అందాల్సిన రైతు భరోసా నిధుల విడుదల, హ్యామ్ రోడ్ల నిర్మాణం వంటి సదుపాయాల కల్పనకు సంబంధించిన అంశాలపై కూడా చర్చ అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం. మంత్రివర్గ సమావేశం తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల కోసం దావోస్ పర్యటనకు వెళ్లనున్నారు. కాగా మంత్రివర్గ సమావేశం సమాచారాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు మంత్రివర్గ సభ్యులకు తెలియజేస్తూ ఒక నోట్ జారీచేశారు.

**రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఓ మారుమూల గ్రామంలో కేబినేట్ భేటీ**

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా మంత్రివర్గం సమావేశం ములుగు జిల్లా ధర్మారం మండలంలోని ఒక మారుమూల గ్రామం మేడారంలో జరగనుంది. సాధారణంగా సచివాలయంలో జరిగే మంత్రివర్గ సమావేశాన్ని ఈసారి సంప్రదాయానికి భిన్నంగా నిర్ణయం తీసుకోవడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ సమావేశానికి మేడారం వేదిక కావడం ఆసక్తిని కలిగిస్తున్నది.

## సొంతంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు
బిఆర్‌ఎస్ నాయకుడు హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలను పంచడం, ఆయన నిర్మించిన ప్రాజెక్టులకు రిబ్బన్లు కట్ చేయడం తప్ప సొంతంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ఎద్దేవా చేశారు. లోయర్‌పెన్‌గంగా ప్రాజెక్టు పేరు చెప్పుకుని రెండు సార్లు ఎన్నికల్లో గెలిచి, ప్రజలను మోసం చేసిన సి. రామచంద్రారెడ్డి పేరును ఈ ప్రాజెక్టుకు నామకరణం చేయడం ఆదిలాబాద్ ప్రజల మనోభావాలను అవమానించడమేనని అన్నారు. ఆదిలాబాద్ వెనుకబాటు తనానికి, పాలమూరు వలసలకు కారణమే దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. తెచ్చిన అప్పులతో ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పాలనలో దేవాలయాలపై పెరిగిన దాడులు
నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ దేవాలయాలపై దాడులు పెరిగాయని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ విమర్శించారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, దేవాలయాల విధ్వంసం నిరంతరం కొనసాగుతోందన్నారు. హిందూ సమాజంపై దాడులను సహించబోమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యల వల్లే రాష్ట్రంలో మతతత్వ ఉద్రిక్తతలకు బీజం పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్, ఎంఐఎం కలిసి హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయని, హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతాల్లో దేవాలయాలపై దాడులు పెరిగాయన్నారు. ఇది 1980–90లలో కాశ్మీర్‌లో జరిగిన ఎక్సోడస్ తరహా పరిస్థితులకు దారితీసే కుట్రగా ఆయన అభివర్ణించారు. పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిడిలో పనిచేస్తోందని, దాడులు జరిగినప్పటికీ హిందువులనే అరెస్టు చేస్తున్న ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇది పూర్తిగా అన్యాయమన్నారు. గతంలోనూ కాంగ్రెస్ పాలనలో అల్లర్లు 1980–90లలో హైదరాబాద్ తీవ్ర కమ్యూనల్ అల్లర్లను ఎదుర్కొందని, అప్పటి కాంగ్రెస్ పాలనలోనే ఘోరమైన ఘటనలు జరిగాయన్నారు. అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి రాజీనామా చేసిన తర్వాతే పరిస్థితులు అదుపులోకి వచ్చాయన్నారు.

## ఎన్నికల హామీలు మరిచి ఊర్ల పేర్లు మార్చడమే ప్రభుత్వ లక్ష్యం
మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర విమర్శలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఊర్లు, ప్రాంతాల పేర్లు మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తులం బంగారం, మహిళలకు రూ. 2500 వంటి హామీలను గాలికొదిలేసి, ప్రభుత్వం తుగ్లక్ పాలన సాగిస్తోందని విమర్శించారు. సికింద్రాబాద్‌కు 220 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందని, అలాంటి ప్రాంత అస్తిత్వాన్ని చెరిపివేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం, రాష్ట్రపతి విడిది భవనం, క్లాక్ టవర్ వంటి అనేక చారిత్రక కట్టడాలు సికింద్రాబాద్‌లో ఉన్నాయని చెప్పారు. ఆషాఢ మాసంలో జరిగే లష్కర్ బోనాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు.

**సికింద్రాబాద్ అస్తిత్వ రక్షణకు 17న శాంతి ర్యాలీ..**

సికింద్రాబాద్ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఈ నెల 17వ తేదీన ఉదయం 9 గంటలకు శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు తలసాని ప్రకటించారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి క్లాక్ టవర్, ప్యారడైజ్ సర్కిల్ మీదుగా ఎం.జి. రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు. సికింద్రాబాద్ ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా పేరు మార్పు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## టిఎస్ ఐ పాస్ గుర్తింపు రాష్ట్రానికి గర్వకారణం
కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ రూపకల్పన చేసిన టిఎస్ ఐ పాస్ విధానం దేశంలోనే అత్యుత్తమమని నీతి ఆయోగ్ తాజా నివేదికలో ప్రశంసించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. టిఎస్ ఐ పాస్ జాతీయ స్థాయిలో అందరికీ అనుసరణీయమని కేంద్ర సంస్థ పేర్కొనడం కెసిఆర్ దార్శనికతకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈమేరకు కెటిఆర్ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. భారీ పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఇ విభాగంలో రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 25 లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడం దేశ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయం అని అన్నారు. రైతు బంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ,టి హబ్ వంటి వినూత్న కార్యక్రమాలకు తోడు తాజాగా పారిశ్రామిక ప్రగతికి కూడా తెలంగాణ మోడలే ఆచరణీయమని నీతి ఆయోగ్ ప్రకటించిన నేపథ్యంలో కెసిఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమలల్లో బతికే అరాచక శక్తులు బుద్ధి తెచ్చుకుంటే మంచిదని కెటిఆర్ అన్నారు.

## ఇరాన్ గగనతలం మూసివేతతో
# భారత విమానాల దారి మళ్లింపు



**న్యూఢిల్లీ:** హింసాత్మక నిరసనల నేపథ్యంలో వాణిజ్య విమానాల రాకపోకలకు ఇరాన్ గగనతలాన్ని మూసివేసింది. దీంతో భారత విమాన యాన సంస్థలు తమ ప్రయాణికులకు సూచనలు చేశాయి. ఉద్రిక్తతల దృష్ట్యా కొన్ని విమానాలను దారి మళ్లిస్తున్నామని, మరికొన్ని సర్వీసులు రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. 'ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఇరాన్ మీదుగా వెళ్లాల్సిన కొన్ని విమాన సర్వీసులను దారి మళ్లిస్తున్నాం. ప్రత్యామ్నాయ మార్గాలు సాధ్యం కాని కొన్ని విమాన సర్వీసులు రద్దు చేస్తున్నాం. ప్రయాణికులు అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి. ఈ అసౌకర్యానికి మేం చింతిస్తున్నాం. కానీ... ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం' అని ఎయిరిండియా సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించింది. మరో విమానయాన సంస్థ ఇండిగో కూడా ఇదేతరహా అడ్వైజరీ జారీ చేసింది. ఇరాన్ గగనతలం మూసివేయడంతో కొన్ని అంతర్జాతీయ సర్వీసులపై ప్రభావం పడిందని తెలిపింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో సర్వీసులు నడుపుతున్నామని వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో ప్రయాణికులు తమకు సహకరించాలని కోరింది. కాగా... ఇండిగోకు చెందిన ఓ విమానం ఇరాన్ గగనతలాన్ని మూసివేయడానికి కొన్ని నిమిషాల ముందు అక్కడి నుంచి బయటపడింది. జార్జియా నుంచి బయల్దేరిన ఆ విమానం గురువారం తెల్లవారుజామున 2.35 గంటల ప్రాంతంలో ఇరాన్ గగనతలం మీదుగా ప్రయాణించినట్లు ఫ్లైట్‌రాడార్24 వెల్లడించింది. ఆ తర్వాత 3 గంటల ప్రాంతంలో తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కొన్ని రోజులుగా కొనసాగుతున్న హింసాత్మక నిరసనలతో ఇరాన్‌లో పరిస్థితులు అల్లకల్లోలంగా మారాయి. మరోవైపు, ఆ దేశంపై సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయులంతా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో దేశాన్ని వీడాలని సూచించింది. భారతీయులెవరూ ఇరాన్ వెళ్లొద్దని పేర్కొంది.

# స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ ధరలకు రెక్కలు!



**న్యూఢిల్లీ:** స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే రెండు నెలల్లో వీటి ధరలు పెరగనున్నాయి. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు పెరిగాయి. టీవీ బ్రాండ్లు సైతం ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థల నుంచి మెమొరీ చిప్స్‌కు ఎనలేని డిమాండే ఉండమే ఇందుకు కారణం. గత త్రైమాసికంలో మెమొరీ చిప్స్ ధరలు ఏకంగా 50 శాతం మేరకు పెరగ్గా... జనవరిమార్చి త్రైమాసికంలో మరో 40 50 శాతం పెంపు ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏప్రిల్‌జూన్‌లో మరో 20 శాతం వరకు పెరగొచ్చని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో వివో, నథింగ్ వంటి సంస్థలు తమ స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.3 నుంచి రూ.5 వేల వరకు పెంచాయి. శ్యాంసంగ్ వంటి కంపెనీలు పరోక్షంగా ఖర్చులు తగ్గించుకోవడానికి క్యాష్‌బ్యాక్‌లు, డిస్కౌంట్లు నిలిపివేశాయి. మెమొరీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఆ మేరకు ధరల పెంపు చేపట్టొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. తాము లాంచ్ చేయబోయే మోడళ్ల ధరలు పెంచనున్నట్లు నథింగ్ సీఈఓ కార్ల్ పై ఇప్పటికే స్పష్టంచేశారు. మరిన్ని బ్రాండ్లు ఇదే బాటలో నడవనున్నాయి. నవంబర్ డిసెంబర్ నెలల్లో స్మార్ట్‌ఫోన్ ధరలు కనిష్ఠంగా 3 శాతం... గరిష్ఠంగా 21 శాతం మేర పెరిగాయి. రాబోయే రోజుల్లో మరో 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక్క స్మార్ట్‌ఫోన్లే కాకుండా టీవీల ధరలు సైతం పెరగనున్నాయి. తాము ఆర్డర్ చేసే మెమొరీ చిప్స్‌లో కేవలం పదో వంతు మాత్రమే తమకు అందుతున్నాయని కోడక్, థామ్సన్ వంటి బ్రాండ్లపై టీవీలను విక్రయించే సూపర్ ప్లాస్ట్రోనిక్స్ సంస్థ పేర్కొంది. మెమొరీ చిప్స్ కొరతను ఈ పరిస్థితి తెలియజేస్తోంది. ఇప్పటికే టీవీల ధరలు పెంచామని, ఫిబ్రవరిలో మరో 4 శాతం మేర పెంచాలనుకుంటున్నట్లు ఆ కంపెనీ సీఈఓ అవనీత్ సింగ్ వెల్లడించారు. ల్యాప్‌టాప్ ధరలు ఇప్పటికే 58 శాతం మేర పెరగ్గా... మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

# స్పీకర్ ప్రజాస్వామ్యంలో కీలకం

### ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ పాత్ర ప్రత్యేకమైనదని, వారు తక్కువ మాట్లాడినా అందరికీ సమాన అవకాశం కల్పించాలని ప్రధాని నరేంద్రమోదీ సూచించారు. భారతదేశ వైవిధ్యాన్ని ప్రజాస్వామ్యం బలంగా మార్చిందని, స్వాతంత్ర్యానంతరం భారత్‌లో ప్రజాస్వామ్యం బతకదనే అనుమానాలను తిప్పికొట్టిందని గుర్తుచేశారు. ఢిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో 28వ కామన్‌వెల్త్ స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారుల సమావేశాన్ని ప్రధాని ప్రారంభించారు. మూడు రోజులు జరిగే సమావేశంలో 42 కామన్‌వెల్త్ దేశాల నుంచి 61 మంది స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారులు, నలుగురు అర్ధస్వయంప్రతిపత్తి పార్లమెంట్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంతకుముందెన్నడూ లేని విధంగా ఈ సమావేశాల్లో వివిధ దేశాల నుంచి అత్యధిక మంది ప్రతినిధులు పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షత వహించారు. మోదీ మాట్లాడుతూ 'భారతదేశంలో డెమోక్రసీ అంటే లాస్ట్ మైల్ డెలివరీ' అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు స్థిరత్వం, వేగం, ఉన్నతస్థాయిని అందిస్తాయని వివరించారు. 2024 భారత ఎన్నికలు మానవ చరిత్రలో అతిపెద్ద ప్రజాస్వామ్య కసరత్తుగా ప్రధాని తెలిపారు. 98 కోట్ల ఓటర్లు, 8 వేల మంది అభ్యర్థులు, 700 పార్టీలతో ఈ సార్వత్రిక ఎన్నికలు జరిగాయని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో మహిళా ప్రతినిధులు అత్యధిక స్థాయిలో పాల్గొన్నారని ప్రధాని చెప్పారు. భారతదేశం ప్రపంచంలో అతివేగంగా అభివద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అని మోదీ అన్నారు.

# దోషిగా తేలితే రక్షించబోము

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ స్పష్టీకరణ

### శంకరదాస్‌కు 'ఆదర్శ కమ్యూనిస్టుగా' కితాబు



**తిరువనంతపురం :** శబరిమల బంగారం నష్టం కేసుల్లో అరెస్ట్ అయిన టిడి బి మాజీ సభ్యుడు కె.పి.శంకర దాస్ ఓ 'ఆదర్శ కమ్యూనిస్టు' అని, ఆయన తెలిసి కూడా ఏ తప్పు చేయరని కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం అన్నారు. దాస్ ఉద్దేశపూర్వకంగా ఎలాంటి తప్పు చేయరని పార్టీలోని ప్రతీ ఒక్కరికీ తెలుసునని బినోయ్ విశ్వం శుక్రవారం నాడు ఇక్కడ విలేకరులకు వివరించారు. 'ఆయన ఒక ఆదర్శ కమ్యూనిస్టు. కానీ ఆయన ఏదైనా అనుకోకుండా పొరపాటు చేశారో లేదో మాకు తెలియదు. కాబట్టి దర్యాప్తును కొనసాగనివ్వండి' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చెప్పారు. అదే సమయంలో, దర్యాప్తులో ఆయన తప్పు చేసినట్లు తేలితే సిపిఐ లేదా ఎల్ డిఎఫ్ వారిని రక్షించదని స్పష్టం చేశారు. కేరళ హైకోర్టు నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దర్యాప్తు చేస్తున్న ద్వారపాలక (సంరక్షక దేవత), శ్రీ కోవిల్ (గర్భగుడి) తలుపుల ఫ్రేమ్‌ల నుండి బంగారం పోగొట్టుకున్న రెండు కేసులకు సంబంధించి కె.పి.శంకరదాస్‌ను బుధవారం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో అరెస్ట్ చేశారు. ఆయన ప్రస్తుతం అనారోగ్యంతో హాస్పిటల్‌లోనే ఉన్నాడు. ఈ కేసుకు సంబంధించి 'సిట్' ఇప్పటివరకు ఇద్దరు టిడిబి మాజీ అధ్యక్షులు సహా 12మందిని అరెస్ట్ చేసింది.

## కన్నకూతుళ్లపై
# తండ్రి అఘాయిత్యం

జోధ్‌పూర్‌లో దారుణ ఘటన ఒకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత 12 ఏళ్లుగా కన్న కూతుళ్లపై ఒక తండ్రి అత్యాచారానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. తల్లీ కూతుళ్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. పోలీసుల సమాచారం ప్రకారం జోధ్‌పూర్‌కు చెందిన 18 ఏళ్ల బాలిక గత 12 ఏ ళ్లుగా తన తండ్రి తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఆరోపించింది. తన తండ్రి తనపై అత్యాచారం చేయడం ప్రారంభించినప్పుడు ఆమె వయస్సు కేవలం ఆరేళ్లు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి లైంగిక దాడికి పాల్పడుతూ వచ్చాడు. చివరికి తన 15 ఏళ్ల చిన్న కుమార్తెపై కూడా అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తన సోదరితో చెప్పింది. దీంతో వారు తమ తల్లికి ఈ విషయాన్ని తెలియజేశారు. ఆ తర్వాత, వారు పోలీసులకు ఒక ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. జనవరి 13న ఒక ఈమెయిల్ ఫిర్యాదు అందిందని నాగౌరి గేట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) దినేష్ కుమార్ తెలిపారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా, పోలీసులు వెంటనే ఫిర్యాదుదారురాలిని సంప్రదించి, ఆ తర్వాత ఆమె నుండి అధికారిక లిఖితపూర్వక ఫిర్యాదును స్వీకరించారు. సహాయ పోలీస్ కమిషనర్‌మంగ్లేష్ చుండవత్ ప్రకారం, తనపై ఫిర్యాదు నమోదైన విషయం తెలియడంతో ని ందితుడు, కూలీగా పనిచేసే 45 ఏళ్ల తండ్రి పరారయ్యాడు. కానీ గురువారం అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. పోలీసులు ఇప్పటికే బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసి, వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సెక్షన్ 65(2) (అత్యాచారం) ,లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## 52 మంది
# మావోయిస్టుల లొంగుబాటు




**విశాలాంధ్ర–చింతూరు:** చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 52 మంది మావోయిస్టులు లొంగిపోయారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. లొంగిపోయిన వారిలో 21 మంది మహిళలు ఉన్నారని, వీరు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్రఒడిశా బోర్డర్ డివిజన్, భమ్రాఘర్ ఏరియా కమిటీ (మహారాష్ట్ర) చురుకుగా ఉన్నారని వారు చెప్పారు. 'పూనా' మార్గెమ్ చొరవ కింద వారు ఇక్కడ సీనియర్ పోలీసు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) అధికారుల ముందు లొంగిపోయారని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం సంకల్పించింది.

## 'లక్కుం'డిలో...దాగిఉన్న 'లక్కు' !
# ఓ ఇంటి నిర్మాణ పనుల్లో బయటపడ్డ లంకెబిందె

### 466 గ్రాముల బంగారు గాజులు, కడియాలు, గొలుసులు, ఉంగరాలు లభ్యం

### గ్రామంలో నిధుల కోసం తవ్వకాలకు కర్ణాటక సర్కారు ఆదేశాలు జారీ

**గడగ్ :** కర్ణాటక రాష్ట్రంలో 'దేవాలయాల స్వర్గం'గా పేరొందిన గడగ్ జిల్లా చారిత్రక 'లక్కుండి' గ్రామంలో ఇటీవల ఓ ఇంటి నిర్మాణానికి పునాది తవ్వుతుండగా ఒక లంకెబిందె బయటపడింది. 634 గ్రాముల బరువున్న ఆ తామ్రపు లంకెబిందెలో 466 గ్రాముల బంగారు గాజులు, కడియాలు, గొలుసులు, ఉంగరాలు బయటపడ్డాయి. ఆ లంకెబిందెను 14 ఏళ్ల వయసున్న ప్రజ్వల్ రిత్తి అనే బాలుడు సహా అతడి కుటుంబ సభ్యులు గుర్తించారు. వారు ఈ విషయాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. లంకెబిందెలో బయటపడ్డ బంగారు ఆభరణాలు 400 ఏళ్ల నాటివి అయి ఉండవచ్చని పురావస్తు శాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కర్ణాటక ప్రభుత్వం లక్కుండి గ్రామంపై దృష్టి సారించింది. పూర్వం రాష్ట్రకూటులు, చాళుక్యులు, ఇతర రాజులు ఈ ప్రాంతాన్ని పాలించారని, ఇటువంటి చరిత్ర కలిగిన ఈ గ్రామంలో నిధులు దొరికే అవకాశాలు మెండుగా ఉన్నాయని పురావస్తు శాఖ అధికారులు చెప్పడంతో కర్నాటక ప్రభుత్వం ఆ గ్రామంలో నిధుల కోసం పూర్తి స్థాయిలో తవ్వకాలు చేపట్టేందుకు పురావస్తు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పురావస్తు అధికారులు శుక్రవారం లక్కుండి గ్రామంలో నిధుల కోసం పూర్తి స్థాయి తవ్వకాల వేట ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్‌ను పర్యాటక శాఖ, పురావస్తు శాఖ, లక్కుండి హెరిటేజ్ డెవలప్‌మెంట్ అథారిటీ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా చేపట్టాయి. నిధుల కోసం తవ్వకాలు సాగించేందుకు జెసిబిలు, ట్రక్కులు, ట్రాక్టర్లను లక్కుండి గ్రామానికి తరలించి అక్కడి కోటే వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిధులకోసం తవ్వకాలు చేపట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పూర్వం ఈ ప్రాంతం చారిత్రకంగా ఒక సంపన్న కేంద్రంగా ఉండేదని, భూగర్భంలో ఇప్పటికీ అపారమైన సంపాద దాగి ఉండొచ్చని భావిస్తున్నామని, పురాతన కాలంలో లక్కుండిలో బంగారు నాణేలు ముద్రించినట్లు ఆధారాలు కూడా ఉన్నాయని, అందుకే ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధులను గుర్తించడానికి పూర్తి స్థాయిలో తవ్వకాలు సాగిస్తున్నామని అధికారులు వివరించారు.

# టికెట్ చార్జీల నిర్ణయం
## 'వ్యాపార రహస్యం': భారత రైల్వే




**న్యూఢిల్లీ:** రైలు టికెట్ చార్జీలను నిర్ణయించడానికి ప్రమాణాలను వెల్లడించలేమని భారత రైల్వే తెలిపింది. టికెట్ చార్జీలను లెక్కించే పద్ధతి రైల్వేల 'వ్యాపార రహస్యం' ... వాణిజ్య సమగ్రతకు సంబంధించిన విషయం అని రైల్వే బోర్డు కేంద్ర సమాచార కమిషన్‌కు తెలియజేసింది. ఛార్జీల నిర్ణయ వివరాలను కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించిన తర్వాత రైల్వే బోర్డు ఈ వివరణ ఇచ్చింది. బేస్ ఫేర్‌ను లెక్కించే పద్ధతి, డైనమిక్ ధర... టికెట్ చార్జీలు ఎలా ప్రభావితమవుతాయి వంటి సమాచారాన్ని దరఖాస్తుదారుడు కోరాడు. అయితే, చార్జీల నిర్ణయ విధానాలు రైల్వేల మేధో సంపత్తి హక్కుల పరిధిలోకి వస్తాయని, సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ ఎనిమిది కింద మినహాయింపు పొందాయని రైల్వే వెల్లడించింది. రైల్వేలు వాణిజ్య సంస్థగా పనిచేస్తాయని, లాభాలను ప్రజా ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నందున, అటువంటి సమాచారాన్ని బహిర్గతం చేయడం ప్రజా ప్రయోజనానికి విరుద్ధమని రైల్వే బోర్డు పేర్కొంది. రైల్వేల వాదనను అంగీకరిస్తూ, కేంద్ర సమాచార కమిషన్ సమాచారం కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

# 'మహా' మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో...
## జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్యకేసు నిందితుడి గెలుపు

### 'జాల్నా' కార్పొరేషన్‌లోని 13వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగిన పాంగార్కర్



**జాల్నా :** మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. శుక్రవారం జాల్నా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రముఖ జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్యకేసు నిందితుడు శ్రీకాంత్ పాంగార్కర్ ఈ కార్పొరేషన్‌లోని 13వ వార్డు ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగి గెలుపొందడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.13వ వార్డు నుంచి శ్రీకాంత్ పాంగార్కర్ పోటీచేయగా, భారతీయ జనతా పార్టీ (బిజెపి) అభ్యర్థితోపాటు, ఇతర పార్టీల అభ్యర్థులు కూడా ఆ వార్డు నుండి బరిలో నిలిచారు. శివసేన (ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని పార్టీ) మాత్రం తన అభ్యర్థిని నిలబెట్టలేదు. పాంగార్కర్ గత ఏడాది శాసనసభ ఎన్నికలకు ముందు శివసేనలో చేరడంతో ఆయన చేరికపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.అంతకుముందు 20–01–2006లో జాల్నా మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా పాంగార్కర్ శివసేన తరపున ప్రాతినిథ్యం వహించి ఉన్నాడు. 2011 మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో శివసేన తరపున ఆయనకు టికెట్ నిరాకరించడంతో హిందూ జనజాగృతి (హెచ్‌జెజె)లో చేరారు. 2017 సెప్టెంబరులో జర్నలిస్ట్ గౌరీ లంకేష్‌ను బెంగళూరులోని ఆమె నివాసంలో కొందరు దుండగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడుగా ఉన్న శ్రీకాంత్ పాంగార్కర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నాటక హైకోర్టు 2024లో అతడికి బెయిల్ మంజూరు చేసింది. దీనికి ముందు 2018లో బాంబులు, ఆయుధాలు లభ్యమైన కేసులో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్ట్ చేసిన విషయం విదితమే. తాజాగా జాల్నా మున్సిపల్ కార్పొరేషన్‌లోని 13వ వార్డుకు జరిగిన ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన శ్రీకాంత్ పాంగార్కర్ విజయం చర్చనీయాంశమైంది.

# ఓటు చోరీ
## దేశద్రోహ చర్యే: రాహుల్



**న్యూఢిల్లీ:** ఓట్ల చోరీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శుక్రవారం మరోసారి స్పందించారు. మోదీ సర్కారు, ఎన్నికల కమిషన్‌పై విమర్శలు గుప్పించారు. హర్యానా, మహారాష్ట్ర, కర్నాటక సహా అనేక రాష్ట్రాల్లో పెద్దఎత్తున ఓటు చోరీ జరిగిందని, ఇదే పరిస్థితి మహారాష్ట్ర కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కొనసాగిందని విమర్శించారు. ఎన్నికల సంఘం తీరుపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పౌరులను తప్పుదారి పట్టిస్తూ ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు కారణంగానే మన ప్రజాస్వామ్యంపై నమ్మకం సన్నగిల్లిందని రాహుల్ ఆరోపించారు. 'ఓటు చోరీ దేశద్రోహ చర్య' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు.

# 'సుప్రీం'లో యశ్వంత్‌వర్మకు చుక్కెదురు

**న్యూఢిల్లీ:** క్యాష్ ఎట్ హోం కుంభకోణం కేసులో జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను దర్యాప్తు చేస్తున్న పార్లమెంటరీ ప్యానెల్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. క్యాష్ కుంభకోణంలో ఆయనపై అభిశంసన ప్రక్రియ కొనసాగుతోంది. పిటిషన్ కొట్టేయడంతో అభిశంసన ప్రక్రియకు మార్గం సుగమం అయినట్లు అయింది. జస్టిస్ యశ్వంత్ వర్మ విజ్ఞప్తిపై ఈ నెల ఎనిమిదో తేదీన నిర్ణయాన్ని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి.శర్మలతో కూడిన ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా ధర్మాసనం పిటిషన్ కొట్టేసింది. దీంతో జస్టిస్ వర్మ... పార్లమెంటరీ ప్యానెల్ ముందు హాజరు కావాల్సి ఉంటుంది. కాగా, 2025, మార్చి 14వ తేదీ రాత్రి జస్టిస్ యశ్వంత వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని చెల్లాచెదురుగా పడి ఉన్న నగదు గుర్తించారు. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. నగదు వీడియోలను రికార్డ్ చేసి ఢిల్లీ పోలీసులు... సీనియర్ అధికారులకు పంపారు. అనంతరం భారత ప్రధాన న్యాయమూర్తికి సమాచారం అందించారు. దీంతో అప్పటి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ఖన్నా విచారణకు ఆదేశించారు. దాదాపు రూ.15 కోట్ల వరకు నగదు ఉంటుందని సమాచారం. భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీం కోర్టు కొలీజియం... జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. కానీ ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీం కోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించింది. ఈ కమిటీ కూడా నగదు ఉన్నమాట వాస్తవమేనని తేల్చింది. మే 4న కమిటీ నివేదిక ఇచ్చింది.


## నగదు అక్రమ చలామణిలో
# మెహుల్ ఛోక్సీ తనయుడు : ఇడి

**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఇడి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఇడి అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. ఈ మనీలాండరింగ్ కేసులో మెహుల్ ఛోక్సీ కుమారుడు రోహన్ చోక్సీకి సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలోని అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్ చోక్సీకి 99.99 శాతం వాటా ఉందని, ఈ కంపెనీ నిధులను విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఇడి అధికారులు చెప్పారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ చోక్సీ చురుకుగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులు అటాచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రోహన్ తో పాటు ఇతర కుటుంబసభ్యులను కూడా విచారించడానికి ఇడి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వాబార్బుడాకు వెళ్లగా... నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ప్రస్తుతం నీరవ్ లండన్‌లోని జైల్లో ఉన్నాడు. వారిని భారత్ తీసుకురావడానికి విదేశాంగ అధికారులు ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నారు.

## చట్టవిరుద్ధంగా వాకీ-టాకీల విక్రయం
# 13 ఈ-కామర్స్ సైట్స్‌కు
## రూ.10 లక్షల చొప్పన జరిమానా

**న్యూఢిల్లీ:** చట్టవిరుద్ధంగా వాకీటాకీలు విక్రయిస్తున్న ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై కేంద్ర వినియోగదారుల రక్షణ అథారిటీ (సిసిపిఏ) చర్యలు చేపట్టింది. 13 ప్రముఖ ఈకామర్స్ సైట్స్‌కు రూ.10 లక్షల చొప్పన జరిమానా విధించింది. చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో, మీషో, మాస్క్‌మ్యాన్ టాయ్స్, ట్రేడ్ ఇండియా, ఆంత్రిక్ష్ టెక్నాలజీస్, వర్ధాన్‌మార్ట్, ఇండియామార్ట్, మెటా ప్లాట్‌ఫామ్‌లు ఇంక్. (ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్), ఫ్లిప్‌కార్ట్, కృష్ణమార్ట్, అమెజాన్ సంస్థలు 16,970కు పైగా చట్టవిరుద్ధంగా వాకీటాకీలు అమ్మినట్లు సీసీపీఏ గుర్తించింది. ఆయా ఈకామర్స్ సంస్థలు వినియోగదారుల రక్షణ చట్టం 2019, టెలికాం చట్టాలను ఉల్లంఘించినట్లు సీసీపీఏ ఆరోపించింది. ఎనిమిది సంస్థలకు తుది ఉత్తర్వులు జారీ చేసింది. వాటికి రూ.44 లక్షల జరిమానాలు విధించింది. కాగా, మీషో, మెటా ప్లాట్‌ఫారమ్స్ ఇంక్. (ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్), ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లపై రూ.10 లక్షల చొప్పున, చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్‌లపై లక్ష చొప్పున జరిమానా విధించినట్లు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. మీషో, మెటా, చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో సంస్థలు జరిమానా చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన ప్లాట్‌ఫామ్‌ల నుంచి జరిమానా చెల్లింపులు రావాల్సి ఉన్నదని వెల్లడించారు.

## ఇరాన్‌లో ఉద్రిక్తతల వేళ..
# పుతిన్–నెతన్యాహు ఫోన్ కాల్



**ఇంటర్నెట్ డెస్క్:** ఇరాన్‌లో కొనసాగుతోన్న ఉద్రిక్తతలపై రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారు. ఇరాన్ సంఘర్షణ నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై వారు చర్చించుకున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌తో మధ్యవర్తిత్వానికి అవసరమైతే తాము సాయం చేస్తామని నెతన్యాహుకు పుతిన్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్‌లో శాంతి భద్రతలను తిరిగి నెలకొల్పడానికి కావాల్సిన దౌత్య ప్రయత్నాలు కూడా చేస్తామని హామీ ఇచ్చారు.ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో గత కొన్ని వారాలుగా ఇరాన్‌లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. వీరిని అడ్డుకునే క్రమంలో భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య చెలరేగిన ఘర్షణలు హింసాత్మకంగా మారడంతో వేలాది మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నిరసనల్లో 3వేలకు పైగా ఆందోళనకారులు మరణించి ఉండొచ్చని అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

# సరిహద్దులో డ్రోన్ల కలకలం

**న్యూఢిల్లీ:** ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తామంటూనే... మరో వైపు కవ్వింపు చర్యలకు పాకిస్థాన్ పాల్పడుతోంది. గురువారం రాత్రి జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీడ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం ఇది మూడోసారి అన్నారు. పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. భూభాగంలోకి వచ్చిన అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం
తెలంగాణ విద్య మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ :: హైదరాబాద్
టెండర్ నోటీసు నెం. SE/TGEWIDC/HYD/NIT/1592 నుండి 1593/2025-26, తేది: 16.01.2026
కింది పనుల కోసం అర్హత కలిగిన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనవి: 1) నాంపల్లిలోని RUSA కార్యాలయంలో హాల్ పునరుద్ధరణ మరియు హైదరాబాద్ జిల్లా, గోల్కొండ తహసీల్ కార్యాలయానికి మౌలిక సదుపాయాల కల్పన (15.00 లక్షల నుండి 25.00 లక్షల వరకు)
క్ర.సం. 1 (మొదటి పిలుపు) మరియు క్ర.సం. 2 (రీ-కాల్)
ఆన్‌లైన్‌లో బిడ్ సమర్పించడానికి మరియు స్వీకరించడానికి చివరి తేదీ : 16.01.2026 సాయంత్రం 4.00 గంటల వరకు
పూర్తి వివరాల కోసం, సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ భవనం, SCERT కాంపౌండ్, ఇ-గేట్ ఎదురుగా, ఎల్.బి.స్టేడియం, హైదరాబాద్ చిరునామాలోని కార్యాలయంలో వ్యక్తిగతంగా సంప్రదించవచ్చు. ఫోన్ నెం. 040-29565991.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, హైదరాబాద్.
DIPR R.O. No. : 13794-PP/CL/ADVT/1/2025-26, Date: 16-01-2026

# మిత్రభేదం కలిగించిన 'మహా'నష్టం

మహారాష్ట్రలోని బృహన్ ముంబాయి (బిఎంసి) సహా 29 కార్పొరేషన్‌లకు జరిగిన ఎన్నికలకు సంబంధించి శుక్రవారం కడపటి వార్తలు అందే సరికి బిజెపి నేతృత్వంలోని మహాయుతి 25 చోట్ల పై చేయి సాధించింది. రాష్ట్ర వ్యాప్తంగా మెజారిటీ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలను కైవసం చేసుకొని తన అధికారాన్ని బిజెపి మరింత సుస్థిరపరుచుకుంది. ముఖ్యంగా దేశ ఆర్థిక రాజధాని ముంబాయి కార్పొరేషన్ బిఎంసిని శివసేనతో కలిసి దక్కించుకోవడం బిజెపికి అత్యంత సంతోషం కలిగించే అంశం. ఎందుకంటే ముంబాయి అంటే బాల్ థాక్రే శివసేనకు పెట్టని కోట. పాతికేళ్ళుగా ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన ఆధీనంలో ఉండేది. అక్కడ ఆ పార్టీకి ఉన్న పట్టును గండికొట్టాలని బిజెపి కంకణం కట్టుకొంది. అందుకే కాలపరిమితి ముగిసినా దాదాపు రెండేళ్ల పాటు బిఎంసికి ఎన్నికలు నిర్వహించలేదు. ఈ లోపు రకరకాల కుయుక్తులు, ఎత్తుగడలను అమలు చేసింది.ప్రస్తుత ఎన్నికల్లో బిజెపి, షిండే శివసేనల కూటమి బిఎంసిలో అసలు శివసేన ఆధిపత్యానికి గండి కొట్టింది. ఈ కూటమి 227 సీట్లలో అవసరమైన 114 మెజారిటీని దాటి మరిన్ని సీట్లను పొందింది. ఎన్నికలకు ముందు బిజెపి ఎత్తులను ఎలాగైనా చిత్తు చేయాలని థాక్రే తమ పార్టీని వీడి వెళ్ళిన చిన్నాన్న సోదరుడు రాజ్ థాక్రేని కలుపుకొని మహారాష్ట్ర నవ నిర్మాణ సేనతో పొత్తు పెట్టుకున్నారు. దీంతో ఆ కూటమి 80కి పైగా సీట్లను సాధించి మేయర్ పదవి దక్కకున్నా తమ బలం పోలేదని చాటుకుంది. అయితే, మహాయుతిలో భాగస్వామిగా ఉన్న అజిత్ పవార్ ఎన్‌సిపికి ఒక్క సీటు దక్కలేదు. ఇక ప్రతిపక్ష మహావికాస్ ఆగాఢీలోని నాలుగు పార్టీలు కకావికలమయ్యాయి. కాంగ్రెస్ స్వంతంగా పోటీ చేయగా, థాక్రే శివసేన, ఎంఎన్ఎస్, శరద్ పవార్ ఎన్‌సిపిలు కలిసి పోటీ చేశాయి. ఇతర మున్సిపాలిటీలలో కొన్ని చోట్ల ఈ పార్టీలు కలిసి పోటీ చేశాయి. కొన్ని చోట్ల విడి విడిగా పోటీ చేశాయి. కొన్ని చోట్ల రెండు ఎన్‌సిపిలు చేతులు కలిపి పోటీ చేశాయి.

ఈ ఎన్నిక ద్వారా ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ తన పట్టును మరింత బిగించారు. షిండే శివసేన సైతం తన అధికారం బాసటగా తన అనుయాయులను నిలుపుకోగలిగింది. ఇక ప్రతిపక్ష శిబిరమే దిశా రహితమైంది.

కాంగ్రెస్ స్వంతంగా పుంజుకోవాలనే ప్రయత్నం చేసి, లాతూర్, చంద్రపూర్, కొల్హాపూర్ కార్పొరేషన్‌ల మేయర్ స్థానాలను దక్కించుకోనుంది. అలాగే మిత్రుల సహాయంలో పర్భనీ,భీవాండీ మేయర్ పదవులు గెలుచుకునే అవకాశం ఉండడం ఆ పార్టీకి శుభవార్తే. అయితే, మహా వికాస్ ఆగాఢీలోని ఇతర పక్షాలకు మాత్రం ఫలితాలు చేదుగుళికలే.

గతంలో బిజెపికి గుడ్‌బై చెప్పి శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపిలు చేతులు కలిసి, మహావికాస్ ఆగాఢీగా ప్రభుత్వం ఏర్పాటు చేసి దేశానికే ప్రతిపక్షానికి ఒక నమూనాను అందించింది. ఒక విధంగా దాని స్ఫూర్తితోనే జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఏర్పాటైంది. దీనిని జీర్ణించుకోలేని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అధికారాన్ని అడ్డంగా దుర్వినియోగం చేసి, తిమ్మిని బమ్మిని చేసి ఆగాఢీ కూటమిని గద్దెదించింది. ఇదంతా గత లోక్‌సభ ఎన్నికలకు ముందే చోటు చేసుకుంది. కార్పొరేషన్ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల కూటమిలో ఎవరికివారేగా సాగింది. తమ బలాన్ని పునరుద్ధరించుకునేందుకు నాలుగు పార్టీలు నిర్ణయానికి వచ్చాయి. అందులో భాగంగా థాక్రే సోదరులు చేతులు కలిపారు. అలాగే ఎన్‌సిపి కురువృద్ధుడు శరద్ పవార్, అజిత్ పవార్ (బిజెపితో ప్రభుత్వంలో కొనసాగుతూనే) దగ్గరయ్యారు.

కాంగ్రెస్ మైనారిటీ ఓటు బ్యాంకును తిప్పుకునేందుకు బిఎంసిలో స్వంతంగానే పోటీ చేసింది. ఓటర్లకు మాత్రం ప్రతిపక్షాల అనైక్యత రుచించలేదు. ఓట్ల చీలిక కూడా పలు చోట్ల వారి ఓటమికి కారణమైంది. ఏ ఒక్క పార్టీ స్వంతంగా గెలుపు తలుపును తట్టలేని మహారాష్ట్ర రాజకీయాలలో బిజెపి తన బలానికి అదనంగా శివసేన చీలిక బలాన్ని తనలో కలిపేసుకుంది.

ఆ నష్టాన్ని ఎంఎన్ఎస్‌తో పూడ్చుకోవాలని ఉద్ధవ్ థాక్రే భావించినా, ఆ పార్టీ అతివాద ధోరణి రుచించని లౌకిక ఓటర్లు దూరమయ్యారు. ఎన్‌సిపి పవార్‌ల దోబూచలాట, పవార్‌లకు పట్టు కలిగిన పుణె, పింప్రి–చించోడ కార్పొరేషన్‌ల ప్రజలు ఆహ్వానించలేదు.

మొత్తానికి త్వరలో ఐదు రాష్ట్రాలకు జరిగే ఎన్నికల నేపథ్యంలో ఇండియా కూటమి మహారాష్ట్ర ఫలితాల నుంచి పాఠాలను త్వరితగతిన నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. బిహార్ ఎన్నికల్లో నామినేషన్‌ల చివరి రోజు వరకు పొత్తులు కుదరలేదు.

ఉమ్మడి ఎజెండాను ముందుంచడంలో, సైద్ధాంతిక దిశను ఇవ్వడంలో ఇండియా కూటమి సఫలం కావడం లేదు. బలమైన సంస్థాగత నిర్మాణం, ధన, ప్రభుత్వ వ్యవస్థల బలం కలిగిన బిజెపిని ఎదుర్కోవాలంటే ప్రతిపక్షాల మధ్య ఉత్కృష్టమైన ఐక్యత అవసరం.

# చరిత్ర పొడవునా రక్త తర్పణం...కుట్ర కేసులు

(3వ పేజీ తరువాయి)

రాంప్రసాద్ బిస్మిల్లా, రోషన్ సింగ్, రాజేంద్ర లహరీలను ఉరి తీశారు. మిగిలినవారిలో 17 మందికి దీర్ఘకాలిక శిక్షలు, మరియు అండమాన్ దీవుల ప్రవాసం లాంటి కఠిన శిక్షలు విధించారు. చంద్రశేఖర్ ఆజాద్ ఆ కేసు నుంచి తప్పించుకోవడం జరిగింది.

**చిట్టగాంగ్ పోరాట యోధులు :**

చిట్టగాంగ్ పోలీస్ స్టేషన్‌లోని ఆయుధకారాగారంపై దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న కేసులో 1934 జనవరి 12న అనేక మందిని ఉరితీశారు. మిగిలినవారు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. చిట్టగాంగ్ పోరాట యోధురాలు కల్పనా దత్ బహుకాలంపాటు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పిసి జోషిని వివాహం చేసుకున్నారు.

**వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం :**

1946–51 మధ్య జరిగిన ఈ పోరాటం చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించబడిన సాయుధ పోరాటం. మూడు వేల గ్రామాల విముక్తి, 10లక్షల ఎకరాల భూమి రైతాంగానికి పంపిణీ, వెట్టి చాకిరి రద్దు లాంటి అనేక విజయాలు ఈ పోరాటంలో సాధించబడ్డాయి. ప్రధానంగా నిజాం నవాబు యూనియన్ సైన్యాలరాకతో లొంగిపోవడం, హైద్రాబాద్ రాష్ట్రం భారత్ యూనియన్‌లో విలీనం, సాయుధ పోరాట ప్రభావంతో జరిగాయి. విలీనం తర్వాత భారత సైన్యం, పోలీసులు కమ్యూనిస్టులపై దాడులకు పాల్పడటంతో జరిగిన రైతాంగ గెరిల్లా పోరాటంలో 4000మందికి పైగా కమ్యూనిస్టులు ప్రాణాలర్పించారు. 10వేల మందిని డిటెన్షన్ క్యాంపుల్లో పెట్టి మూడు, నాలుగు సంవత్సరాలపాటు చిత్రహింసలకు గురిచేశారు. మహిళలతో నగ్నంగా బతకమ్మలాడించారు. అన్ని నిర్బంధాలను తట్టుకొని నిలబడటమే కాకుండా 1952 లో జరిగిన ఎన్నికల్లో అటు మద్రాస్ రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలోను, ఇటు హైద్రాబాద్ స్టేట్‌లోని తెలంగాణలో కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కంటే అధిక స్థానాలు సాధించారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల్లో (1946–51) కృష్ణాజిల్లాలో 102 మంది, గుంటూరు జిల్లాలో 70 మంది, కడప జిల్లాలో 7గురు, తూర్పుగోదావరి జిల్లాలో 15మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 27మంది, తెలంగాణ సాయుధపోరాటానికి సహకారం అందిస్తున్న నేపథ్యంలో చంపివేయబడ్డారు.

**తెలుగు రాష్ట్రాలలో తృటిలో చేజారిన అధికారం**

1952 ఫిబ్రవరిలో జరిగిన ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ఎన్నికల్లో ఆంధ్రాప్రాంతంలో 140 అసెంబ్లీ స్థానాలు ఉండేవి, కాగ్రెస్‌కు కేవలం 40స్థానాలు మాత్రమే దక్కాయి. సిపిఐపై నిషేధం తొలగించిన అనంతరం కేవలం నెలాపది రోజుల్లోనే జరిగిన ఎన్నికల్లో 61 స్థానాల్లో పోటీ చేసి 41 స్థానాల్లో కమ్యూనిస్టులు గెలిచారు. పార్టీబలపర్చిన 13మంది ప్రజా పార్టీ (ప్రకాశంపంతులు పార్టీ) అభ్యర్థులు, 8 మంది స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. మెజార్టీ స్థానాలు గెలిచిన కమ్యూనిస్టులు ఇతర ప్రజాతంత్ర, వామపక్ష పార్టీలను కలుపుకొని అధికారంలోకి వచ్చే అవకాశం వచ్చింది. అధికారం ఏర్పాటు చేసే అవకాశాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం మరియు ఇతర పార్టీల కుట్రలవల్ల కోల్పోవడం జరిగింది.

తెలంగాణ స్వాతంత్ర్యం అనంతరం జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో (1952)లో కమ్యూనిస్టులు జనతంత్ర ప్రజాసంఘటన (పిడిఎఫ్) తరఫున పోటీచేసిన 44 స్థానాలకు గాను 36 స్థానాల్లో గెలిశారు. పార్లమెంట్‌కు పోటీచేసిన కామ్రేడ్ రావినారాయణరెడ్డికి అప్పటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. అప్పుడే నిషేధం ఎత్తివేయడం వలన అనేక మంది జైల్లో ఉండి గెలవడం జరిగింది. కొన్ని ప్రాంతాలలో అభ్యర్థులు దొరకనందున ఆ స్థానాల్లో కమ్యూనిస్టుల పేరుతో సోషలిస్టు పార్టీలు సీట్లు సంపాదించాయి. కొంతమంది ఇండిపెండెంట్లు గెలిశారు. ఆనాటి హైద్రాబాద్ రాష్ట్రంలో మూడు ప్రాంతాలు అనగా మహారాష్ట్రలోని 5 జిల్లాలు, కర్నాటకలోని 3 జిల్లాలు, తెలంగాణలోని 8 జిల్లాలు కలిసి ఉండేవి. తెలంగాణ ప్రాంతంలో అత్యధిక స్థానాలు కమ్యూనిస్టు పార్టీ గెలవడం జరిగింది. ఆ విధంగా ఆనాడు రెండు రాష్ట్రాల్లో తెలుగు ప్రజల్లో మెజార్టీ స్థానాలు కమ్యూనిస్టు పార్టీ గెలుపొందడం జరిగింది.



మీరట్ కుట్ర కేసులో జైలు శిక్షలు అనుభవించిన కమ్యూనిస్టు ఖైదీలు

The Communist leaders jailed for Meerut Conspiracy. Back row (left to right): K. N. Sehgal, S. S. Josh, H. L. Hutchinson, Shaukat Usmani, B. F. Bradley, A. Prasad, P. Spratt, G. Adhikari; Middle Row: R. R. Mitra, Gopen Chakravarti, Kishori Lal Ghosh, L. B. Radam, D. R. Thengdi, Goura Shanker, S. Bannerjee, R. N. Joglekar, P. C. Joshi, Muzaffar Ahmad; Front Row: M. G. Desai, D. Goswami, R. S. Nimbkar, S. S. Mirajkar, S. A. Dange, S. V. Ghate, Gopal Basak

**కమ్యూనిస్టు పార్టీ సాధించిన విజయాలు :**

**భాషా ప్రయుక్త రాష్ట్రాలకోసం పోరాటం**

1953–56 మధ్య కాలంలో భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రగామిపాత్ర పోషించింది. ఆంధ్రాలో విశాలాంధ్ర కోసం, కేరళలో ఐక్య కేరళ కోసం, తమిళనాడులో ఐక్య తమిళ ఖజగం కోసం, మహారాష్ట్రలో సమైక్య మహారాష్ట్రకోసం ఉద్యమాలు నడిపి విజయవంతమైంది. భూ సంస్కరణలపై విజయం సాధించింది, కౌలుదారుల హక్కులు సాధించింది.

* * *

**సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపు :**

కమ్యూనిస్టు పార్టీ మొదటి సారిగా సంపూర్ణ స్వరాజ్యం కోసం పిలుపునిచ్చింది. 1921లో అహ్మదాబాద్ కాంగ్రెస్ మహాసభలో, తిరిగి 1922లో 'గయ'లో ఈ గళాన్ని వినిపించారు. కమ్యూనిస్టు నాయకులైన మౌలానా హస్రత్ మొహాని, స్వామి కుమారన్ ఈ నినాదాన్ని ఇచ్చారు. పాలక వర్గాలు సోషలిజం, సామాజిక న్యాయం అనే మాటలను వల్లించాల్సి వచ్చింది. కమ్యూనిస్టుల ఉద్యమ ప్రభావం రాజ్యాంగ పీఠికలో స్పష్టంగా కనిపించింది.

దున్నేవాడికే భూమి నినాదంతో జమిందారి, జాగిర్దారీ పాలనకు వ్యతిరేకంగా రైతు కూలీలను సమీకరించారు. భూ సమస్యను దేశ ఎజెండామీదకు తెచ్చారు. కార్మికులు, కర్షకులతోపాటు మహిళలు, దళితులు, ఆదివాసీలు స్వాతంత్ర్యోద్యమంలోకి వచ్చారు. మహిళా హక్కులు, కుల నిర్మూలన, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమించింది. మహిళా సమానత్వ హక్కును ఎజెండాలోకి తెచ్చింది. వరకట్నం, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసింది. కందుకూరి, గురజాడ వంటి వారి సంస్కరణ ఉద్యమాలకు కమ్యూనిస్టు ఉద్యమం ఊపిరి పోసింది. రాత్రిబడుల ద్వారా అక్షరాస్యతా కార్యక్రమాలు నిర్వహించింది. యువతను విద్యా, వైజ్ఞానిక సేవా సాంస్కృతిక కార్యక్రమాల్లో సమీకరించింది.

అభ్యుదయ రచయితలను, కళాకారులను ప్రోత్సహించారు. ప్రజాకళలను విస్తృతంగా తీసుకెళ్లారు. అనేకమంది ప్రజానాట్యమండలి కళాకారులు సినీరంగంలో ప్రవేశించి రాణించారు. వారిలో నాగభూషణం, గుమ్మడి, అల్లు రామలింగయ్య, వి.మధుసూదనరావు, తాతినేని ప్రకాశరావు, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, జి.వరలక్ష్మి, జమున, తర్వాత కాలంలో మాదాల రంగారావు, ఇంకా అనేక మంది కమ్యూనిస్టు అభిమానులైన నటులు సినీరంగంలో ఒక వెలుగు వెలిగారు. మహాకవి శ్రీశ్రీ, ప్రజాకవులు సుద్దాల హనుమంతు, గద్దర్, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, వందేమాతరం శ్రీనివాస్ లాంటి వారి కలాలకు, గళాలకు వర్గ పదును పెట్టింది.

నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం అనేక పోరాటాలు నిర్వహించింది. అందరికీ విద్య, వైద్యం, భూమి, ఇల్లు, పేదలకు చౌకగా ఆహారం కొరకు అనేక పోరాటాలు నడిపింది. కిలో రూపాయి బియ్యం నినాదాన్ని తీసుకువచ్చింది.

**వర్గసంఘాల ఏర్పాటు**

1920లో కమ్యూనిస్టుల సహకారంతో ఏఐటియుసి, 1936లో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్), 1936లో అఖిల భారత విద్యార్థి సంఘం, 1936లో అభ్యుదయ రచయితల సంఘం, 1943లో ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోషియేషన్ (ఇప్టా), తెలుగు రాష్ట్రాల్లో ప్రజానాట్య మండలి ఏర్పాటు చేశారు. అలాగే బ్యాంకు ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు, పాత్రికేయులకు, బొగ్గుగని కార్మికులకు, రవాణా కార్మికులకు, ఆయా రంగాల్లో వివిధ కార్మిక సంఘాలను ఏర్పాటు చేశారు.

**సామాజిక కార్యక్రమాలు**

ఇప్టా, అరసంలాంటి సాంస్కృతిక సంఘాలు దేశవ్యాప్తంగా సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికాయి. దళితులు ఆలయ ప్రవేశంకోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా, మూఢ నమ్మకాలకు, దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమా లు చేశారు. ప్రజల్లో హేతువాద, శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి కృషి చేశారు. బాల్య వివాహాల రద్దుకు, అభ్యుదయ వివాహాలకు, సతీసహగమనం రద్దుకై అనేక పోరాటాలు చేశారు.

* * *

**దేశంలో బలమైన కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకత**

దేశంలో బలమైన కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకత, అవసరం ఎన్నడూలేని విధంగా ఈనాడు ఉన్నది. ఉద్యోగ భద్రత లేదు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల పేరుతో అతి తక్కువ వేతనాలతో కొత్తరూపంలో శ్రమదోపిడి జరుగుతున్నది. భావాన్ని, ప్రశ్నించేవారిని అణచివేస్తున్నారు. రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు. కవులు, కళాకారులను మతోన్మాద ఆరాచకులు కాల్చి చంపుతున్నారు. సోషల్‌మీడియాను ఒక యూనివర్శిటీగా మల్చుకొని విద్రోహపూరిత విషజ్వాలలను సమాజంలో విరజిమ్ముతున్నారు. ఆర్థిక అసమానతలు ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పబడుతున్నప్పటికి సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమైంది. అలీన విధానాన్ని గాలికి వదిలేసి అమెరికా ఆదేశాలను పాటించే స్థితికి దేశపాలకులు వచ్చారు. కరోనాలాంటి కష్టకాలంలో ప్రపంచం ఆర్థిక మాంద్యంతో తల్లడిల్లిపోయినా భారతదేశ వ్యవస్థను బలంగా నిలపగలిగిన ప్రభుత్వరంగ సంస్థలైన బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, ప్రభుత్వ రంగాలను సరళీకరణ పేరుతో విదేశీశక్తులకు, కార్పోరేట్ శక్తులకు స్వాధీన పరుస్తున్నారు. బొగ్గుగనులు, ఉక్కు కర్మాగారాలు, రైల్వే వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, ఆఖరికి అణుశక్తిలాంటి వ్యవస్థల్లో విదేశీ పెట్టుబడులను స్వేచ్ఛగా అనుమతిస్తున్నారు. ఈ దశలో దేశానికి బలమైన ఐక్య కమ్యూనిస్టుపార్టీ అవసరం ఏనాడులేనివిధంగా ఉన్నది. ప్రజలు కమ్యూనిస్టు ఐక్యతను కోరుకుంటున్నారు. హిడ్మా, నంబూరి కేశవరావు వంటివారిని ఎన్‌కౌంటర్ పేరుతో హతమారుస్తుంటే కోట్లాది గుండెలు తల్లడిల్లుతున్నాయి. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వర రావు, సురవరం సుధాకర రెడ్డి, ఏచూరి సీతారాం లాంటి వారు మరణిస్తే కోట్లాది మంది నీరాజనాలు పలుకుతున్నారు.

**ప్రపంచంలో బలమైన శక్తి కమ్యూనిజం**

కమ్యూనిజం ఇంకెక్కడ ఉన్నది అనేవారికి జవాబు, ప్రపంచ జనాభా 600 కోట్లలో మూడో వంతు అనగా 187కోట్ల జనాభా కలిగిన దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నారు. అలాగే ప్రపంచంలోని 192దేశాలలో దాదాపు 150 దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు ఆయాదేశాలకు దిశానిర్దేశ పోరాటాలు చేస్తున్నాయి. చైనా, ఉత్తరకొరియా, వియత్నాం, లావోస్, కంబోడియా, శ్రీలంక, నేపాల్, లాటిన్ అమెరికా దేశాలు, బ్రెజిల్ లాంటి దేశాలలో కమ్యూనిస్టులు, వామపక్షాలు అధికారంలో ఉన్నాయి. భారతదేశం లాంటి దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలో లేకపోయినా కోట్లాది మంది ప్రజాసంఘాలలో, కార్మిక సంఘాలలో సభ్యులుగా కొనసాగుతూ ప్రజాసమస్యలపైన నిరంతరం పోరాడుతున్నారు.

**కమ్యూనిస్టుల ఐక్యత నేటి కర్తవ్యం**

కమ్యూనిస్టు పార్టీ చీలికల వల్ల దేశంలో అణగారిన వర్గాల కు తీరని అన్యాయం జరిగింది. దేశప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగింది. నక్సల్స్ పేరుతో, అర్బన్ నక్సల్స్ పేరుతో కమ్యూనిస్టులను, అభ్యుదయవాదులను అంతం చేస్తున్నారు. కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు పార్టీలు లక్ష్యంగా రాజ్యాంగ యంత్రాంగాన్ని ఉపయోగిస్తూ దాడులకు పూనుకుంటున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థ మాత్రమే. మనిషి సంక్షేమం, సౌభాగ్యం కేంద్రంగా పుట్టిన సిద్ధాంతం కమ్యూనిస్టు సిద్ధాంతం; మనిషి ఉన్నంత కాలం, మనిషిలో ఆలోచనలు, భావాలు, ప్రశ్నలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుంది. సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం కొనసాగుతుంది. ఈ దశలో కమ్యూనిస్టుల ఐక్యత అంతిమంగా కమ్యూనిస్టుల విలీనం దేశానికి, దేశ ప్రయోజనాలకు దిక్సూచి కాగలుగుతుంది.

**(కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా)**

# భవిష్యత్తు ఏమిటి?

(3వ పేజీ తరువాయి)

భవిష్యత్తు లేదా? అన్న ప్రశ్న సహజంగానే ఉద్భవిస్తున్నది. కానీ, అందులో వాస్తవం లేదు. ఎందుకంటే, ప్రజల్లో నిరాటంకంగా కొనసాగుతున్న తారతమ్యాలు, కార్మిక, ఉద్యోగ వర్గాలలో అభద్రత, వ్యవసాయరంగంలో సంక్షోభం, సంపద కేంద్రీకరణ ఉన్నంత వరకు కమ్యూనిస్టుల ఆవశ్యకత తప్పనిసరి. వీటికి శాస్త్రీయ పరిష్కార మార్గాన్ని యోచించేది, సూచించేంది, అందిచ్చేది మార్క్సిజం–లెనినిజం, దాని ఆచరణ కమ్యూనిస్టు పార్టీ అయినందువల్లనే. అయితే, పార్టీ ఇప్పుడనుసరిస్తున్న పద్ధతులు సరిపోవు. భారత కమ్యూనిస్టు పార్టీ పూర్వవైభవాన్ని సంతరించుకోవటానికి శ్రామికవర్గ, సామాన్య ప్రజల విశ్వాసాన్ని పొందటానికి పార్టీ తక్షణ కర్తవ్యంగా శత వసంతాల సందర్భంగా, చండీఘడ్‌లో జరిగిన సిపిఐ 25వ మహాసభ నిర్మాణ సూత్రాలను, కర్తవ్యాలను, ప్రజా కార్యాచరణకు చూపిన మార్గాలను అమలు పరుచుతామని మరోసారి ప్రతినబూనడమే.

ప్రజలాశించే కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత తక్షణావసరమే. కానీ, ఒక్క చేతితో కొడితే చప్పట్లు రా వు. గతానుభవం ఇదే సూచిస్తుంది. అందువల్ల నిర్మాణాన్ని నూతన పద్ధతుల్లో విస్తృతపరిచి పటిష్టపరచటం, మిలిటెంట్ పోరాటాలు, ఐక్య కార్యాచరణల ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీని ముందుకు తీసుకుపోవడం ద్వారానే ఇది సాధ్యమని గుర్తించాలి.

# నీతి ఆయోగ్ అధ్యయన నివేదిక బోగస్



రాజన్ క్షీర్‌సాగర్,
అధ్యక్షుడు, ఎఐకెఎస్,
9860488860

2026 బడ్జెట్ సమావేశాలకు ముందు, రాజకీయంగా సున్నితమైన తరుణంలో వ్యవసాయ ఉత్పత్తిదారుల ఆదాయంలో 126 శాతం పెరుగుదల ఉందని పేర్కొంటూ నీతి ఆయోగ్ అధ్యయనం విడుదలైంది. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఈ వృత్తాంతం తప్పు అని మాత్రమే కాకుండా, వ్యవసాయ విజయ వారసత్వాన్ని సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా రూపొందించిన మోసపూరిత గణాంక చర్యగా తిరస్కరించింది. ఈ నివేదిక ఆత్మహత్యలు, రుణగ్రస్తత, నిరసనలతో గుర్తించబడిన విస్తృతమైన రైతు బాధల ప్రత్యక్ష అనుభవాన్ని తప్పుదారి పట్టించే స్థూల ఆర్థిక మొత్తంతో భర్తీ చేస్తుంది. తద్వారా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) విధానాన్ని తొక్కిపెడుతూ వివాదాస్పద విబి జి రామ్ జి చట్టం, ప్రతిపాదిత విత్తన బిల్లు విద్యుత్ బిల్లు , విపత్తు నిర్వహణ చట్ట సవరణ ద్వారా వ్యవస్థాగత విధాన వైఫల్యాల నుండి ప్రమాదకరంగా దృష్టి మళ్లించడంలో ప్రభుత్వం నిమగ్నమైంది.

**1.సంపద వృత్తాంతాల రాజకీయాలు**

వ్యవసాయ ఉత్పత్తిదారుల ఆదాయంలో 126 శాతం పెరుగుదల ఉందని పేర్కొంటూ నీతి ఆయోగ్ అధ్యయనం విడుదల, 2026 బడ్జెట్ సమావేశానికి ముందు రాజకీయంగా సున్నితమైన తరుణంలో జరిగింది. ఈ వృత్తాంతాన్ని ఎఐకెఎస్ తప్పు అని మాత్రమే కాకుండా, వ్యవసాయ విజయ వారసత్వాన్ని సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా రూపొందించిన మోసపూరిత గణాంక చర్యగా తిరస్కరించింది. ఈ నివేదిక ఆత్మహత్యలు, రుణగ్రస్తత, నిరసనలతో గుర్తించబడిన విస్తృతమైన రైతు బాధల ప్రత్యక్ష అనుభవాన్ని తప్పుదారి పట్టించే స్థూల ఆర్థిక మొత్తంతో భర్తీ చేస్తుంది. తద్వారా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) విధానాన్ని తొక్కిపెడుతూ వివాదాస్పద విబి జి రామ్ జి చట్టం, ప్రతిపాదిత విత్తన బిల్లు 2025, విద్యుత్ బిల్లు 2025, రైతుల డిమాండ్‌లను, దానికి వ్యతిరేకం గా ఆందోళనలను అణిచివేయడం వంటి వ్యవస్థాగత విధాన వైఫల్యాల నుండి ప్రమాదకరంగా దృష్టి మళ్లించడంలో ప్రభుత్వం నిమగ్నమైందని ఈ విమర్శ పేర్కొంది.

**2. పద్ధతిలో లోపాలు: మొత్తంగా మోసం**

నీతి ఆయోగ్ అధ్యయనం ప్రాథమిక లోపం దాని ఎంపిక చేసిన పద్ధతిలో ఉంది.

**స్థూల— మొత్తంసూక్ష్మ బాధలను కప్పిపుచ్చడం:** జాతీయ ఖాతాల గణాంకాలు (ఎన్‌ఎఎస్), 'నిర్వహణ మిగులు/మిశ్రమ ఆదాయం' కొలతపై ఆధారపడటం ద్వారా, ఈ అధ్యయనం కార్పొరేట్ వ్యవసాయ వ్యాపారాలు, పెద్ద భూస్వాముల ఆదాయాలను చిన్న, సన్నకారు రైతుల ఆదాయాలతో కలుపుతుంది. వీరు 85 శాతం కంటే ఎక్కువ వ్యవసాయ కుటుంబాలను కలిగి ఉన్నారు. ఈ మొత్తానికి కృత్రిమంగా సగటును పెంచి, 'మధ్యస్థ' రైతు వాస్తవికతకు సంబంధం లేని 'సగటు'ను సృష్టిస్తుంది. ఇరుకైన అగ్ర శ్రేణికి చెందిన సంపదను సాధారణీకరించిన వృద్ధిగా మోసపూరితంగా ప్రదర్శించారు.



**క్లిష్టమైన తగ్గింపుల మినహాయింపు:** నికర పునర్వినియోగపరచలేని ఆదాయాన్ని నిర్వచించే కీలక తగ్గింపులను మినహాయించడం ద్వారా ఆదాయ గణన డొల్లగా ఉంది. మూలధన వినియోగం, పన్నులను లెక్కించేటప్పుడు, ఇది రుణ సేవల ఖర్చులను స్పష్టంగా వదిలివేస్తుంది. ఇవి భరించలేని భారంగా మారాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం గత దశాబ్దంలో 1.5 లక్షలకు పైగా రైతు ఆత్మహత్యలు ఆందోళనకరంగా కొనసాగడం ఈ మినహాయింపుకు అత్యంత విషాదకరమైన నిదర్శనం. ఇంకా, సబ్సిడీలను తిరిగి జోడించినప్పటికీ, ఇన్‌పుట్ సబ్సిడీలు ఎక్కువగా రైతులకు కాదు, కార్పొరేట్ తయారీదారులకు ప్రయోజనం చేకూరుస్తాయని, డీజిల్, విత్తనాలు, పురుగుమందుల ధరల పెరుగుదల ద్వారా తటస్థీకరించబడతాయని గుర్తించడంలో విశ్లేషణ విఫలమైంది.

**3. సామాజిక- ఆర్థిక క్షేత్ర-స్థాయి వాస్తవాల పూర్తిగా అనుసంధానం లేకపోవడం**

నివేదిక నిర్ధారణలలో స్వతంత్ర క్షేత్రస్థాయి సూచికలు ప్రత్యక్ష వైరుధ్యాలు కలిగి ఉన్నాయి. గత దశాబ్దంలో 1.5 లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారనేది నివేదిక డొల్ల వాదనలకు తిరుగులేని సాక్ష్యంగా నిలుస్తోంది.

ప్రచారం నుంచి విధాన న్యాయం దిశగా ప్రభు త్వం దృష్టి సారించాలని ఎఐకెఎస్ కోరుతుంది.

**ఎఐకెఎస్ డిమాండ్‌లు ఇవే :**

1. తప్పుదారి పట్టించే అంకెల వ్యాప్తిని తక్షణమే నిలిపివేయడం, అప్పు, వాతావరణ నష్టాలు, గృహ ఖర్చులను కలుపుకొని పారదర్శకంగా, విభజించబడిన, రైతు కేంద్రీకృత ఆదాయాన్ని నిబద్ధతతో అంచనా వేయాలి.
2. సి2+50 శాతం ఫార్ములా ఆధారంగా ఎంఎస్ పి కోసం చట్టపరమైన హామీని అమలు చేయడం.
3. దేశీయ ఉత్పత్తిదారులను అణగదొక్కే దోపిడీ దిగుమతి విధానాలను తిప్పికొట్టడం.
4. రైతులకు సమగ్ర రుణ మాఫీ, ప్రయోజనాత్మక పెన్షన్ వ్యవస్థ.
5. వాతావరణ దుర్బలత్వాలను పరిష్కరించడానికి బలమైన, సకాలంలో , రైతుస్నేహపూర్వక పంట నష్ట పరిహార వ్యవస్థ. విపత్తు నిర్వహణ సవరణ చట్టం – 2025 రద్దు చేయాలి.
6. ప్రతిపాదిత విత్తన బిల్లు, విద్యుత్ బిల్లు ఉపసంహరణ.
7. విబి జిరామ్‌జిని ఉపసంహరించుకొని, 200 రోజుల పని, గౌరవప్రదమైన వేతనంతో మహాత్మా గాంధీ నరేగాను తిరిగి ప్రవేశపెట్టడం.
8. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే అన్ని రైతు వ్యతిరేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను నిలిపి వేయాలి.
9. అమెరికా సామ్రాజ్యవాద ఒత్తిడి కింద భారత్–అమెరికా ఒప్పందానికి వద్దని చెప్పాలి.

నేటి అవసరం మెరిసే నివేదికలు కాదు, జవాబు దారీ పాలన. వ్యవసాయ సంక్షోభం అనే నిజం సమిష్టి జాతీయ ఖాతాలలో కాదు, రైతుల కనుబొమ్మలలో, వారి నిరాశ బ్యాలెన్స్ షీట్లలో, వారి ఆత్మహత్యల వెంటాడే గణాంకాలలో లఖించబడింది. మేము ఆ సత్యానికి అండగా ఉన్నాము. ఎఐకెఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుంది.



## ప్రజల గొంతుక ప్రజాపక్షం పత్రిక

మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు

**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రజల గొంతుకగా ప్రజాపక్షం జాతీయ దినపత్రిక పనిచేస్తుందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు భవన్‌లో శుక్రవారం ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను యాదగిరిరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా పత్రికలు పని చేయాలన్నారు. నిత్యం ప్రజా సమస్యలను పరిశీలిస్తూ వాటిని ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం పత్రికలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, మండల కార్యవర్గ సభ్యులు వేముల బుచ్చయ్య, మల్లోజు శేఖరాచారి, ప్రజాపక్షం పత్రిక మండల రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలు తెలియజేయడంలో 'ప్రజాపక్షం' ముందంజ



**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి చేతుల మీదుగా ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు తెలియజేయడంలో ప్రజాపక్షం ముందంజలో ఉందన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికితీయడంలో పత్రిక అగ్రభాగాన ఉందని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం మండల రిపోర్టర్ షేక్ అబ్దుల్ రహీం, ఉపసర్పంచ్ జంగాల పుల్లయ్య (అనంతమ్మ), వార్డు సభ్యులు షేక్ రియాజ్ (మీరాబి ఉస్మాన్), షేక్ మస్తాన్, బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు మోర్తాల వెంకటరెడ్డి, నాయకులు మైబెల్లి, అబ్దుల్, నాగుల్, అమరబోయిన శ్రీను, ఎర్రం శంబిరెడ్డి, తన్నీరు కొండ, మక్తుం అలీ, చింత్రియాల సైదులు, చిలక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో ప్రజాపక్షం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గ్రామ సర్పంచ్ సలహాదారుడు పగడాల సైదులు యాదవ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శాగం పెద్దిరెడ్డి,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్యముదిరాజ్ చేతుల మీదగా శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోడ అల్వాల గ్రామ సర్పంచ్ నాంపల్లి సైదులు,రమావత్ కిషన్ నాయక్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంగోత్ పాండు నాయక్, సీనియర్ నాయకులు శాగం అంజిరెడ్డి,సైదిరెడ్డి,అనుముల శ్రీను, అంజి,కోటేష్ పాల్గొన్నారు.

## యువత ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ ఉద్దేశమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. నకిరేకల్‌లో 2026 సిఎం కప్ క్రీడా పోటీలును క్రీడా టార్చ్‌ను వెలిగించి,జెండా ఊపి క్రీడా జ్యోతి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక బలం, క్రమశిక్షణ,నాయకత్వలక్షణాలనుపెంపొందిస్తాయని అన్నారు.యువతలో ఆరోగ్య అవగాహన, క్రీడలపై ఆసక్తి పెంచడంలో క్రీడా జ్యోతి ర్యాలీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.క్రీడారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న,నాగులవంచవెంకటేశ్వరరావు,నకిరేకంటి ఏసురత్నం, మురారిశెట్టి కృష్ణమూర్తి,గాజుల సుకన్య,రాచకొండసునీల్,యాసారపు వెంకన్న, పి ఈటి విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

## క్షణికావేశంలో హత్య



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ రైల్వేస్టేషన్ సమీపంలో ఈనెల 15న జరిగిన హత్య మద్యం మత్తులో క్షణికావేశంలో హత్య చేశారని విచారణలో తేలిందని టూ టౌన్ ఎస్ఐ వై సైదులు తెలిపారు.మృతుడు మన్యం చంద్రయ్య నల్లగొండలోని లేబర్ క్యాంపులలో తాత్కాలిక నివాసం ఉంటూ రైల్వే కూలీ పనులు చేస్తున్న నాగర్ కర్నూలు జిల్లా తెలకపల్లి గ్రామానికి చెందిన కూలీలు నారాయణపేట జిల్లా ధన్వాడ చెందిన కూలీలు సంక్రాం తి పండుగ సందర్భంగా గతంలో వారికి జరిగిన చిన్నచిన్న గొడవలు మనసులో పెట్టుకొని గొడవ పడుతుండగా ఇరువురుగాల చెందిన మేస్త్రీలు వచ్చి వారికి నచ్చజెప్పి గొడవ సర్ది చెప్పడం జరిగిందని తెలిపారు.అక్కడ పక్కనే ఇంకొక లేబర్ క్యాంపులో ఒరిస్సా,శ్రీకాకుళం చెందిన కూలీలు రైల్వే స్టేషన్లో ఫ్యాబ్రికేషన్ ఐరన్ వర్క్ కోసం వచ్చిన కూలీ లైనటువంటి లింగరాజు,కుమార్,చంద్రశేఖర్‌లు అక్కడ నిలబడి ఉండి మృతుడు మన్యం చంద్రయ్య అతని అన్న ఎల్లస్వామి బుష్‌పోగు స్వాములతో తలల మీద కర్రలతో విచక్షణారహితంగా కొట్టడంతో తల మీద తీవ్ర గాయాలై కింద పడిపోగా అతని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని పోగా అక్కడ అతన్నిపరీక్షించిన డాక్టర్లు మృతుడు చనిపోయాడని ధ్రువీకరించారని అన్నారు.అదేవిధంగా అన్న ఎల్ల స్వామి,బుష్‌పోగు స్వామిలకు తలలకు తీవ్ర గాయాలు అయ్యాయని మద్యం మత్తులో క్షణికావేశంలో హత్య చేసిన వారిపై మృతుని అన్న ఫిర్యాదు మేరకు టూ టౌన్‌లో కేసు నమోదు చేయడంతో హత్యజరిగిన సంఘటన స్థలాన్ని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి,టూ టౌన్ ఇన్చార్జి సిఐ ఏ రాజశేఖర్ రెడ్డిలు సందర్శించారని తెలిపారు.

# ఊహాజనిత వార్తలకు 'ఫుల్ స్టాప్'

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

ఆధారాలు లేకుండా కథనాలు రాయడం దురదృష్టకరం

మీడియాపై మాకు గౌరవం ఉంది.. కానీ బాధ్యత మరవద్దు

జర్నలిస్టుల అరెస్టులు బాధాకరం

భువనగిరి ఎంపి వెల్లడి



**ప్రజాపక్షం/యాదాద్రి :** మీడియాలో వస్తున్న ఊహాజనిత కథనాలు, తదనంతర అరెస్టుల పర్వంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కనుమ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, ఇటీవల ఒక ప్రముఖ ఛానల్ 'ఆఫ్ ద రికార్డు' కథనం వల్ల తలెత్తిన పరిణామాలపై స్పందించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు మీడియాలో వార్తలు వస్తున్నాయంటే ఖచ్చితమైన ఆధారాలు ఉండేవని, కానీ ప్రస్తుతం కేవలం ఊహలతో కథనాలు అల్లడం పరిపాటిగా మా రిందని చామల విమర్శించారు. ఇలాంటి నిరాధార వార్తల వల్ల రాజకీయ నాయకులు, అధికారులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఒక మహిళా అధికారిణిని, ఆమె వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా కథనాలు రాయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఒక కేబినెట్ మంత్రే స్వయంగా బయటకు వచ్చి 'విషం ఇచ్చి చం పండి' అన్నారంటే, సదరు వార్తలు వారిని ఎంతలా గాయపరిచాయో అర్థం చేసుకోవచ్చన్నారు. వ్యక్తుల వ్యక్తిగత జీవితాలను, కుటుంబాలను ఇబ్బంది పెట్టే వార్తలకు ఎక్కడో ఒకచోట అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని ఎంపీ స్పష్టం చేశారు. ప్రభుత్వంపై వస్తున్న ఒత్తిడి, బాధితుల ఆవేదన దృష్ట్యా ఇటువంటి చర్యలు తీసుకోక తప్పలేదని వివరించారు. జర్నలిస్టుల అరెస్టు వల్ల వారి కుటుంబాలు ఇబ్బంది పడటం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. తాను గానీ, సీఎం రేవంత్ రెడ్డి గానీ ఈ స్థాయిలో ఉండటానికి మీడియా ఇచ్చిన ప్రోత్సాహం ఎంతో ఉందని చామల గుర్తు చేసుకున్నారు. 'మేము ప్రజలకు సుపరిచితులం కావడానికి మీడియానే కారణం. జర్నలిస్టుల పట్ల మాకు ఎంతో అభిమానం ఉంది. అయితే, మీడియా తన బాధ్యతను విస్మరించకూడదు' అని సూచించారు. నాయకులు తప్పు చేస్తే, అవినీతికి పాల్పడితే ఆధారాలతో సహా ఎండగట్టాలని, దానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కొన్ని సోషల్ మీడియా ఛానళ్లు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోబడుతున్నాయని, ప్రజలు నమ్మే ప్రధాన పత్రికలు, ఛానళ్లు 'ఆఫ్ ద రికార్డ్' పేరుతో ఊహలను ప్రచారం చేయవద్దని కోరారు. వ్యవస్థ సజావుగా సాగాలంటే మీడియా యాజమాన్యాలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.85 లక్షలు వసూలు...

అంతర్ రాష్ట్ర నిందితుడు అరెస్ట్

అడిషనల్ ఎస్‌పి జి.రమేష్ వెల్లడి



**ప్రజాపక్షం/నల్లగొండ/చింతపల్లి :** విదేశాల్లో ఉన్నత చదువులు,ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన అంతర్ రాష్ట్ర నిందితుడిని చింతపల్లి పోలీసులు అరెస్టు చేశారని అడిషనల్ ఎస్‌పి జి.రమేష్ పేర్కొన్నారు.శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన ముప్పాళ్ల లీలా కృష్ణ విదేశాల్లో ఉన్నత చదువులు చదివిస్తానని, అక్కడే ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్న అంతర్ రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుండి ఒక ల్యాప్‌టాప్,మూడు స్మార్ట్ ఫోన్లు,వివిధ బ్యాంకులకు చెందిన డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కేసులో ముప్పాళ్ల లీలా కృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా ఇతడు నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఇప్పటివరకు మొత్తం 8 మంది నుండి సుమారు రూ.85 లక్షల వరకు తీసుకొని మోసం చేసినట్లు గుర్తించారని తెలిపారు.ఈ విదంగా సంపాదించిన డబ్బులతో నిందితుడు కొంత డబ్బును విలాసాలకు , జల్సాలకు ఖర్చు పెట్టాడని తెలిపారు. మాల్ గ్రామం మర్రిగూడ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని గుర్తించిన చింతపల్లి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించడంతో నిందితుడిపై ఇప్పటికే మాడుగులపల్లి పోలీస్ స్టేషన్,వరంగల్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో చీటింగ్ కేసులు నమోదై ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు.ఈ కేసులో నేరస్థుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించి ప్రతిభ కనబర్చిన నాంపల్లి సీఐ డి.రాజు, చింతపల్లి ఎస్ఐ ఎం.రామ్మూర్తి చింతపల్లి పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

# హైదరాబాద్‌కి వెళ్లే వాహనాల దారి మళ్లింపు

నేషనల్ హైవే 65పై ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు : జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/నల్లగొండ :** సంక్రాంతి పండగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పండగ పూర్తి చేసుకొని ఒకే సారి హైదరాబాద్ నగరానికి భారీగా వాహనాలు రానున్న నేపథ్యంలో నేషనల్ హైవే 65హైదరాబాద్ టు విజయవాడ పై చిట్యాల పెద్ద కాపర్తి వద్ద ఫ్లై ఓ వర్ నిర్మాణ పనులు కొన సాగుతోన్న నేపధ్యంలో ట్రాఫిక్ జామ్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నందున ట్రాఫిక్ రద్దీనిని వారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదా రులపై ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రయాణికులకు సురక్షితమైన, సునాయసమైన ప్రయాణ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ట్రాఫిక్ దారి మళ్లింపు చర్యలు చేపట్టిందన్నారు. ఈక్రమంలో ఆంధ్ర ప్రాంతం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు నల్లగొండ,మార్రిగూడ బైపాస్, మునుగోడు, నారాయణ పూర్,చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్‌కి వెళ్లాలన్నారు. అదేవిధంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు కోదాడ, హుజూర్ నగర్, మిర్యాల గూడ, హాలియా,చింత పల్లి, మాల్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. చిట్యాల,పెద్దకాపర్తిలో ఫ్లైఓవర్ నిర్మాణాలు జరుగుతున్నందున ట్రాఫిక్ జామ్ అయిన పక్షంలో చిట్యాల నుండి భువనగిరి గుండా హైద్రాబాద్ మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ మార్గాల ద్వారా వెళ్లడం వల్ల ప్రధాన రహదారి విజయవాడ,హైదరాబాద్‌పై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి,ప్ర యాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చని సూచించారు. సంక్రాంతి పండగ పూర్తి చేసుకున్న ప్రజలంతా తమ గమ్యస్థానాలకు హైద్రాబాద్‌కు సురక్షితంగా చేరుకోవాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని, ట్రాఫిక్ రద్దీ కారణంగా ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో దారి మళ్లింపు చర్యలు అమలు చేస్తున్నామన్నారు.



## నిబంధనల మేరకు అనుమతులు జారీ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పరిశ్రమలకు నిబంధనల మేరకు అధికారులు సకాలంలో అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటి, టిజి ఐ పాస్ కమిటి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల గురించి సమీక్షించారు. 49 పరిశ్రమలకు గాను 119 అప్రూవల్స్ వివిధ శాఖల ద్వారా వచ్చాయని వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు నిబంధనల మేరకు ఆమోదించాలని సూచించారు. ఈ సమావేశంలో టిప్రైడ్ పథకం కింద 143 మంది లబ్ధిదారులకు రాయితీ మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని రైసు మిల్లులు, ఫార్మా అలాగే సిమెంట్ పరిశ్రమలు భద్రతా నిబంధనలు, తీసుకుంటున్న జాగ్రత్తలపై త్వరలో అధికారులతో, యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి సీతారాం, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బి యాదగిరి, డిపిఓ కె యాదగిరి, ఆర్‌టిఓ జయప్రకాష్‌రెడ్డి, ఎస్‌సి డెవలప్‌మెంట్ అధికారి దయానందరాణి, ఎస్‌టి డెవలప్‌మెంట్ అధికారి కె శంకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికల వార్డుల రిజర్వేషన్లు

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియ ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ల విషయమై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల అమలుకై జీవో ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.మున్సిపాలిటీల్లో వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేసే సమయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో ను తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లు నిబంధనల ప్రకారం, పారదర్శకంగా అమలు చేయాలన్నారు.గత ఎన్నికల రిజర్వేషన్ డేటా, జనాభా గణాంకాలు, రొటేషన్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని వార్డుల వివరాలు, రిజర్వేషన్ పట్టికలను ముందుగానే సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని, అవసరమైన చోట స్పష్టత కోసం వెంటనే సంప్రదించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సవ్యంగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

## నిత్య కల్యాణోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి:** శ్రీ వేంకటేశ్వర స్వామిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 7:30 నిమిషాలకు శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు.




## అరైవ్ ఎలైవ్ అనేది కేవలం ఒక్క రోజు కార్యక్రమం కాదు : డిఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సురక్షిత గమ్యం సజీవ ప్రయాణం (అరైవ్ ఎలైవ్) అనేది కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదని నిరంతర సామాజిక ఉద్యమమని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల రహిత సూర్యాపేట జిల్లా కోసం అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్లు బాధ్యతగా వ్యవహరించి కలిసి కట్టుగా పనిచేయాలని కోరుతూ రోడ్డు భద్రతపై అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ రోడ్డు భద్రతపట్ల ప్రతి ప్రభుత్వ ఉద్యోగి వారి సిబ్బందికి విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడాలని, ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పౌరులు బాధ్యతగా ఉండడం, ప్రయాణ సమయంలో సురక్షిత గమ్యాలను చేరుకోవడం లక్ష్యంగా రాష్ట్ర డిజిపి ఆధ్వర్యంలో అరైవ్ ఎలైవ్ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం రోడ్డు భద్రత పట్ల అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బందితో రోడ్డు సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏంవిఐ విక్రమ్, ఆర్‌టిసి సిఐ సైదులు నాయక్, జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ లక్ష్మ ణ్, సూర్యాపేట ఎంఇఓ శ్రీనివాస్, ఎస్ఐలు సాయిరాం, మహేందర్, ఐలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## బ్రాహ్మణ వెల్లంల కుమ్మరిసంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం /నార్కట్‌పల్లి :** మండలం పరిధిలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామ కుమ్మరుల నూతన గ్రామ కమిటీని ఆ సంఘం జిల్లా కన్వీనర్ రాధారపు భిక్షపతి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కమిటీ ని ఎన్నుకున్నారు.శుక్రవారం గ్రామంలోని అంగన్వాడి సెంటర్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కుమ్మరుల సమావేశంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా సిరిసన వాడ వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులుగా సిరిసన వాడ శ్రీశైలం,ప్రధాన కార్యదర్శిగా నిరసన వాడ చిన్న నరసింహ,కోశాధికారిగా సిరిసనవాడ నరేష్,గౌరవాధ్యక్షులుగా సిరసనవాడ రంగయ్య, సహాయ కార్యదర్శిగా శిరసన వాడ జంగయ్య,సలహాదారుగా శిరసన వాడ లింగయ్యలు ఎన్నికైనారు. జిల్లా కమిటీ మెంబర్ తాడూరి చంద్రం,నకరెకల్ నియోజకవర్గ ఇన్చార్జి నిమ్మనగోటి వెంకన్న,మండల శాఖ అధ్యక్షులు రాజు,ప్రధాన కార్యదర్శి సైదులు హాజరైనారు.

# పీడిత,తాడిత ప్రజల కోసం సిపిఐ పోరాటాలు



**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్) :** ఖమ్మం జిల్లాలో ఈనెల 18నజరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల జాతీయ బహిరంగ సభను జయప్రదం చేయాలని మండల సహాయ కార్యదర్శి చిలక రాజు రాములు పిలుపునిచ్చారు. సిపిఐ ధర్వేశిపురం గ్రామ శాఖలో బహిరంగ సభ వాల్ పోస్టర్,కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ భారత దేశంలో శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి కార్మిక, విద్యార్థి, రైతు, మహిళ తదితర ప్రజా సంఘాలను నిర్మించి వెట్టి చాకిరి విముక్తి కొరకు,కార్మికులను కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులుజినుకుంట్ల ఆంజనేయులు, గట్టిగుండ్ల ఎల్లయ్య,పిల్లుట్ల మురళి,యాదయ్య,పెద్దనర్సింహ, చరణ్, రిషికేష్,నర్సింహ,పండు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు ఆకుల రఘుమయ్య పటేల్ పిలుపు నిచ్చారు.శుక్రవారం కొండూరు గ్రామంలో జరిగిన సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పీడిత,తాడిత ప్రజల కోసం అనేక పోరాటాల చేసేందని అన్నారు. ఈ సమావేశానికి సిపిఐ శాఖ కార్యదర్శి వడ్డెమాను వెంకటయ్య అధ్యక్షత వహించగా నాయకులు ఆకుల వెంకట్రామ్ పటేల్,ఈద మారయ్య,బడేటి పెద్దయ్య,కుమ్మరి సత్తయ్య, పడాల రాములు,నడింపల్లి సత్తయ్య,వడ్డేమాను రాములు,నున్ సావాత్ రమేష్,జర్పుల రామారాజు,ఆంబోతు నవీన్,జరుపుల రవి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చండూరు:** సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్ బిజిఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్‌లో జరుగు అఖితభారత స్థాయి ముగింపు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో బహిరంగ సభ కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్ , దోటి వెంకన్న, సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం నవీన్ , ఉపసర్పంచ్ గడ్డం యాదయ్య, బరిగెల శ్రవన్‌కుమార్, బాలరాజు , ఇరిగి గోపయ్య , అంజయ్య, ప్రవీణ్ , వెంకట్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.



## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మైనర్ అయిన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా ప్రత్యేక బాధ్యతగా తీసుకోవాలని అర్వపల్లి ఎస్ఐ సైదులు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అరైవ్ ఎలైవ్ కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని వాహనదారులు హెల్మెట్ లేకపోవడం, డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం మూలంగా ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాలు సంభవిస్తున్నాయన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి నగేష్, ఎంపిఓ గోపి, సిహెచ్ఓ బిచ్చు నాయక్, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఏఎన్ఎం సతీష్, మమత, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో సాగుకు నీళ్లు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని బిక్కేరువాగులో శ్రీరాంసాగర్ జలాలతో ధర్మారం చెక్ డాం ఎమ్మెల్యే మందుల సామేలు చొరవతో నిండి అలుగుపోస్తుంది. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మందుల సామేలు పలుమార్లు మంటికైన ఇంటోడు ఉండాలి(మట్టిపనికైన ఇంటోడు ఉండాలి)అనే సామేలు నిజమైందని రైతుల్లో చర్చలు జరుగుతున్నాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్లు ఎండుతున్నాయని అప్పటి ఎమ్మెల్యే, మంత్రిని కలసి గోదావరి జలాలను బిక్కేరువాగుకు వదలాలి అని రైతులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసారు. ఇప్పుడు స్టానిక ఎమ్మెల్యే స్థానికులు రైతు కాబట్టే యాసంగిలో సాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా ధర్మారం, వర్ధమానుకోట చెక్ డాంలు నింపుతున్నారని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎగువన ఉన్న చెక్ డాంలు కూడా నిండేవిదంగా చూడాలని బిక్కేరువాగు పరివాహక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మీడియా పాత్ర కీలకం



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : నేటి సమాజంలో ప్రింట్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మీడియాపాత్ర కీలకమని కల్వకోల్ గ్రామసర్పంచ్ బంట్రోతు శ్రీనివాసులు అన్నారు. ప్రజాపక్షం క్యాలెండర్ శుక్రవారం కల్వకోల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని వెలికితీయడంలో, నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియాపాత్ర కీలకమన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బిఆర్ఎస్‌పార్టీ నాయకులు వెంకటస్వామి, కొండశ్రీనుసాగర్, సుధాకర్, బిజెపి నాయకులు గువ్వలి వెంకటయ్య, మల్లేష్, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు , వార్డుమెంబర్స్, గ్రామప్రజలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యలు నిర్భయంగా వెలుగులోకి..



ప్రజాపక్షం/నర్వ : నర్వ మండల కేంద్రంలో దండు అయ్యప్ప ఆధ్వర్యంలో ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ నాయకులు కేశవులు నర్వ ఉపసర్పంచ్ అజయ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక గత అనేక సంవత్సరాలుగా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ, సామాన్యుల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తోందని ప్రశంసించారు. అధికారాల ఒత్తిడిలకు లోను కాకుండా నిజమైన జర్నలిజాన్ని కొనసాగించడం ప్రజాపక్షం ప్రత్యేకతగా వారు పేర్కొన్నారు. ప్రజాపక్షం దినపత్రిక ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజల నమ్మకమే తమ బలం అని, భవిష్యత్తులో కూడా నిజం, న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పత్రిక నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు రఘు, ఆంజనేయులు, నాయకులు రాంపూర్, శంకర్, మీసేవ రమేష్, సురేష్ పాల్గొన్నారు.

## నీటి సరఫరా నిలిపివేత

ప్రజాపక్షం/మద్దూర్ : పట్టణ కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా నేడు ఉదయం 10 గంటల నుండి 20–01–2026 ఉదయం 10 గంటల వరకు మిషన్ భగిరథ నీటి సరఫరా నిలిచివేయబడుతుందని మహబుబ్‌నగర్ కార్యనిర్వహక అభియంత అధికారి డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలో 400 ఎంఎం డిఐ పైప్ లైన్ షిఫ్టింగ్ మరియు మద్దూర్ నుండి రెనివట్ల రోడ్డు విస్తరణలో భాగంగా 250ఎంఎం డిఐ పైప్‌లైన్ షిఫ్టింగ్ ఉన్నందువల్ల మద్దూరు మండలంలోని పల్లేర్ల, మోదులుకుంట తాండ, చంద్ర్యనాయక్ తాండ, లక్కాయాపల్లి, లక్కాయపల్లి తాండ, నంధిపాడ్, మెడికుంట తాండ, ఖాజీపూర్, ఖాజీపూర్ తాండ, అప్పిరెడ్డిపల్లి, అచ్చంపల్లి, పెదిరిపాడ్, పెదిరిపాడ్ తండా, చెన్నారెడ్డిపల్లి, మోమినాపూర్, నాగిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి తాండ, పర్సాపూర్, దమగాన్‌పూర్, చింతల్‌దిన్నే, చింతల్‌దిన్నే తాండ పరిసరాల మొత్తం 33 గ్రామాల ప్రజలకు మిషన్ భగిరథ నీరు సరాఫరా నిలిపివేయబడుతుందని అలాగే మద్దూరు మున్సిపాలిటి కింద మద్దూరు, అంబటోనివంపు, శాపన్ చెరువు తాండ, నాగంపల్లి, భీంపూర్, రెనివట్ల, ఎర్రగుంట తాండ, ఎర్రగోల్ తాండ మొత్తం 10 గ్రామాల ప్రజలకు మిషన్ భగిరథ నీరు నిలిపివేయబడుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

## హోమంలో పాల్గొన్న మంత్రి వాకిటి

ప్రజాపక్షం/మక్తల్ : ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారు జామున నిర్వహిస్తున్న లక్ష్మి సమేత హయగ్రీవ స్వామి హోమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. గత కొన్ని నెలలుగా పట్టణంలోని అత్యంత పురాతనమైన పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రతినెల లోక కళ్యాణార్థ తిథి నక్షత్రాన్ని పురస్కరించుకొని తెల్లవారు జామున ఆలయం ఆవరణలో ఆలయ ధర్మకర్త ప్రాణేష్ ఆచారి, ఉడిపి పీఠం ఫేజావరు మఠ వేద పండిత శిక్షకుడు రాఘవేంద్ర చారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న హోమంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా పాల్గొని హోమాన్ని కొనసాగింపుకు సంకల్పం చేశారు. అనంతరం మంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేసి స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు.

## క్రీడలతో సోదరభావం



ప్రజాపక్షం/దామరగిద్ద : దామరగిద్ద మండల పరిధిలోని అయ్యావారిపల్లిలో గత మూడు రోజులుగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి అంజిలయ్య గౌడ్, దేశాయ్ పల్లి సర్పంచి లాలప్ప, అయ్యావారిపల్లి సర్పంచి అనంతమ్మ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్యాన్ని మానసిక ఉల్లాసాన్ని సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడలలో గెలుపు, ఓటములు సహజమని ఓటమిని కూడా సంతోషంగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యకరమంలో ఉప సర్పంచులు శ్రీకాంత్ రెడ్డి, మహేందర్, డివైఎఫ్ఐ నాయకులు గోవిందు, నవీన్ సాయి, భీమాసేన్, గ్రామ పెద్దలు వెంకటయ్య, బి.లాలప్ప, బాల వర్ధన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, ఆయ్యా గ్రామాల వార్డు మెంబర్లు రవి హన్మంతు, అంజప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ రివర్స్ పోటీలు

ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ : శ్రీరంగాపూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఘనంగా సంక్రాంతి పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా జానంపేట గ్రామంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు, బైక్ రైడర్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గ్రామానికి చెందిన యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు దాతల సహకారంతో ట్రాక్టర్ రివర్స్ పోటీలలో ప్రథమ బహుమతి గుంటి రాకేష్ సాగర్, ద్వితీయ బహుమతి మహేందర్, బైక్ రైడర్స్ పోటీల్లో ప్రథమ బహుమతి పార్టీ మీదిరాజు, ద్వితీయ బహుమతి శ్రీనులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : నేడు మహబూబ్‌నగర్ జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డితో కలిసి యం.వి.ఎస్. కళాశాల మైదానంలో బహిరంగ వద్ద గల సోషల్ వేల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాల వద్ద ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిచారు. మహబూబ్ నగర్ జిల్లాలో దాదాపు 1200 కోట్ల విలువగల వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మన నల్లమల బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసుతులు, రవాణా, సాగునీరు, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రహదారులు, భవనాల రంగాల్లో భారీగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ గురించి రూ. 603 కోట్ల నిధులు, పాలమూరుకు శాశ్వత మంచినీటి సరఫరా పరిష్కారానికి రూ. 220 కోట్లు, యం.వి.ఎస్. కళాశాల అదనపు భవనానికి రూ. 20 కోట్లు, ఇంటిగ్రేటెడ్ రెడిడెన్షియల్ స్కూల్ తదితర అభివృద్ధి పనులకు యం.వి.ఎస్. కళాశాల మైదానంలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలియజేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవేంద్ర ప్రతాప్, అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ ఈ. నవీన్, జిల్లా అధికారులు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



## సిపిఐ వందేళ్ల ఉత్సవ పండుగ

ప్రజాపక్షం/వీపనగండ్ల: ఖమ్మంలో ఈనెల 18న జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవం కష్టజీవులకు పండుగ రోజు అని సిపిఐ అనుబంధ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్, సీనియర్ నేత రంజాన్ అలీ అన్నారు. వీపనగండ్ల మండలం బొల్లారంలో సిపిఐ ఆఫీస్ వద్ద సిపిఐ శతాబ్ది ఉత్సవాల గోడపత్రికలను సీనియర్ నేత రంజాన్ అలీ, మండల కార్యదర్శి ఎం.కురుమయ్య స్థానిక నేతలతో కలిసి ఆవిష్కరించారు. రంజాన్ అలీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కేంద్రంలో 18న రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో వందేళ్ల పండుగను ఘనంగా నిర్వహిస్తోందన్నారు. 45 దేశాల ప్రతినిధులు పండుగకు హాజరు కాబోతుందన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో లక్షలాది మందితో ఎర్ర సముద్రంలా పోటెత్తే ఖమ్మం బహిరంగ సభకు ఈనెల 18న వనపర్తి జిల్లా నుంచి భారీగా తరలి వెళ్లాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి ఎం.కురుమయ్య, సీనియర్ నేత రంజాన్ అలీ, శివ, అర్జున్ అయ్యా, కృష్ణయ్య, ఎండి అమీర్, తిరుపతయ్య, రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజల్లో సిఎం సతీమణి



ప్రజాపక్షం/వంగూర్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డి ఈదమ్మ దేవాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సతీమణి గీత, సీఎం సోదరులు తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, ఉపసర్పంచ్ వేమారెడ్డి, లాల్‌యాదవ్, వార్డుసభ్యులు ముత్యాల లక్ష్మారెడ్డి, చందుయాదవ్, జంగయ్యయాదవ్, కృష్ణారెడ్డి, రాఘవేందర్ పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన పనిచేసేది ‘ప్రజాపక్షం’ దినపత్రిక

### క్యాలెండర్ ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



ప్రజాపక్షం/వనపర్తి: ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించేందుకు ముందు వరుసలో పనిచేస్తుంది ప్రజాపక్షం దినపత్రిక అని జిల్లా కలెక్టర్ ఆదర్శసురభి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో వనపర్తి జిల్లా ప్రజాపక్షం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను, డైరీని ఆదర్శ సురభి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్రికల్లో వచ్చే ప్రతి అక్షరం ప్రజలకు అధికారులకు ప్రజాప్రతినిధులకు మార్గదర్శకంగా ఉండాలని, జర్నలిజంలో విలువలు కాపాడుకుంటూ, ప్రస్తుత ఆధునిక సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. విలువలతో కూడుకున్న జర్నలిజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ఈ ఆవిష్కరణలో పాల్గొన్న టియుడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ మాట్లాడుతూ జర్నలిజం యొక్క విలువలను కాపాడుతూ వృత్తికి న్యాయం చేసేందుకు జర్నలిస్టులు కృషి చేయాలన్నారు. జర్నలిజంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సమాజహితం కోసం పనిచేయడం వల్ల జర్నలిస్టులకు మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయన్నారు. ప్రజాపక్షం దినపత్రిక విలేకరులు ఆంజనేయులు, నటరాజ్, శ్రీకాంత్, సలీం, దామోదర్, వేణు, సత్యనారాయణ, శ్రీను, వేణుగోపాల్, రామన్ గౌడ్, ఫోటో గ్రాఫర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల ప్రవేశ ప్రచార కర పత్రాల విడుదల



ప్రజాపక్షం/నారాయణపేట్ : తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రారంభానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లా పరిధిలో గల ఒక బాలుర పాఠశాల, ఒక బాలికల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలు అన్ని వర్గాలకు అలాగే 6వ,7వ,8వ తరగతులు మైనార్టీ వర్గాలకు మాత్రమే దరఖాస్తుల ఆహ్వానించడం జరుగుతుందని ఆమె తెలిపారు. కళాశాలలు: టీ.జీ.ఎం.ఆర్.జేసి బాలికలు, మక్తల్ (ఎంపీసీ, బైపీసీ), టీ.జీ.ఎం.ఆర్.జే.సి బాలురు, నారాయణపేట (ఎంపీసీ, బైపీసీ), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశలకు ఫ్రీ ఆన్‌లైన్ ద్వారా లేదా పాఠశాల, కళాశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ ఆఫీసర్ షమీం, విజిలెన్స్ ఆఫీసర్స్ జమీర్ ఖాన్, మసూద్, ప్రిన్సిపల్స్ ఎ.జగదీశ్వర్, ఖాజా మహబూబ్ ఖాన్,ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.



## మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్ నగర్ పట్టణంలోని కిద్వాయిపేట, 47 వ వార్డులో ముడా నిధులు రూ.10 లక్షలు వెచ్చించి మహిళా సంఘం భవనంలో మిగిలిన పనులు పూర్తి చేయగా, ఆ భవనాన్ని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి భవనాలు ఎంతో దోహదపడతాయని, మహిళా సంఘాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, మహిళల సాధికారతకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గోవింద్, నాయకులు చిన్న రాజు, బాసిత్, చంద్రమౌళి, ఖాజా, పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజాపక్షం/కల్వకుర్తి : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వివిధ వార్డులలో అభివృద్ధి పనులకు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.20లక్షలతో వడ్డెర బస్తీలో బస్తీ దవాఖానకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పాలమూరు చౌరస్తాలో రూ.50లక్షలతో సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ కళాశాలలో రూ.కోటి50లక్షలతో డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 8వవార్డులో రూ.20లక్షలతో బస్తీ దవాఖానకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కల్వకుర్తి నియోజకవర్గంలో దాదాపు రూ.1100కోట్ల అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డుమెంబర్, టిపిసిసి అధికారప్రతినిధి ఠాకూర్ బాలాజి సింగ్, కమీషనర్ మహ్మద్‌షేక్, మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌యాదవ్, ఎజాస్, రమాకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, సంతుయాదవ్, పాండురంగారెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/చిన్నంబావి: చిన్నంబావి మండల పరిధిలోని గ్రామంలో గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్ చేతుల మీదుగా ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలపైన వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారధిగా పనిచేసేది దినపత్రికలు అని అన్నారు. ప్రజల సమస్యలను గ్రామాలలో తెలుసుకొని పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చేదే జర్నలిస్టులేనని ఈ సందర్భంగా అన్నారు. అలాగే ప్రజాపక్షం దినపత్రిక యజమాన్యానికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ పబ్బరాము, గ్రామ సర్పంచు కవితా ప్రభంజన్ గౌడ్, మాధగొని శివ (తార చందు) ఉపసర్పంచు ఆరేపల్లి మాధవి మాధవరెడ్డి, రామన్ గౌడ్, వెంకటేశ్ నాయుడు, కోళ్ల నవీన్, గరసర్లు, నాగేంద్రం గౌడ్, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.కోటిన్నర నిధులతో పంచారామానికి రోడ్డు నిర్మిస్తాం

### ఎమ్మెల్యే వంశీకృష్ణ



ప్రజాపక్షం/అచ్చంపేట/వంగూర్ : అచ్చంపేట పరిధిలోని ఉమామహేశ్వరం దగ్గర రూ.కోటిన్నర నిధులతో రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం ఉమామహేశ్వరంలో జరిగిన శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమామహేశ్వర దేవస్థానాన్ని ఆధ్యాత్మిక కేంద్రంతోపాటు టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే రూ.20కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్మించామని, ప్రస్తుతం ఒకటిన్నర కోట్ల రూపాయలతో పంచారామా క్షేత్రాలకు రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. తామూ అభివృద్ధి చేసి చూపిస్తామే తప్పా మాటల్లో చెప్పమన్నారు. అనంతరం ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మండలపరిధిలోని అన్నారం గ్రామంలో గురువారం నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, గ్రామసర్పంచ్ మెరుగు గోవర్ధన్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాలను చిన్న చూపు చూస్తూ గ్రామాలను అధోగతి పాలు చేశారని విమర్శించారు. సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని గ్రామంలో చెన్నకేశవ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు మెరుగు రమేష్‌రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రధానం

ప్రజాపక్షం/రేవల్లి: రేవల్లి మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నాగపూర్ గ్రామంలో బిజెపి ఆధ్వర్యంలో నాగపూర్ గ్రామ హైస్కూల్లో మహిళమణులకు పోటీ నిర్వాహకుడు కర్ణిక శ్రీశైలం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల్లో నిర్వహించారు. పోటీల్లో గ్రామానికి చెందిన మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులతో అలరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు దాతల సహకారంతో ప్రథమ బహుమతి రూ.5000 బేని అనూహ్య, కవితలకు పరిపూర్ణాచారి అందజేశారు. ద్వితీయ బహుమతిగా రూ.3,000 యాలాల శివజ్యోతి, వాసవిలకు దొడ్డి నవీన్ కుమార్ అందజేశారు. తృతీయ బహుమతిగా రూ.2000 శివాణికి జగతిరెడ్డి అందించారు. నాల్గవ బహుమతికి రూ.1500 నగదు రూపంలో కర్ణిక చంద్రకళ, పుష్పలతలకు శ్యాంసుందర్ చారి అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు మాచర్ల సరిత అందించారు. ముఖ్య అతిథిగా శానాయిపల్లి గ్రామ సర్పంచు మేకల కృష్ణయ్య, నాగపూర్ గ్రామ సర్పంచు లోడే అంజలమ్మ, ఉపసర్పంచు నడిమింటి అశ్విని, ఉమ్మడి మండలం, మాజీ సింగిల్ విండో చైర్మన్ లోడే రఘు, బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ మాచర్ల అజయ్ గౌడ్, న్యాయ నిర్ణేతలుగా దూరెడ్డి ప్రతాపరెడ్డి, మల్లపల్లి ప్రభావతి, కొత్త వంశీ తదితరులు పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ప్రజాపక్షం/ఉట్కూర్: నాగిరెడ్డిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్, బస్వారాజ్ ఉపసర్పంచు నర్సింహులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం బాధితుడు సత్యనారాయణ గౌడ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కష్టాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తక్షణ సహాయం అందిస్తున్నదని తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్దిదారులు ప్రభుత్వ సహాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, కష్టకాలంలో అండగా నిలిచిన సీఎంకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విచారణ కమిటీతో వాస్తవాలు వెలుగులోకి

### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



ప్రజాపక్షం/జడ్చర్ల: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అభాండాలు మోపుతూ దుష్ప్రచారం చేయడం బాధాకరమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. కోమటిరెడ్డిపై చేసిన ఆరోపణలను నిగ్గుతేల్చడానికి వేసిన విచారణ కమిటీలో అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లి వద్ద నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జడ్చర్ల ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి వాకిటి శ్రీహరి, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి శుక్రవారం అనిరుధ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మట్లాడుతూ.. కోమటిరెడ్డిపై వచ్చిన ఆరోపణలు చూసి తాను ఎంతగానో బాధపడ్డానని చెప్పారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్ లాంటి వారని, నీతి నిజాయితీలకు ప్రతీక అని అభిప్రాయపడ్డారు. తెలంగాణ కోసం పదవిని కూడా త్యాగం చేసిన చరిత్ర ఆయనదని తెలిపారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే తనకు ఆయన వ్యక్తి త్వం ఏమిటో కూడా బాగా తెలుసన్నారు. కోమటిరెడ్డిపై ఆరోపణలు చేసిన మీడియా ఛానల్ కూడా తనకు తెలుసునని ఆ ఛానల్ కూడా తనకు తెలుసునని ఆ ఛానల్‌లో అలాంటి కథనం ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై వేసిన సిట్ తన విచారణలో వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తుందని అనిరుధ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ‘చిన్నస్వామి’కి పూర్వవైభవం దక్కేనా...

ఒకప్పుడు ఐపిఎల్ మ్యాచ్‌లతో కోలాహలంగా కనిపించిన చిన్నస్వామి స్టేడియానికి పూర్వ వైభవం తేవాలని కర్నాటక క్రికెట్ సంఘం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఎలాగైనా ఐపిఎల్ మ్యాచ్లను మళ్లీ చిన్నస్వామిలో నిర్వహించాలనే ఉద్దేశంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. స్టేడియంలో అభిమానులను నియంత్రించేందు కు, వారికి భద్రత కల్పించేందుకు కృత్రిమ మేధ తో పనిచేసే కెమెరాలు ఉపయోగిస్తామని ఆర్సీబీ యాజమాన్యం తెలిపింది. నిరుడు జూన్ 4న తొక్కిసలాటలో 11మంది మరణించడంతో చి న్నస్వామి స్టేడియం మూతపడింది. భద్రతాపరమైనలోపాలు ఉన్నందున చిన్నస్వామిలో మ్యాచ్ల నిర్వహణకు కోర్టు ససేమిరా అంది. పోలీసులు కూడా నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. దాం తో.. అప్పటి నుంచి ఆమైదానంలో ఒక్క క్రికెట్ మ్యాచ్ కూడా జరగలేదు. ఇటీవలే విజయ్హజారే ట్రోఫీ మ్యాచ్లకు కూడా చిన్నస్వామి మైదానం నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ఈమధ్యే ఎన్నికైన వెంకటేశ్ ప్రసాద్ నేతృత్వంలోని కొత్త కార్యవర్గం పూర్వవైభవంపై దృష్టి సారించింది. ఈమేరకు ఆర్సీబీ యాజమాన్యంతో చర్చలు జరిపింది. చిన్నస్వామిలో భద్రతపై భరోసా కల్పించేందుకు అనువైన చర్యలను ప్రకటించింది. తొక్కిసలాట అనంతరం ‘ఖేల్ డీకున్హ కమిషన్’ కర్నాటక క్రికెట్ సంఘానికి కీలక సూచనలు చేసింది. అభిమానుల భద్రత కోసం తగిన ఏర్పాట్లు చేసిన తర్వాతే మ్యాచ్ల గురించి ఆలోచించాలని ఈ ఏకసభ్య కమిషన్ పేర్కొంది. దాంతో.. చిన్నస్వామి స్టేడియంలో



300 నుంచి 350 ఏఐతో పనిచేసే కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ సంఘం భావిస్తున్నాయి.

**4.5 కోట్లు ఖర్చుతో...**కృత్రిమ మేధతో పనిచేసే కెమెరాల సాయంతో పోలీసులు ప్రేక్షకుల మధ్య తోపులాట జరగకుండా చూస్తారు. అంతేకాదు స్టేడియంలోకి అభిమానులను అనుమతించేటప్పుడు, మ్యాచ్ అనంతరం బయటకు వెళ్లేటప్పుడు క్యూలో వెళ్లేలా చర్యలు తీసుకుంటారు. తద్వారా ఎవరికి ఎ లాంటి ఇబ్బంది, ప్రమాదం జరగకుండా చూసుకుంటామని ఆర్సీబీ, కేఎస్సీఏ అంటున్నాయి. అందుకని ఒక్కసారే స్టేడియమంతా రూ.4.5 కోట్లు ఖర్చుతో ఈ ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామని ఫ్రాంచైజీ వెల్లడించింది. ప్రస్తుతానికైతే చిన్నస్వామిలో ఐపిఎల్ మ్యాచ్లకు అనుమతులు లేవు. బిసిసిఐ నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తుందా? లేదా? అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది. ఒకవేళ ఆమోదం రాకుంటే బెంగళూరు బయట ఐపిఎల్ ఆడేందుకు ఆర్సీబీ సిద్ధమవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే పుణేలోని స్టేడియాన్ని ఫ్రాంచైజీ పరిశీలించింది. సో.. ఐపిఎల్ షెడ్యూల్ వచ్చాకే చిన్నస్వామిలో మ్యాచ్లు ఉంటాయా? ఉండవా? అనేది తెలియనుంది.

## టి–20ల్లో డేవిడ్ అరుదైన రికార్డు!




ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ వయసు పైబడుతున్నా కొద్దీ కుర్రాడిలా రెచ్చిపోతున్నాడు. 39 ఏళ్లలోనూ తనలో చేవ తగ్గలేదని నిరూపిస్తూ తన బ్రాండ్ క్రికెట్తో అభిమానులను అలరిస్తున్నాడు. రెండేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన వార్నర్.. ఫ్రాంచైజీ క్రికెట్లో సెంచరీలతో విరుచుకుపడుతున్నాడు. బిగ్బాష్ లీగ్లో విధ్వంసక శతకంతో రికార్డు నెలకొల్పాడు. పొట్టి ఫార్మాట్లో పదోసారి మూడంకెల స్కోర్ అందుకోవడంతో పాటు14 వేల పరుగుల మైలురాయిని అధిగమించాడీ చిచ్చరపిడుగు. ఫార్మాట్ ఏదైనా దూకుడే మంత్రంగా చెలరేగే డేవిడ్ వార్నర్ స్వదేశంలో జరుగుతున్న బిగ్బాష్ లీగ్లో సెంచరీలతో మెరుస్తున్నాడు. జనవరి 3వ తేదీన హోబర్ట్ హరికేన్స్ బౌలర్లను ఉతికేస్తూ 57 బంతుల్లోనే వంద కొట్టి.. 130 పరుగులతో అజేయంగా నిలిచాడీ మాజీ ప్లేయర్. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ టీ20ల్లో అతడికి 9వ సెంచరీ అది. తాజాగా సిడ్నీ సిక్సర్స్ బౌలర్ల భరతం పట్టిన అతడు.. 101 రన్స్తో జట్టును గెలిపించాడు. గత నాలుగు మ్యాచుల్లో వార్నర్ స్కోర్లు.. 110 నాటౌట్, 82, 67 నాటౌట్, 130 నాటౌట్.

**14 వేల క్లబ్‌లో.. ఆ ముగ్గురితో...**పొట్టి ఫార్మాట్లో వార్నర్ అరుదైన ఘనత సాధించాడు. సిడ్నీ సిక్సర్స్పై సెంచరీతో వీరవిహారం చేసిన అతడు అంతర్జాతీయ, ఫ్రాంచైజీ టీ20ల్లో 14 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా ఈ ఫీట్ నెలకొల్పిన నాలుగో బ్యాటర్గా అవతరించాడతడు. వార్నర్ కం ముందు వెస్టిండీస్ మాజీ ఓపెనర్ క్రిస్ గేల్, మాజీ ఆల్రౌండర్ కీరన్ పొలార్డ్, ఇంగ్లండ్ మాజీ ఓపెనర్ అలెక్స్ హేల్స్ ఈ మైలురాయికి చేరుకున్నారు. ప్రస్తుతం గేల్ 14,562 రన్స్తో అగ్రస్థానంలో ఉన్నాడు. పొలార్డ్ 14,462 పరుగులతో, అలెక్స్ 14,449 రన్స్తో రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నారు. వార్నర్ 14,028 రన్స్తో నాలుగో స్థానంలో నిలిచాడు.

**విజయంతో వీడ్కోలు...** రెండేళ్ల క్రితం సొంతగడ్డపై పాకిస్థాన్తో జరిగిన సిడ్నీ టెస్టుతో సుదీర్ఘ ఫార్మాట్కు వీడ్కోలు పలికాడు వార్నర్. అనంతరం భారత్లో వరల్డ్ కప్ ట్రోఫీ గెలుపొందాక వన్డేలకు వీడ్కోలు పలికేసిన డేవిడ్ భాయ్.. టీ20 వరల్డ్ కప్తో మూడు ఫార్మాట్ల నుంచి వైదొలిగాడు. తన సుదీర్ఘ కెరీర్లో బాదుడే పరమావధిగా అభిమానులను అలరించిన వార్నర్ పలు రికార్డులు తన పేరిట రాసుకున్నాడు.


## ఆర్‌సిబి ఖాతాలో మూడో విజయం..!

మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు హ్యాట్రిక్ కొట్టింది. ఉత్కంఠ పోరులో శ్రేయాంక పాటిల్(5–23) తిప్పేయగా గుజరాత్ జెయింట్స్ భారీ విజయం సాధించింది. హిట్టర్లతో నిండిన గుజరాత్‌ను 150కే ఆలౌట్ చేసింది ఆర్సీబీ. రాధా యాదవ్(66), రీచా ఘోష్(44) మెరుపులకు శ్రేయాంక స్పిన్ మ్యాజిక్ తోడవ్వగా.. మూడో విక్టరీతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది ఆర్సీబీ. తొలి పోరులో ముంబై ఇండియన్స్కు.. ఆపై యూపీ వారియర్స్కు చిత్తు చేసిన బెంగళూరు మూడో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ను మట్టికరిపించింది. పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ మిడిలార్డర్ పట్టుదలతో కోలుకుని గుజరాత్కు 182 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం శ్రేయాంక పాటిల్(523) విజృంభణతో ప్రత్యర్థిని 150కే ఆలౌట్ చేసి హ్యాట్రిక్ కొట్టింది. గుజరాత్ బ్యాటర్లలో భారతి ఫుల్మాలి 39 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచింది. డబ్ల్యూపీఎల్ 9వ మ్యాచులో ఆర్సీబీ మిడిలార్డర్ గొప్పగా ఆడింది. పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు పడినా రాధా యాదవ్(66), రీచా ఘోష్(44)లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వకుండా గొప్పగా ఆడారు. టాస్ ఓడిన బెంగళూరుకు శుభారంభం దక్కలేదు. కష్వీ గౌతమ్ చెలరేగడంతో డేంజరస్ ఓపెనర్ గ్రేస్ హ్యారిస్(17), దయలాన్ హేమలత(4) పెవిలియన్ చేరారు. కీలక ఇన్నింగ్స్ ఆడుదామనుకున్న కెప్టెన్ స్మృతి మంధాన(4) సైతం రేణుకా సింగ్ ఓవర్లో రాజేశ్వరికి క్యాచ్ ఇచ్చింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే.. గౌతమి నాయక్(4)ను సోఫీ డెవినె పెవిలియన్ పంపింది. దాంతో.. 45 పరుగులకే 4 వికెట్లు పడ్డాయి.

## సైన్స్

### ఖగోళ శాస్త్రంలో సరికొత్త

# విస్ఫోటన సిద్ధాంతం...



నక్షత్ర విస్ఫోటనానికి సంబంధించిన ‘సూపర్ నోవా’ అనే పదాన్ని తరచు వాడుతుంటారు. అయితే, ఇప్పుడు శాస్త్రవేత్తలు మరో కొత్త భౌతిక సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నారు. అదే ‘సూపర్‌కిలోనోవా’. ఇది అత్యం వేగంగా ఎదుగుతున్న అతి శక్తివంతమైన విస్ఫోటన సిద్ధాంతం. ఇటీవల, ఐఐటి బాంబే, ఐఐటి బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఎ) కు చెందిన శాస్త్రవేత్తలు కూడా సభ్యులుగా ఉన్న ఒక అంతర్జాతీయ పరిశోధక బృందం ‘సూపర్‌కిలోనోవా’ అనే అత్యంత అరుదైన, అపార శక్తివంతమైన ఖగోళ విస్ఫోటనం జరిగి ఉండొచ్చని నివేదించింది.ఇది ఇప్పటికీ పూర్తిగా నిర్ధారితమైన ఖగోళ సంఘటన కాదు. అయినప్పటికీ, బలమైన పరిశీలనా ఆధారాలపై ఆధారపడి ఎదుగుతున్న ఒక పరిశీలనాత్మక సిద్ధాంతంగా శాస్త్ర ప్రపంచంలో చర్చకు వస్తోంది. కిలోనోవా అనేది ఇప్పటికే శాస్త్రీయంగా స్థిరపడిన ఖగోళ సంఘటన. రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఒకదానితో ఒకటి ఢీకొని విలీనమయ్యేటప్పుడు ఈ సంఘటన జరుగుతుంది. ఈ విలీనంలో, బంగారం, ప్లాటినం, నియోడియమియం వంటి భారీ రేడియోధార్మిక మూలకాలు విపరీతంగా అంతరిక్షంలోకి విడుదలవుతాయి. ఈ మూలకాలు కాలక్రమంలో రేడియోధార్మిక విచ్ఛిన్నం చెందుతూ వెలుగు, ఇన్‌ఫ్రారెడ్ కాంతిని విడుదల చేస్తాయి. ఈకాంతి ఉద్గారాన్నే కిలోనోవా అంటారు. మనం భూమిపై మనం ఉపయోగించే బంగారం వంటి మూలకాలు కూడా ఇలాంటి న్యూట్రాన్ నక్షత్రాల విలీనాల ద్వారానే ఏర్పడతాయని ఆధునిక ఖగోళ శాస్త్రం చెబుతోంది. అయితే సూపర్‌కిలోనోవా అంటే ఏమిటి? అనేప్రశ్న ఇక్కడ ఉపయిస్తుంది. సూపర్‌కిలోనోవా అనేది సాధారణ కిలోనోవా కంటే ఒక స్థాయి ముందుకు వెళ్లిన భావన. ఇది రెండు దశలుగా జరుగుతుందని పరిశోధకులు సూచిస్తున్నారు. మొదటి దశ.. సూపర్ నోవా పేలుడు. ఒక భారీ నక్షత్రం సూపర్‌నోవాగా పేలినప్పుడు, ఒక్క న్యూట్రాన్ నక్షత్రం కాదు.. రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇక రెండో దశ న్యూట్రాన్ నక్షత్రాల విలీనం. కాలక్రమంలో ఈ రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఒకదానివైపు ఒకటి తిరుగుతూ దగ్గరవుతాయి చివరికి పరస్పరం విలీనమవుతాయి ఈ విలీనమే తర్వాత కిలోనోవా సంఘటనకు దారితీస్తుంది. అందుకే దీనికి సూపర్‌కిలోనోవా అనే పేరు. కాగా, సూపర్‌కిలోనోవాలో అటు సూపర్ నోవా పేలుడి లక్షణాలు.. ఇటు, కిలోనోవా ఉద్గార లక్షణాలు.. రెండూ కలసి కనిపిస్తాయి. అందువల్ల ఇది, సాధారణ కిలోనోవాకంటే ఎక్కువ శక్తివంతమైనది. ఎక్కువ ప్రకాశవంతంగా, ఎక్కువ కాలం గమనించదగినదిగా ఉంటుంది. శాస్త్రవేత్తల అంచనాలను అనుసరించి, సూపర్‌కిలోనోవా నిజంగా జరిగితే, అదిఐ అత్యంత తీవ్రమైన గ్రావిటేషనల్ వేవ్స్ (అంతరిక్ష–కాల వంకరలు), అతి శక్తివంతమైన ఎలక్ట్రోమాగ్నెటిక్ పేలుళ్లను విడుదల చేస్తుంది. ఇవి సాధారణ కిలోనోవాల కంటే, ఎక్కువ ప్రకాశవంతంగా ఎక్కువ శక్తి విడుదల చేస్తూ, ఎక్కువ సమయం కనిపించేలా ఉంటాయి. అయితే, సూపర్‌కిలోనోవాలు ఇప్పటికీ, పూర్తిగా స్థిరపడిన ఖగోళ సంఘటనలుగా అధికారికంగా ఇంకా గుర్తించబడలేదు. అవి ఇప్పటికీ పరిశీలనల ఆధారంగా ఎదుగుతున్న లేదా నిర్ధారణ దశలో ఉన్న ఖగోళ సంఘటనల వర్గానికి చెందుతాయి. అంటే, ఇది ఖచ్చితంగా ఉందే అని చెప్పడానికి ఇంకా ఎక్కువ డేటా, మరిన్ని పరిశీలనలు అవసరం. సూటిగా చెప్పాలంటే కిలోనోవా అనేది ఇప్పటికే స్థిరపడిన ఖగోళ సంఘటన. సూపర్‌కిలోనోవా: బలమైన ఆధారాలు ఉన్నప్పటికీ, ఇంకా నిర్ధారణ దశలో ఉన్న అత్యంత శక్తివంతమైన విస్ఫోటనం. సూపర్‌కిలోనోవా నిజమని పూర్తిగా నిర్ధారితమైతే, నక్షత్రాల జననం, భారీ మూలకాల ఉత్పత్తి, గ్రావిటేషనల్ వేవ్స్ యొక్క మూలాలు తదితర అంశాలపై మరింత లోతైన, సమగ్రమైన విశ్లేషణకు అవకాశం ఏర్పడుతుంది. ఇది ఖగోళ శాస్త్రంలో కొత్త అధ్యాయానికి దారితీసే అవకాశం ఉన్న భావన.

## భూమి లోతుల్లో ‘బ్లోబ్స్’



ఆఫ్రికా, పసిఫిక్ మహా సముద్రాల కింది భాగంలో, భూమి లోతుల్లో.. దాదాపు మధ్యభాగానికి సమీపంలో రెండు మహా విస్తృత, దట్టమైన నిర్మాణాలు శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిని ‘బ్లోబ్స్’ అని పిలుస్తారు. పరిణామం పరంగా ఇవి చాలా దేశాలకంటే పెద్దవి. అత్యంత వేడితో ఉండే బ్లోబ్స్ ఎలా ఏర్పడ్డాయనే ప్రశ్నకు సరైన సమాధానం లేదు. తాజా పరిశోధనలను అనుసరించి, ఇవి భూమి ప్రారంభ దశలో మాగ్మా ఓషన్ దశలో ఏర్పడిన పురాతన రాళ్లు లేదా కోర్ నుండి లీకైన పదార్థాలు లేదా క్రస్టు భాగాలు. కొన్ని పరిశోధనల ప్రకారం, ఇవి ఒక ప్రాచీన గ్రహం ‘థియా’ భూమిని ఢీకొన్నపుడు ఏర్పడ్డ మిశ్రమ పదార్థాలు కావొచ్చు. ఇవి బహుశా 4.5 బిలియన్ సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నాయని అంచనా. భూ భ్రమణం, పరిభ్రమణం ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. అదే విధంగా భూమి అటూఇటూ ఊగకుండా, స్థిరంగా ఉంచడంలో తోడ్పడుతున్నాయి. ఇవి భూమిలోని వేడి, ఖనిజాలు ఉపరితలానికి చేరే మార్గాన్ని ప్రభావితం చేస్తున్నాయి. దీనివల్ల అగ్ని పర్వత దీవులు ఏర్పడ్డాయి. బ్లోబ్స్ ద్వారా కార్బన్, హైడ్రోజన్ వంటి మూలకాలు అధికంగా భూ ఉపరితలం వైపు ప్రవహించాయి. ఇది మిగిలిన జీవపరేణు, వాతావరణ, సముద్రం కొన్నాళ్లు ఏర్పడడంలో కీలక పాత్ర పోషించింది. భూమిలో వాతావరణ మార్పులు, జీవవైవిధ్యం, కాంతి విడుదల, మొదలైనవాటిపై గణనీయ ప్రభావాన్ని చూపాయి. ఇలా జీవం ఆవిర్భావానికి అవసరమైన ఘటి, వేడి, మూలకాలు అందించడంలో వీటి పాత్ర ఉందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ బ్లోబ్స్ భూమి మొదటి రోజుల్లో నుంచి ఎలా మార్పులకు గురయ్యాయో, ఎందుకు భూమి జీవానికి మరింత అనుకూలంగా తయారైందో తెలుసుకోవడానికి ఈ బ్లోబ్స్ అధ్యయనం ఉపయోగపడుతుంది. ఇవే సిద్ధాంతాలను, అధ్యయనాలను శుక్రుడు, శని, అంగారకుడు వంటి గ్రహాలకు కూడా వర్తించే అవకాశం ఉందని అంటున్నారు.

## శతాబ్ది సభకు తరలిరండి

### ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ప్రధానకార్యదర్శి లతాదేవి పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 18న ఖమ్మంలో జరిగే బహిరంగసభకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని భారత మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి విజ్ఞప్తి చేశారు. మహిళా సమాఖ్య జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మహిళల హక్కుల కోసం నికరంగా నిలబడి పోరాడింది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. నాటి సతీసహగమన దురాచారం నుండి ఇప్పటి వేధింపుల వరకు మహిళల పక్షాన నిలబడిన మహిళలకు కమ్యూనిస్టులు రక్షణగా నిలిచారన్నారు. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని మహిళల వేధింపులకు వినియోగించడం శోచనీయమన్నారు. మహిళా ఐక్య పోరాటాల అవసరం మరింతగా పెరిగిందని లతాదేవి తెలిపారు. 18న ఖమ్మంలో జరిగే ప్రదర్శన బహిరంగ సభలో మహిళలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో సిహెచ్ సీతామహాలక్ష్మి, మందడపు రాణి, బత్తినేని నీరజ, పోటు మమత, ఓరుగంటి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాల చరిత్ర సిపిఐది

### పార్టీ సీనీయర్ నాయకుడు ఆందోజు రవీంద్రాచారి




**ప్రజాపక్షం/రంగారెడ్డి/అబ్దుల్లాపూర్‌మెట్:** నాటినుంచి నేటి వరకు పోరాటాల చరిత్ర సిపిఐ దని పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. శుక్రవారం రావినారాయణరెడ్డి కాలనీ, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో రవీంద్రాచారి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డిలతో కలసి మాట్లాడారు. పేదల సమస్యలు, ఇండ్లు, ఇండ్లస్థలాలు, సాగుభూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నడుపుతున్న సిపిఐ అన్నారు. రంగారెడ్డి జిల్లాలో సొంత ఇల్లు లేని నిరుపేదల కోసం భూపోరాటాలు నిర్వహించి వేలాది మంది నిరుపేదలకు నీడ కల్పించిన ఘనత సిపిఐకి దక్కుతుందన్నారు. నాటినుండి నేటి వరకు కార్మికులు కర్షకులు నిరుపేదలు బడుగు బలహీన వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి సిపిఐ కృషిచేసిందన్నారు. పోరాటాలు, ఉద్యమాల జరిత్ర కలిగిన సిపిఐ వంద సంవత్సరాలు ముగింపు ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో ఈనెల 18న జరిగే భారీ బహిరంగసభకు రంగారెడ్డి జిల్లా నుంచి సిపిఐ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తరలిరావాలని రవీంద్రాచారి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండలకార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మండల కౌన్సిల్ సభ్యులు సైదులు, సుధాకర్ పాల్గొన్నారు.

## తండోపతండాలుగా ఖమ్మం సభకు..

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు పిలుపు




**ప్రజాపక్షం/హనుమకొండ :** సిపిఐ శతవార్షికోత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరుగనున్న భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ,వరంగల్ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈనెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొంటారని తెలిపారు. పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ తప్పా మరెవరు న్యాయం చేయలేరని, భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) పుట్టి వంద సంవత్సరాల చరిత్రలో పేద ప్రజలకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల సమస్యలు, ముఖ్యంగా ఇండ్లు, ఇండ్లస్థలాలు, సాగుభూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నడుపుతున్న భారత కమ్యూనిస్టుపార్టీ అన్నారు. వందేళ్ల ప్రస్థానంతో ముందుకు సాగుతూ నాడు స్వాతంత్రోద్యమం నుంచి నేటి వరకు ప్రజల కోసం ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ వంద సంవత్సరాలు ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణమన్నారు.40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని, దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి సిపిఐ ప్రతినిధులు, శ్రేణులు తరలివస్తున్న ఈ భారీ బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు, అభిమానులు, సానుభూతి పరులు, కార్యకర్తలు పెద్దఎత్తున కదలివచ్చి బహిరంగసభను విజయవంతం చేయాలని తక్కళ్లపల్లి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ భాష్ మియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్ జ్యోతి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, వరంగల్ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లేదేళ్ల శరత్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాలకు వెరవకుండా ప్రజల పక్షాన

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ కోరారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లోని సిపిఐ కార్యాలయంలో శాఖ కార్యదర్శి పూజారి రామన్న అధ్యక్షతన జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రాంతంలో సింగరేణి కార్మికులు, ప్రజల హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర తమ పార్టీకి ఉందని గుర్తు చేశారు. ప్రాణత్యాగాలకు వెరవకుండా ప్రజల పక్షాన నిలిచిన నాయకులను మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. సమావేశంలో మేకల దాసు, బొడ్డు లచ్చన్న, కొత్తపల్లి మహేష్, మూడ సుధాకర్, కూన సాయి, కిరణ్, నూకల రాజయ్య, అంజయ్య, మాశం నవీన్, రాజేష్, సంపత్ పాల్గొన్నారు.




## నేటి యువత ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

### సిపిఐ శతాబ్ది ఉత్సవాల క్రీడల ముగింపు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాలలో నిర్వహించిన గ్రామీణ క్రీడోత్సవాల ముగింపు సభకు హాజరై విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పశ్య పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరి నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన క్రీడల ముగింపు సభలో రూరల్ సిఐ సర్వయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి, నెల్లూరి శ్రీనివాసరావుతో కలిసి పశ్య పద్మ మాట్లాడారు. యువకులు ప్రశ్నించే తత్వాన్ని ఎంచుకున్నప్పుడే దేశానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. యువకులు క్రీడల్లో పాల్గొనడం వల్ల వారి మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి తోడ్పడుతుందన్నారు. నేటి యువత చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బలపాల గ్రామం ఎంతో చైతన్యవంతమైన గ్రామమని, ఇక్కడ రాజకీయాలు పక్కనపెట్టి క్రీడలను సమర్థంగా నిర్వహించారని నిర్వాహకులను అభినందించారు. అనంతరం కబడ్డీ, షటిల్, ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్, బలపాల సర్పంచ్ బాదావత్ బిక్కు నాయక్, నామ సైదులు, బత్తుల వెంకన్న, కోటయ్య, అంబటి వెంకటనారాయణ, లింగయ్య తండా సర్పంచ్ హరిలాల్, రొయ్యల నాగేశ్వరరావు, సిపిఐ గ్రామ కార్యదర్శి రామగాని రవి, సిపిఐ మండల నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, కన్నాజు వెంకట నారాయణ, సిపిఐ తొమ్మిదో వార్డు మెంబర్ రన్వాల్ రమేష్, రొయ్యల సూరి, రేపాకుల పాపయ్య, బొల్ల వీరన్న తదితరులు పాల్గొన్నారు.




### హక్కుల కోసం

## పోరాడేది కమ్యూనిస్టులే



### సిపిఐ జాతీయ నేత ప్రకాష్‌బాబు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కార్మిక హక్కులు, సంక్షేమంకోసం పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాష్‌బాబు తెలిపారు. శుక్రవారం శ్రీశ్రీ సెంటర్‌లో శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ ప్రచారంలో భాగంగా ఆటో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌బాబు మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల శ్రమకు తగిన వేతనం లభించడం లేదన్నారు. శ్రమకు తగిన విధంగా వేతనం లభించే చర్యలు తీసుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ప్రకాష్‌బాబు ఆరోపించారు. మోదీ తెచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని భవిష్యత్తులో కార్మిక వర్గం మరిన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని, యావత్ కార్మికలోకం భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధులు కావాలన్నారు. ఆటో ర్యాలీ నగరంలోని అన్ని ప్రధాన వీధుల్లో సాగింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు, సిపిఐ హవేలి ఏరియా కార్యదర్శి ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పి.మోహన్ రావు, శ్రీనివాసరావు, జాకీర్, ఆముదాల వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు నిబంధనలు పాటించండి.. సురక్షితంగా గమ్యం చేరండి

ఎసిపి లక్ష్మీనారాయణ

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణికులు గమ్యం చేరేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ప్రయాణికుడు విధిగా రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారు నడిపించే వారు విధిగా సీట్ బెల్టు పెట్టుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రయాణికులు అధిక స్పీడ్‌తో వెళ్ళకుండా సురక్షితంగా గమ్యం చేరాలన్నదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపిస్తే వారి లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు తగిన జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, స్కూల్, ప్రార్థన మందిరాల వద్ద వాహనాలను తగిన స్పీడ్‌లో నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ సిఐ విజయ్‌కుమార్, ఎంవిఐ వాసు, ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్, సర్పంచ్ వాకిటి నవకిరణ్ బుడ్డ నరసింహా, ఉప సర్పంచ్ అభినవ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



## పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులందరూ కృషి చేయాలని కేశంపేట ఎంపిడివో రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామంలో సర్పంచ్ ఎదిరె నాగేశ్వర్‌తో కలిసి నర్సరీలో నిర్వహిస్తున్న పనులను, చెత్త డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తలతో అనేక ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. తడి చెత్త ద్వారా ఎరువులను తయారు చేసుకునేందుకు గ్రామస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా ఎరువులను కొనుగోలు చేయకుండా వ్యర్థ చెత్తతోనే ఎరువులను తయారుచేసి నర్సరీ మొక్కలను వేయాలని సిబ్బందికి సూచించారు. నర్సరీలో కూలీలు, సిబ్బంది చేస్తున్న పనులపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మరి నర్సింహా, బండ జగదీశ్వర్‌రెడ్డి, ఎదిరె శ్రీను, మహేష్, బడక శివశంకర్, శ్రీకాంత్, కొమురయ్యలు పాల్గొన్నారు.



## సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషించాలి

ఎలికట్ట సర్పంచ్ వాకిటి నవకిరణ్ నరసింహా ముదిరాజ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషించేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎలికట్ట సర్పంచ్ వాకిటి నవకిరణ్ నరసింహా ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో సర్పంచ్ వాకిటి నవకిరణ్ ఆధ్వర్యంలో మాజీ ఆర్మీ శేరి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొని వాటి విశిష్టతను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులు చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయని వివరించారు. ఇలాంటి పోటీల్లో మహిళలు పాల్గొంటే ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. మొదటి బహుమతి సుమతి, ద్వితీయ బహుమతి శృతి, తృతీయ బహుమతి అంబటి సువర్ణలకు అందించారు. అదే విధంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 71 మంది మహిళలకు సైతం బహుమతులు పంపిణీ చేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి ఆజాం చిన్నారులకు ఉచితంగా గాలిపటాలను అందించారు.

## పండుగ పూట తెరుచుకోని చౌక దుకాణాలు

ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** పండుగ పూట పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న చౌక దుకాణాల రేషన్ బియ్యంతోనే కాలం వెళ్లదిస్తున్న కాలనీ పేద ప్రజలకు గత రెండు వరాల నుంచి దుకాణాలు తెరవకపోవండంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ డీలర్ల నిర్లక్ష్యం వలన ప్రజలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందని హస్తినాపురం డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు అందోజు సత్యం చారి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం నెల మొదటి వారం నుంచి దాదాపు 15 రోజుల వరకు చౌక దుకాణాలు తెరిచి ఉండకుండా రెండు రోజులు తెరిచి మూయడంతో నిరుపేద ప్రజలు తీవ్ర ఇబ్బదులు ఎదుకుంటున్నారని ఆయన విమర్శించారు. పేద ప్రజల పట్ల అలసత్వం వహిస్తున్న డీలర్ల పై ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజలకు అందిల్సిన చౌక దుకాణాల నుంచి వచ్చే బియ్యంను నేరుగా ప్రజలకు అందే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, అధికారుల పర్యవేక్షణ ఉండాలని ఆయన తెలిపారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యంను నేరుగా అర్హులైన వారికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. తక్షణమే జిల్లా యంత్రాగం పర్యవేక్షించి పేదలకు న్యాయం చేయాలని కోరారు.

# రేపు సికింద్రాబాద్‌లో 'లోహ్రీ మేళా' వేడుక



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పంజాబ్ రాష్ట్రంతో పాటు ఉత్తర భారత్‌లోని అత్యంత ప్రజాదరణ పొందిన పండుగలలో ఒకటైన 'లోహ్రీ' వేడుకలను ఈ నెల 18న 'లోహ్రీ మేళా' పేరిట హైదరాబాద్ సికింద్రాబాద్‌లోని టీవోలీ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు పంజాబీ సేవా సమితి అధ్యక్షులు దీపక్ కుమార్ జైరథ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రమేశ్ పస్సి, పూర్వ అధ్యక్షులు ప్రదీప్ లుంబాతో కలిసి ఆయన 'లోహ్రీ మేళా' పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. శీతాకాలం చివరిలో రబీ పంటల కోతను సూచించే సమయంలో, మంచి అదృష్టాన్ని స్వాగతించడానికి పంజాబీ కుటుంబాలు లోహ్రీ పండుగను జరుపుకుంటారన్నారు. ఆవు పేడతో లోహ్రీ దేవతను తయారుచేసి, పూజించి కట్టెలు కాల్చి, మంట చుట్టూ పాటలు పాడుతూ నృత్యం చేస్తూ నువ్వులు, బెల్లం, రేవడీలను వేస్తూ శ్రేయస్సు కోసం ప్రార్థిస్తూ స్నేహితులు, కుటుంబసభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటారని తెలిపారు. పంజాబీ సంప్రదాయం, గొప్ప వారసత్వాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఏటా లోహ్రీ వేడుకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ముఖ్యఅతిథిగా హాజరై, వేడుకలను ప్రారంభిస్తారనిపేర్కొన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు జగన్మోహన్ స్ఛదేవ, అనూప్ ఫొక్కే, కార్యదర్శి రాజ్‌కుమార్ గణోత్ర, సంయక్త కార్యదర్శి అమిత్ ఖర్బందా, కోశాధికారి యోగేశ్ సర్వాల్ , సభ్యులు రమేశ్ తనేజా, నితిన్ టాండన్, జైపాల్ ఖురానా తదితరులు పాల్గొన్నారు.

'మహా' మున్సిపల్ ఎన్నికల్లో...

# బిజెపి-శివసేన మహాయుతి విజయఢంకా

**ముంబయి:** మహారాష్ట్రలో జరిగిన తాజా మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో బిజెపి బలీయమైన శక్తిగా ఆవిర్భవించే దిశగా దూసుకు వెళ్తోంది. బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమి కడపటి ఫలితాలు అందేవరకూ చూస్తే భారీ విజయాన్నే నమోదు చేసింది. మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు గాను దాదాపు 20 మున్సిపల్ కార్పొరేషన్లలో బిజెపి నేతృత్వంలోని మహాయుతి తిరుగులేని ఆధిక్యతను కనబరుస్తోంది. ముంబయి సహా పుణే, పింప్రీచించువాడ్, కళ్యాణ్‌డోంబివలి, నాసిక్, థాణే, నవీ ముంబయిలలో భారీ విజయాధిక్యతను మహాయుతి కైవసం చేసుకుంది.

తాజాగా జరిగిన ఎన్నికలలో మహారాష్ట్రకు ఆయువుపట్టు అయిన ముంబయి మహానగరంలోని బృహన్ ముంబ యి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఫలితాల సరళిచూస్తే ... ఉద్ధవ్ థాకరేకు ఆయన సోదరుడు రాజ్ థాకరే అండగా నిలిచినప్పటికీ ఫలితాల సాధనలో విజయాన్ని అందుకోవడంలో యుబిటి చతికిలపడింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన బిఎంసి ఎన్నికల ఫలితాలలో భాజపాశివసేన కూటమి విజయ దుందుభి మోగిస్తూ రాజకీయ ఉద్దండ పండితులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బిఎంసిలోని 227వార్డులలో బిజెపిశివసేనలతో కూడిన మహాయుతి కూటమి 116వార్డుల్లో ఆధిక్యంతో ముందంజలో ఉండి దూసుకు వెళ్తోంది. 114 మెజార్టీ మార్క్‌కు గాను బిజెపి సొంతంగా 84 స్థానాలను ఇప్పటికే సాధించగా, 110 స్థానాలలో పోటీచేసిన ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు చెందిన శివసేన 26స్థానాలలో ఆధిక్యం కనబర్చింది. దీంతో 110 స్థానాలలో ఆధిక్యతకు చేరుకుంటుంది. బిజెపి రాష్ట్ర స్థాయి భాగస్వామి షిండే శివసేన 2 వార్డులను కలిగి ఉంది. వీటన్నింటినీ కలిపితే 112కు చేరుకున్నా 114 మార్క్ రెండు స్థానాలు తక్కువలో ఉన్నది. కాగా యుబిటి 72వార్డుల్లో, రాజ్‌థాకరేకు చెందిన ఎంఎన్‌ఎస్ పార్టీ 10 వార్డులు కలిపి 82 స్థానాల ఆధిక్యతను కైవసం చేసుకోగా కాంగ్రెస్ 23 స్థానాలలో ఆధిక్యం సాధించగా ఇవన్నీ కలిపితే 105కే పరిమితం అవుతోంది. అయితే ఇవన్నీ కలిసినా మెజారిటీ మార్క్‌కు ఇప్పటివరకూ యుబిటి చేరువలో లేదు. రాత్రి 925గంటల సమయానికి మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పార్టీల వారీగా చూసే మొత్తం 2,869 వార్డులకు గాను 2,806 వార్డుల ఫలితాలకు సంబంధించిన సరళి వివిధ రాజకీయ పార్టీల ఆధిక్యత ఈ విధంగా ఉంది.

బిజెపి 1,422, శివసేన 366, కాంగ్రెస్ 318, ఎస్‌ఎస్‌యుబిటి 161, ఎన్‌సిపిఎపి 159, ఎఐఎంఐఎం 94, ఎన్‌సిపిఎస్‌పి 29, ఎంఎన్‌ఎస్ 17, విబిఎ 15, ఇతరులు 225స్థానాలలో ఆధిక్యంలో ఉన్నారు.

**బిజెపి సుపరిపాలనకు మహారాష్ట్ర ప్రజలు 'పెద్ద విజయం' కానుక : ప్రధాని మోదీ**

ఎంతో శక్తివంతమైన మహారాష్ట్ర ప్రజలు ఎన్‌డిఎ ఎజెండా అయిన ప్రజానుకూల సుపరిపాలనకు తాజా ఎన్నికలలో పట్టం కట్టారని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమం, సుపరిపాలన ఎజెండా కలిగిన ఎన్‌డిఎను ప్రజలు ఆశీర్వదించినందుకు 'థ్యాంక్యూ మహారాష్ట్ర' అంటూ ప్రధానమంత్రి మోదీ సంతోషం వ్యక్తంచేశారు. గొప్ప విజన్‌తో కూడిన మా పరిపాలన సామర్థ్యం, అభివృద్ధి ప్రజల హృదయాలను తాకిందని అన్నారు.



## 'ప్రజా పాలన' కాదు.. జేబులు కత్తిరించే దోపిడీ పాలన

టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల్ల కిషోర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ట్రాఫిక్ ఛలాన్‌లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజావ్యతిరేకమని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. యూసుఫ్‌గూడలో జరిగిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో సిఎం చేసిన వ్యాఖ్యలపై ఖండించారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో నగర పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, నాగు నగేష్ మాట్లాడుతూ ఇకపై ట్రాఫిక్ ఛలాన్‌లపై ఎలాంటి రాయితీలు ఉండవని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహన యజమాని బ్యాంకు ఖాతా నుంచి నేరుగా జరిమానా కట్ చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పార్కింగ్ సౌకర్యాలు 20 శాతం కూడా లేవని, ముందుగా మౌలిక వసతులు కల్పించకుండా ఛలాన్‌లు వేయడం అన్యాయమని అన్నారు. గుంతల రోడ్‌లను సరిచేయకుండా ప్రమాదాలకు వాహనదారులనే బాధ్యులను చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. బ్యాంకు ఖాతాల నుంచి నేరుగా డబ్బులు కట్ చేయడం ద్వారా ఛలాన్‌లను కోర్టులో సవాలు చేసే హక్కును హరించారని హెచ్చరించారు. నిర్ణయాలు వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పరశురాం, ప్రకాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతోనే యువత అన్ని రంగాల్లో రాణిస్తారు

సర్పంచ్ పర్వేద నర్సింలు

**ప్రజాపక్షం/షాబాద్:** క్రీడలతోనే యువత అన్ని రంగాల్లో రాణిస్తారని మిద్దెంగూడ సర్పంచ్ పర్వేద నర్సింలు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని మిద్దెంగూడ గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా దివంగత నేత పట్నం రాజేందరెడ్డి యూత్ సభ్యులు, పట్నం అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

గ్రామంలో 5 టీంలుగా ఏర్పడి పోటీలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలో పిఆర్ఆర్ యూత్ టీంకు మొదటి బహుమతి 8 వేలు నగదు రివార్డు అందుకున్నారు. రెండవ బహుమతి రన్నర్ టీంకు రూ.4వేల రూపాయలు సర్పంచ్ పర్వేద నర్సింలు, మాజీ సర్పంచ్ సుదర్శన్, మాజీ ఎంపిపి వెంకటయ్య కుర్మ సంఘం అధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డిల తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పర్వేద నర్సింలు మాట్లాడుతూ.. యువత తలుచుకుంటే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. గ్రామంలోని యువకులంతా ఐక్యతతో ఉండాలని క్రీడ ఉత్సవాలు నిర్వహించిన్నట్లు వివరించారు. మిద్దెంగూడ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పెద్దలందరి సహాయసహకారలతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పురుషోతం, లింగం, పాపిరెడ్డి, శేఖర్, రఘునందన్ గుప్త, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా దర్గాను అభివృద్ధి చేస్తాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రణాళిక బద్ధం గా దర్గాను అభివృద్ధి చేసేందుకు చర్య లు తీసుకుంటున్నామని, ఇందుకు వ్యాపారస్తులు, ప్రజలందరు సహకరించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ పంచాయతీ పరిధిలో ఉన్న జహంగీర్ ఫీర్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో మొదటి రోజు గంధోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు వక్ఫ్ బోర్డు చైర్మెన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌లు బాబాకు ఛాదర్ సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడు తూ దర్గా మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేశామని, మున్ముందు మరెన్నో పనులు చేసేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. దర్గా పవిత్రత అందరికి తెలుసని, భక్తుల పాలిటి కోరిన కొరికలు తీర్చుతు కొంగుబంగారంగా నిలుస్తున్నారని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్య వైఖరీ కారణంగానే దర్గా అభివృద్ధికి నోచుకోకుండా పోయిందని, దర్గాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

సుమారు 15కోట్ల వరకు నిధులు మంజూరు చేయించడం జరిగిందని, దర్గాకు అభివృద్ధికమిటి ఏర్పాటు చేసి వచ్చిన నిధులతో అభివృద్ధి చేస్తామని వివరించారు. దర్గాకు వచ్చే భక్తులకు అన్ని రకాల మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా పని చేసి అభివృద్ధిని ప్రగతి పతంలో నడిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కె ట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మండల అధ్యక్షుడు జంగ నర్సింలు, మాజీ వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, ఖదీర్, ముబారక్, కొత్తూరు సిఐ నర్సయ్యలు ఉన్నారు.

**దర్గా ఉర్సు ఉత్సవాల్లో భారీ బందోబస్తు**
**కొత్తూరు సిఐ నర్సయ్య**

దర్గా ఉర్సు ఉత్సవాల్లో పోలీస్ శాఖ తరుపున భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సిఐ నర్సయ్య తెలిపారు. దర్గా ఉర్సు ఉత్సవాల నేపథ్యంల వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



## సిఆర్‌పిఎఫ్‌లో ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

**ప్రజాపక్షం/కేశంపేట:** నిరుపేద కుటుంబానికి చెందిన రావిచేడు రాములమ్మ సత్తయ గౌడ్‌ల కుమారుడు మణికంఠ గౌడ్ సిఆర్‌ఫిఎఫ్‌లో ఉద్యోగం సాధించిన నేపథ్యంలో తొమ్మిదిరేకుల గ్రామస్తులు శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ యువకులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మాట నిలబెట్టుకున్న మణికంఠ గౌడ్‌ను ప్రతి ఒక్కరు గ్రామంలో ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచిని స్వాగతించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పంది రాంరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, వార్డు సభ్యులు మల్లేష్, కల్వకోలు తిరుపతి, గోష్క నరసింహులు, పురుషోత్తం గౌడ్, తాండూరు మల్లేష్‌లు పాల్గొన్నారు.



## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**ప్రజాపక్షం/కేశంపేట:** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయని మండల సమన్వయ కమిటీ సభ్యులు బీస కరుణాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తొమ్మిదిరేకుల ప్రీమియర్ లీగ్ సీజన్3 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీస కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, మానసి క ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత ఎంచుకున్న క్రీడా రంగాల్లో రాణించి భవిష్యత్‌ను బంగారు మయం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానం గా భావిస్తూ ముందుకు సాగితేనే భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఈ పోటీలో మొదటి బహుమతి అమిగోస్ టీంకు రూ.20వేలు సర్పంచ్ బీస కవిత కరుణాకర్‌రెడ్డి అందించగా, రెండవ బహుమతి ఇలేట్ ఈగల్ టీంకు రూ.15వేలు ఉప సర్పంచ్ వుడ్యావత్ రవినాయక్, గ్రౌండ్ నిర్వహణకు రూ.10వేలు ఎనుక శ్రీకాంత్‌రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోగుల భీమయ్య, చిట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, గుత్తి శేఖర్, కల్వకోలు నిరంజన్, లాలమోని చంద్రయ్య, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ కృష్ణ గౌడ్, వార్డు సభ్యులు పోగుల నరేష్, పోగుల నర్సింలు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## సంస్కృతి, సాంప్రదాయాలను చిన్నారులకు తెలియజేయాలి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పండుగల విశిష్టత, తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను చిన్నారులకు తెలియజేసేందు కు ప్రతి ఒక్కరు కృషి చేయాలని 18వ వార్డు అభివృద్ధి కమిటి చైర్మెన్ జమాల్‌పూర్ చందూలాల్ అన్నారు. శుక్రవారం సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని చిన్నారులకు రంగుల పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందూలాల్ మాట్లాడుతూ చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు చూడాన్నదే లక్ష్యంగా ఉచితంగా పతంగులను పంపిణీ చేసినట్లు వివరించారు. పండుగల విశిష్టత చిన్నారులకు తెలియజేసేందుకు పెద్దలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతై నా ఉందని అన్నారు. ఏ పండుగ వచ్చినా వాటి విశిష్టత వివరిస్తే వాటి మనుగడను కాపాడిన వాళ్ళం అవుతామని పేర్కొన్నారు. బోగీ, సంక్రాం తి, కనుము పండుగను కాలనీల్లో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇళ్లముందు రంగవల్లులు వేయడంతోపాటు కుటుంబ సభ్యులతో అనందోత్సవాల మధ్య సంక్రాంతి పర్వదిన వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసు లు చౌలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మర్కాపురం మురళి, మణికొండ సాయిరాం, అనిల్‌కుమార్, శివాచారి, ప్రశాంత్, దుర్గేష్, వేణులు పాల్గొన్నారు.

ఉగాండా అధ్యక్ష ఎన్నికలు..

# తొలి ఫలితాల్లో ముసేవెనీ భారీ ఆధిక్యం




**కంపాలా :** ఉగాండాలో గురువారం జరిగిన అధ్యక్ష ఎన్నికల తొలి ఫలితాల్లో ప్రస్తుత అధ్యక్షుడు యోవెరి ముసేవెనీ భారీ ఆధిక్యంతో ముందంజలో ఉన్నారని ఎన్నికల కమిషన్ తెలిపింది. శుక్రవారం ఉదయం ప్రకటించిన గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా 45 శాతం పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన ఫలితాల్లో ముసేవెనీకి 76 శాతం ఓట్లు లభించాయి. ప్రధాన ప్రతిపక్ష నేత బోబి వైన్‌కు సుమారు 20 శాతం ఓట్లు దక్కాయి. 1986 నుంచి అధికారంలో ఉన్న 81 ఏళ్ల ముసేవెనీ ఏడోసారి అధ్యక్ష పదవిని దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఉద్రిక్త వాతావరణంలో జరిగిన ఈ ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. 43 ఏళ్ల పాప్ గాయకుడు నుంచి రాజకీయ నేతగా మారిన బోబి వైన్ ఎన్నికల్లో భారీ మోసం జరిగిందని ఆరోపించారు. అయితే దీనికి సంబంధించి ఆధారాలు సమర్పించలేదని, అధికార యంత్రాంగం ఇప్పటివరకు స్పందించలేదని తెలుస్తోంది. ఇంటర్నెట్ బ్లాక్అవుట్ మధ్య జరిగిన పోలింగ్‌లో అనేక ప్రాంతాల్లో బ్యాలెట్ బాక్సులు ఆలస్యంగా చేరడం, ఓటర్ల గుర్తింపు కోసం ఉపయోగించే బయోమెట్రిక్ యంత్రాలు సరిగా పనిచేయకపోవడంతో గంటల తరబడి ఆలస్యం జరిగింది. ఈ సమస్యలకు నెట్‌వర్క్ నిలిపివేత కారణమని కొందరు అనుమానిస్తున్నారు. కాగా, గురువారం రాత్రి, బోబి వైన్ ఇంటిని భద్రతా బలగాలు చుట్టుముట్టి ఆయన్ను, ఆయన భార్యను గృహ నిర్బంధంలో ఉంచినట్లు ఆయన పార్టీ నేషనల్ యూనిటీ ప్లాట్‌ఫామ్ ఆరోపించింది. దీనిపై అధికారులు ఇంకా స్పందించలేదు. 2021 ఎన్నికల తర్వాత కూడా వైన్‌ను కొన్ని రోజులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఆరుగురు అభ్యర్థులు ఉన్నప్పటికీ, ప్రధానంగా ముసేవెనీ–వైన్ మధ్యనే పోటీ కొనసాగుతోంది.

గత ఆరు ఎన్నికల్లో ముసేవెనీ విజయం సాధించిన నేపథ్యంలో, ఈసారి కూడా ఆయన అధికార కాలాన్ని మరింత పొడిగించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# చెరువుల రక్షణకు సర్కార్ కీలక నిర్ణయం

భూములు కోల్పోయే వారికి
భారీగా టిడిఆర్‌లు
ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌ల
భూముల అప్పగింతకు..
200 శాతం నుంచి 400 శాతం వరకు
అభివృద్ధి హక్కులు
ఇక నుంచి 10 అంతస్తులపైన నిర్మించే..
భవనాలకు 10 శాతం
టిడిఆర్ వినియోగించాల్సిందే



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని జలవనరులను ఆక్రమణల నుండి కాపాడేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెరువులు, నదులు, నాలాల పరిధిలో భూములు ఉండి, నిర్మాణాలకు అవకాశం లేక నష్టపోతున్న పట్టాదారులకు ఊరటనిస్తూ 'బదిలీ చేయ గల అభివృద్ధి హక్కుల' (టిడిఆర్) నిబంధనలను భారీగా సవరించింది. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో భూములు కోల్పోయే వారికి గరిష్టంగా 400 శాతం వరకు టిడిఆర్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఒకవైపు చెరువులు, నదులు, నాలాలు ఆక్రమణల నుంచి రక్షణ పొందుతాయని, మరోవైపు భూములు కోల్పోయే పట్టాదారులకు న్యాయం జరిగే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది. 10 అంతస్తులకు పైన నిర్మించే భవనాల్లో 10 శాతం టిడిఆర్‌ను వినియోగించాలనే నిబంధనను కొత్తగా ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో టిడిఆర్ డిమాండ్ నిరంతరం కొనసాగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**ఏ భూమికి ఎంత శాతం టిడిఆర్ ?**
నీటి వనరుల రక్షణ కోసం స్వచ్ఛందంగా భూమిని అప్పగించే యజమానులకు ప్రభుత్వం ఈ క్రింది విధంగా ప్రయోజనాలను చేకూర్చనుంది.

| భూమి రకం | కేటాయించే టిడిఆర్ శాతం |
|---|---|
| – ఎఫ్‌టిఎల్ / ఎంఎఫ్‌ఎల్ భూములు (నీటి మట్టం పరిధిలో) | 200 శాతం |
| – బఫర్ జోన్ భూములు (చెరువులు, నదుల పక్కన) | 300 శాతం |
| – నాలాల విస్తరణ (ప్రైవేటు భూములు) | 400 శాతం |
| – ప్రజా అవసరాల కోసం (బఫర్ జోన్ వెలుపల) | 400 శాతం |

**నిర్మాణదారులకు అదనపు వెసులుబాటు...** భూమిని ఉచితంగా ప్రభుత్వానికి అప్పగించిన యజమానులు, తమ మిగిలిన స్థలంలో భవన నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక మినహాయింపులు పొందవచ్చు.
**సెట్-బ్యాక్ మినహాయింపు :** రహదారి వెడల్పును బట్టి భవన నిర్మాణ సెట్‌బ్యాక్స్‌లో రాయితీలు పొందవచ్చు.
**అదనపు అంతస్తులు :** తమకు ఉన్న టిడిఆర్ పరిమితికి లోబడి అదనపు అంతస్తుల అనుమతి పొందవచ్చు. అయితే, ఫైర్, ఎయిర్‌పోర్ట్ ఎన్‌ఓసి తప్పనిసరి.
**హై రైజ్ బిల్డింగ్స్ :** 10 అంతస్తులపైన నిర్మించే భవనాల్లో 10 శాతం విస్తీర్ణాన్ని తప్పనిసరిగా టిడిఆర్ ద్వారానే భర్తీ చేయాలనే నిబంధన విధించారు.

**పారదర్శకత కోసం కఠిన నిబంధనలు**
టిడిఆర్ జారీ ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది.
**అధికారుల క్లియరెన్స్ :** ఇరిగేషన్ విభాగం (ఈఈ ర్యాంక్), రెవెన్యూ విభాగం (అదనపు కలెక్టర్) క్లియరెన్స్ ఇస్తేనే టిడిఆర్ మంజూరు చేస్తారు.
**వివాదాస్పద భూములు :** భూమి టైటిల్ వివాదాల్లో ఉంటే, ఆ టిడిఆర్ హక్కులను 'టిడిఆర్ బ్యాంక్'లో భద్రపరుస్తారు. కోర్టు వివాదాలు ముగిసిన తర్వాతే యజమానికి అప్పగిస్తారు.
**పెద్ద విస్తీర్ణం :** ఒక ఎకరం కంటే ఎక్కువ భూమికి టిడిఆర్ ఇవ్వాలంటే ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి తప్పనిసరి.
**జలవనరుల పునరుద్ధరణ..** సుప్రీం కోర్టు, హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశాలకు అనుగుణంగా చెరువులను ఆక్రమణల నుండి కాపాడడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యం. హెచ్‌ఎండిఏ, జిహెచ్‌ఎంసి, హైడ్రా, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థలు చేపట్టే ప్రాజెక్టులకు ఈ సవరించిన నిబంధనలు వర్తిస్తాయి. ఈ నిర్ణయం వల్ల ఒకవైపు జలవనరులు రక్షించబడటంతో పాటు, మరోవైపు తమ భూమి విలువ కోల్పోతామని భయపడే పట్టాదారులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ట్యాంక్‌బండ్‌పై ధర్మబిక్షం విగ్రహాన్ని పెట్టాలి

గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాయిలుగౌడ్ డిమాండ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ధర్మబిక్షం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిలు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండల వ్యవసాదారుల సోసైటి వద్ద గీత పనివారల సంఘం నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 68 సంవత్సరాలలో పోరాడి సాదించిన విజయాలను గుర్తు చేశారు. గీత కార్మికుల ప్రధాన సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి వృత్తి రక్షణకు సొసైటీలకు భూములు కేటాయించి మౌలిక సదుపాయాలను కల్పించిన గీత జన కల్పవృక్షం బొమ్మగాని ధర్మబిక్షం అందించిన సేవలకు ప్రతీకగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు హనుమాన్‌దాస్(బిఆర్‌ఎస్), సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షులు అబ్బగౌని భాస్కర్‌గౌడ్(కాంగ్రెస్), కార్యనిర్వాహక కార్యదర్శి తప్పెట్ల రాములుగౌడ్(సిపిఐ), జిల్లా కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్(సిపిఐ), సంఘం సభ్యులు నర్సింహాగౌడ్, వెంకటేష్‌గౌడ్, నాగేష్‌గౌడ్, మల్కాజ్‌గిరి రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బహిరంగసభ విజయవంతం చేయాలి: నాగరాజు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సిపిఐ వందేళ్ల సంబురాల సందర్భంగా ఈ నెల 18న ఖమ్మం వేదికగా జరుగనున్న భారీ ప్రదర్శన, బహిరంగసభకు భారీగా ప్రజలు వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ కౌన్సిల్ సభ్యుడు కాసర్ల నాగరాజు పిలుపిచ్చారు. ఈ సభ ద్వారా కమ్యూనిస్టు భావజాల పార్టీలన్నీ ఏకమైతే కమ్యూనిస్టు పార్టీలు తిరిగి పూర్వ వైభవం దక్కించుకొని అధికారం చేపట్టవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిధులు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** తన డివిజన్‌లో అవసరమైన ప్రజాభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మచ్చబొల్లారం, ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్లు కోరారు.. ఈ మేరకు వారిద్దరు కాంగ్రెస్ సీనియర్ నేత సురేందర్‌రెడ్డితో కల్సి శుక్రవారం జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సచిత్ గంగ్వార్‌ను కల్సి వినతిపత్రాలు సమర్పించారు.

## నాచారంలో దారుణ హత్య అన్నను చంపిన తమ్ముడు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో సంక్రాంతి రోజున చోటుచేసుకున్న దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యం మత్తులో జరిగిన గొడవ చివరకు ప్రాణాంతకంగా మారింది. నాచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీఎస్టీ కాలనీ, నాచారంలో నివసిస్తున్న స్టాఫర్డ్ రోహన్ సేయర్స్ (30) అతని స్టెప్ బ్రదర్ లియోనార్డ్ ఏంజెలో సేయర్స్ (28) సంక్రాంతి రోజు అర్ధరాత్రి సమయంలో తమ నివాస భవనం మూడవ అంతస్తు టెర్రస్‌పై మద్యం సేవించారు. ఈ క్రమంలో గ్లాస్ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గొడవ ఉధృతమవడంతో తమ్ముడు లియోనార్డ్ ఏంజెలో సేయర్స్ తన అన్న స్టాఫర్డ్ రోహన్ సేయర్స్‌ను బలవంతంగా టెర్రస్‌పై నుంచి కిందకు తోసివేశాడు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారని మృతుని తల్లి మిచెల్ రోసారియో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసి ఐదు గంటల వ్యవధిలోనే నిందితుడు లియోనార్డ్ ఏంజెలో సేయర్స్‌ను అదుపులోకి తీసుకుని అతనివద్ద నుంచి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపించామని పోలీసులు తెలిపారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** అకాల మరణం పొందిన చిరకాల స్నేహితుడు సిద్దులూరి చంద్రశేఖర్ కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముందుకువచ్చి స్నేహం అనే మాటకు సరైన నిర్వచనాన్ని అందించారు సాటి పూర్వ విద్యార్థి మిత్రులు, శుక్రవారం నవాబుపేట్ మండల పరిధిలోని అక్నాపూర్ గ్రామానికి చెందిన సిద్దులూరి చంద్రశేఖర్ గత వారం రోజులుగా హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న 200809 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమవంతుగా మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించారు. రూ.20,000 సేకరించిన నగదును మృతుని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, శ్రీనివాస్, రాజశేఖర్, బాల్ రాజు, రమేష్, శ్రీనివాస్, రాజేందర్,శేఖర్, కృష్ణ,శ్రీశైలం,కాశీమ్, మల్లేశం, బుచ్చయ్య, మల్లేశం, రమేష్, పవన్ వినయ్,అశోక్,తదితరులు పాల్గొన్నారు.

## యువతలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలి :మధుకృష్ణ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి టోర్నమెంట్‌లు దోహదపడతాయని లక్ష్మాపూర్ గ్రామ యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లో సంక్రాంతి పండగ సందర్భంగా యువతకు వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో మాజి సర్పంచ్ సింగం అంజనేయులు, మాజి ఎంపిటిసి పారుపలి నాగరాజు, మాజి ఉప సర్పంచ్ కటికెల వైద్యనాద్, వార్డు సభ్యులు, నాయకులు బండి జగన్నాదం, వీరేషం, ఉపేందర్‌రావు, సింగం బాగయ్య(అడ్వకేట్), దయానంద్, చిత్తయ్య, నర్సింగరావు, కేబుల్ శ్రీనివాస్, శావుకారి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని కుషాయిగూడ ఎసిపి వెంకట్‌రెడ్డి, శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్‌లు అన్నారు. శుక్రవారం అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపల్‌లో రోడ్డు భద్రతపై ప్రజలకు. ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్ మాట్లాడుతూ రోడ్డు ట్రాఫిక్ నియామాలను తప్పకుండా పాటించాలని ద్విచక్రవాహనాదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అన్నారు. నాలుగు చక్రాల వాహనాదారులు సీటు బెల్ట్‌ను తప్పకుండా పెట్టుకోవాలని సూచించారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియామాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్లు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, మూడుచింతలపల్లి కమిషనర్ పవన్‌కుమార్, ఎస్‌ఐలు సోమిరెడ్డి, కృష్ణ, ట్రాఫిక్ ఎస్‌ఐ నవీన్‌రెడ్డి, ఎఎంవిఐ త్రివేణి, ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖనిజ సంపదపై కన్నేసిన అక్రమార్కులు

యధేచ్ఛగా ఎర్రరాయి తవ్వకాలు
కన్నెత్తి చూడని అధికార యంత్రాగం
అధికార పార్టీ నేతల అండతో నిర్వాకం
ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి





**ప్రజాపక్షం/తాండూరు :** సహజ సంపదను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఇండ్ల నిర్మాణానికి ఉపయోగించే ఎర్రరాయికి మార్కెట్లో భారీగా డిమాండ్ ఉంది. దీనిని అసరగా చేసుకున్న అక్రమార్కులు ఎక్కడ పడితే అక్కడ గద్దలా వాలిపోతూ యధేచ్ఛగా అక్రమంగా తవ్వకాలు చేపట్టి దండుకుంటున్నారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలో పాషాపూర్ గ్రామ పంచాయతి అనుబంధ గ్రామమైన రాంసింగ్ తండాలో ఎర్రరాయి విరివిగా లభిస్తుంది. దీనిని అసరాగా చేసుకున్న అక్రమార్కుల కన్ను సహజ సంపదపై పడింది. ఈ ప్రాంతం కర్నాటక సరిహద్దు ప్రాంతం కావడంతో ప్రభుత్వ, పట్టా భూములలో ఏలాంటి అనుమతులు లేకుండానే ఎర్రరాయిని యధేచ్ఛగా తవ్వకాలు జరుపుతూ అక్రమ రవాణ చేస్తూ దండుకుంటూ ప్రభుత్వ అధాయానికి గండి కొడుతున్నారు. ఈ అక్రమ దందపై గత సంవత్సరం టాస్కో ఫోర్స్ అధికారులు సైతం దాడులు చేసిన వాహనాలను సీజ్ చేసి పలువురిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయిన వీరి ఎర్రరాయి అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. అనుమతులు సైతం తీసుకున్నారంటే అది లేదు. రాంసింగ్ తాండ సమీపంలో ఎర్రరాయి క్వారీలు నిర్వహకం చూస్తుంటే మైనింగ్ మాఫియాగా ఇట్టే దర్శనమిస్తుంది. అటు వైపు ఎవ్వరైన అధికారులు వస్తున్నారా అనే విషయంపై కొందరు ప్రధాన రహదారిపై కాపాల కాస్తూ అక్కడికి వచ్చే వారి సమాచారం చేరవేస్తున్నారు. ఎవ్వరైన అక్కడి వెళ్లే సరికి అక్కడ ఏలాంటి యంత్రాలను లేకుండా చెరుకు తోటల వెనుక దాచిపెట్టడం గమనర్హం. ఇదే అదునుగా అక్రమంగా తవ్వకాలు జరుపుతూ అక్రమ రవాణకు తెగబడుతున్నారు. ఇప్పటికైనా సంబందిత రెవెన్యూ, మైనింగ్‌శాఖ, టాస్కోఫోర్స్ ,రవాణ శాఖల అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోని ప్రభుత్వ అధాయానికి గండి పడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నిర్దేశించిన రోడ్డు భద్రత ప్రమాణాలు, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. రోడ్డు ప్రమాదాలనివారణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పది రోజుల పాటు నిర్వహిస్తున్న "అరైవల్ అలైవ్ కాంపెయిన్–2026" లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలని నడిపించే వారు డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్, బీమా పత్రాల వంటి నిర్దేశించిన వాటన్నింటిని కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ విభాగ ఎసిపి వెంకటరెడ్డి మాట్లాడుతూ పౌరుల పరివర్తన, పౌరసమాజ అవగాహన రోడ్డు భద్రతలో కీలకమన్నారు. గత ఏడాది దేశంలో జరిగిన 5 లక్షల మేరకు రోడ్డు ప్రమాదాల్లో 2 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోగా పలువురు క్షతగాత్రులయ్యారని ఆయన చెప్పారు. వీటన్నింటికి నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ లేన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ లాంటి అనేక తప్పిదాలు రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. రోడ్డు ట్రాఫిక్ నియామాలను తప్పకుండా పాటించాలని ద్విచక్రవాహనాదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




**కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో...**కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో జరిగిన "అరైవల్ అలైవ్ కాంపెయిన్2026" లో భాగంగా డిపో సిబ్బందికి అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిసిపి మనోహర్ మాట్లాడుతూ చిన్న నిర్లక్ష్యం రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలకు కోల్పోడవటే కాక పలువురి కుటుంబాలు రోడ్డున పడేందుకు కారణమవుతోందన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను నడిపించే సమయాల్లో విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు.టాఫిక్ నియామాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రమాద బాధితుల కుటుంబీకులు ఈ కార్యక్రమంలో వారి బాధలను వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సిబ్బంది, రోడ్ సేఫ్టీ, ఆర్టీసీ డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** రిజర్వేషన్ల కోసం శనివారం కలెక్టర్ కార్యాలయం లో రాజకీయ పార్టీలోతో సమావేశం జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ మున్సిపాలిటీ చట్టంకు అనుగుణంగా, మున్సిపాలిటీలలో వార్డుల రిజర్వేషను ఆధారంగా 2026 మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల ప్రక్రియ విషయంపై రాజకీయ పార్టీలతో సమావేశం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

## కృష్ణానదిలో మునిగి.. తాండూరు విద్యార్థి మృతి

తండ్రి పరిస్థితి విషమం...తాండూరులో విషాద ఛాయలు



**ప్రజాపక్షం/తాండూరు:** సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని ఫ్యామిలితో సరదా కోసం జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్ళితే ఆ కుటుంబంలో విషాదం నింపింది. కృష్ణానదిలో మునిగి ఓ విద్యార్థి మృతి చెందిగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనతో తాండూరు పట్టణంలో విషాద చాయలు అమలుకున్నాయి. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన మహేష్ (లెక్చరర్) తమ కుటుంబ సభ్యులతో కలసి పండగ సెలవులు కావడంతో వీరు నారాయణపేట మక్తల్‌లోనిని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే బంధువులతో కలసి శుక్రవారం జూరాల ప్రాజెక్టును చూసెందుకు బయలు దేరారు. అక్కడ ప్రమాద వశాత్తు మహేష్, ఆయన కుమారుడు గౌరి ప్రీతమ్ కృష్ణానదిలో మునిగిపోయినట్లు తెలిసింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి వారిని బయటకు తీసే ప్రయత్నం చేపినట్టుపటికి కుమారుడు విద్యార్థి గౌరి ప్రీతమ్ మృతి చెందగా తండ్రి మహేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. దీంతో మహేష్ కుటుంబంలో విషాద చాయలు అమలుకున్నాయి. కన్న కొడుకు మృతి, కట్టుకున్న భర్త పరిస్థితి విషమంగా ఉండండంతో తల్లి రోధనలు అక్కడున్న వారిని కలచి వేశాయి.

# రిజర్వేషన్లపై ఉత్కంఠ

మున్సిపాలిటీ ఎన్నికలపై జోరుగా చర్చ
టికెట్ల కోసం అశావహుల ముమ్మర ప్రయత్నాలు
జనరల్ స్థానాలపై ప్రత్యేక దృష్టి
జిల్లాలోని నాలుగు మున్సిపల్‌లో రాజకీయ సందడి




**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలో రాజకీయ సందడి మొదలైంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవేతమైంది ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితాపై స్వీకరించిన అభ్యంతరాలను పరిష్కరించే ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చింది. ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను అయా వార్డులోని పోలింగ్ కేంద్రాల్లో విడుదల చేశారు. రిజర్వేషన్లపై ఉత్కంఠ, మున్సిపల్ ఎన్నికలపై జోరుగా చర్చ, టికేట్ల కోసం అశావహులు ముమ్మర ప్రయత్నాలు, వార్డులకు ఐదారుగురు పేర్ల పరిశీలిస్తున్న ప్రధాన పార్టీలు, జనరల్ స్థానలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలైన వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్‌లో ఔత్సాహికులు పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. తాజా మాజీ కౌన్సిలర్లు , కొత్తగా పోటీ చేయలనుకున్నానే వారు, పార్టీలో ఏళ్లుగా కొనసాగుతున్న చోటామోటా నాయకులు పోటీకి సై అంటున్నారు. కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియకు మున్సిపల్ శాఖ శ్రీకారం చుడుతుంది. ఈ క్రమంలోనే అందరి దృష్టి వార్డుల రిజర్వేషన్లుపై పడింది. రిజర్వేషన్లు ఖరారుకాక ముందే ఆశావహులు టికెట్ల కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్ల జాబితావార్డుల వారీగా అనధికారికంగా విడుదల కావడంతో ఆ దిశగా రిజర్వేషన్లపై ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నారు. టికెట్ల కోసం అయా పార్టీల నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. గతంలో టికెట్ రాని వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం పార్టీలో కొనసాగుతున్న వారికి కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు టికెట్ దక్కకుంటే పార్టీ మరడానికి సిద్ధమవుతున్నారు. మున్సిపాలిటీలో గెలిచే అభ్యర్థులకు పార్టీలు సైతం వల వేస్తున్నాయి.

ముఖ్యంగా తాండూర్, పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీలలో ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల మధ్య పోటీ ఉండనుంది. అయితే అధికార పార్టీలో నా యకుల మధ్య గ్రూప్ తగాదాలతో రెబల్స్ బెడద ఉం టుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పరంగా ఎన్నికలు కావడంతో బీఫాం అభ్యర్థులకు కీలకంగా మారనుంది. రెండు పార్టీల్లో ఎవరికీ పార్టీ బీఫాంలు దక్కుతాయోననే చర్చ అందరిలో నెలకొంది.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
17-01-2026
www.prajapaksham.in

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, టాలీవుడ్‌లో 'సీతారామం'తో భారీ గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గురించి సోషల్ మీడియా, సినీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఇటీవల వీరిద్దరూ ఒకరికొకరు దగ్గరయ్యారని, రిలేషన్‌షిప్‌లో ఉన్నారనే వార్తలు తమిళ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి.

రీల్

# సంక్రాంతి కానుకగా 'ఎల్లమ్మ' ఫస్ట్ గ్లింప్స్..



'బలగం' లాంటి ఎమోషనల్ డ్రామాను తెరకెకించి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన దర్శకుడు వేణు ఇప్పుడు తన రెండో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. అద్భుతమైన కథలని ఎన్నుకునే విజనరీ స్టార్ ప్రొడ్యూసర్ గా ఎదిగిన దిల్ రాజు, బలగం ఫేమ్ డైరెక్టర్ వేణు యెల్దండి కాంబినేషన్‌లో వస్తున్న మరో ప్రతిష్టాత్మకమైన చిత్రం 'ఎల్లమ్మ'. తొలి చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన వేణు పవర్ ఫుల్, ఆధ్యాత్మికతతో నిండిన కథని సిద్ధం చేశారు. ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు సంగీత ప్రపంచాన్ని ఏలుతున్న రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ కెమెరా ముందు అడుగుపెడుతున్నాడు. ఎల్లమ్మ చిత్రంతో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. హీరోగా చెయ్యాలనే దేవిశ్రీ ప్రసాద్ కోరిక ఈ సినిమాతో తీరుతోంది. ఎల్లమ్మ సినిమాలో హీరోగా నటిస్తూనే సంగీతాన్ని కూడా అందిస్తున్నాడు. ఎల్లమ్మ సినిమా దైవిక శక్తి నేపథ్యంగా, స్థానిక సంప్రదాయాలు, జానపద విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాన్ని బలంగా ప్రతిబింబించేలా రూపొందుతోంది. మకర సంక్రాంతి శుభ సందర్భంగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ అందరిని ఆకట్టుకుంటోంది. గ్లింప్స్ ఒక స్టన్నింగ్ విజువల్‌తో మొదలవుతుంది. సుడిగుండలా తిరుగుతున్న గాలిలో ఓ ఒంటరి వేపాకు పైకి దూసుకెళ్తుంది. దాన్ని గమనిస్తూ ఓ మేక నిలుస్తుంది. క్షణాల్లో వాతావరణం ఉత్కంఠభరితంగా మారుతుంది. వేప, పసుపు, కుంకుమ విజువల్స్ డివైన్ ఆరాను జోడిస్తే, దేవిశ్రీ ఇచ్చిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఈ కాన్సెప్ట్ గ్లింప్స్‌తోనే సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'ఎల్లమ్మ' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# 'అనగనగా ఒక రాజు' థాంక్యూ మీట్



నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా సంక్రాంతికి విడుదల అయిన 'అనగనగా ఒక రాజు చిత్రం థ్యాంక్యూ మీట్ శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. సితార ఎంటర్టైన్మెంట్స్ అనేది బ్లాక్ బస్టర్ ప్రొడక్షన్ హౌస్. అలాంటి సంస్థ నుంచి ఇటీవల ఒకట్రెండు సినిమాలు ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయాయి. ఇలాంటి తరుణంలో 'అనగనగా ఒక రాజు' రూపంలో ప్రేక్షకులు బ్లాక్‌బస్టర్‌ను అందించడం.. మా అందరికీ సంతోషాన్ని కలిగించింది. ముఖ్యంగా నాగవంశీ ముఖంలో చిరునవ్వు చూడటం సంతోషాన్ని ఇచ్చింది. కథానాయకుడిగా నాకిది కేవలం నాలుగో సినిమా. నా మొదటి సంక్రాంతి సినిమా. పోటీలో పెద్ద సినిమాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ మా సినిమాని బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అని చెప్పారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'ఆరేళ్ళ తర్వాత నాకు సంతృప్తిని ఇచ్చిన సంక్రాంతి ఇది. 2020లో వచ్చిన 'అల వైకుంఠపురములో' సినిమా తర్వాత ఆ స్థాయి తృప్తిని ఇచ్చిన సంక్రాంతి ఇది. ఈ సంక్రాంతికి ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. మా డిస్ట్రిబ్యూటర్లు అందరూ తగినన్ని థియేటర్లను మాకు కేటాయించి ఎంతో అండగా నిలిచారు. అందుకే రెండు రోజుల్లోనే రూ.41 కోట్ల గ్రాస్ రాబట్టగలిగిందని అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. 'మా సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. అందరూ మమ్మల్ని ప్రశంసిస్తున్నారని తెలిపారు. దర్శకుడు మారి మాట్లాడుతూ ప్రేక్షకుల నుంచి వస్తున్న ఈ స్పందన.. మా అందరి కష్టాన్ని పూర్తిగా మర్చిపోయేలా చేసింది. నవీన్‌కి వరుసగా నాలుగో విజయం దక్కడం సంతోషంగా ఉంది. ఆయన వల్లే నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన నాగవంశీకి కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రావు రమేష్, రచయిత్రి, క్రియేటర్ డైరెక్టర్ చిన్మయి, ఛాయాగ్రాహకుడు యువరాజు, కళా దర్శకుడు గాంధీ, నటుడు చంద్ర పాల్గొన్నారు.




# లోకేశ్ కనగరాజ్ కాంబోలో అల్లు అర్జున్ సినిమా..


హీరో అల్లు అర్జున్. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప 2 తరువాత అల్లు అర్జున్ తమిళ దర్శకుడు అట్లీతో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగానే మరో తమిళ దర్శకుడితో సినిమా చేయడానికి సిద్ధమైయ్యాడు. అల్లు అర్జున్ హీరోగా బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, బివి వర్క్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ భారీ చిత్రానికి నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. బన్నీవాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. కమల హాసన్‌తో విక్రమ్ సినిమా తీసిన దర్శకుడు లోకేష్ కనకరాజ్ ప్రస్తుతం అల్లు అర్జున్ తో కలిసి ఈ సినిమాలో పని చేస్తున్నారు. ఈ సినిమాకు రాక్‌స్టార్ అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. ఏఏ 23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కబోతోంది.

# 'కటాలన్' సెకండ్ లుక్



క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ 'కట్టాలన్' సెకెండ్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఏనుగుల వేట నుండి ప్రేరణ పొందిన ఉత్కంఠభరితమైన మాస్ యాక్షన్‌తో ఈ పోస్టర్ మలయాళ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో ఆంటోనీ వర్గీస్‌ను పరిచయం చేస్తుంది. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే, ఆంటోనీ వర్గీస్‌ను ఫస్ట్ లుక్‌లోనూ, తాజాగా విడుదలైన సెకెండ్ లుక్‌లోనూ పవర్ ఫుల్ లుక్‌లో చూపించారు. మలయాళ సినిమా చరిత్రలోనే బిగ్గెస్ట్ రిలీజ్‌గా నిలవనున్న 'కటాలన్', మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. షరీఫ్ మహమ్మద్ నిర్మించిన పాన్‌ఇండియన్ యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' తర్వాత క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుండి వస్తున్న మూవీ ఇది. 'కటాలన్' ఇప్పటికే మలయాళ సినిమా చరిత్రలోనే అతి పెద్ద ఓవర్సీస్ డీల్స్‌లో దక్కించుకుందని, షూటింగ్ పూర్తి కాకముందే అనేక ప్రీరిలీజ్ రికార్డులను బద్దలు కొట్టింది. ఫార్స్ ఫిలిమ్స్‌తో కలిసి, 'కటాలన్' ఒక మలయాళ చిత్రానికి ఇప్పటివరకు ఎన్నడూ లేని అతిపెద్ద ఓవర్సీస్ రిలీజ్ కానుంది.

# నభా నటేష్ ఫస్ట్ లుక్



అభిషేక్ నామా నిర్మిస్తున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'నాగబంధం', విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది.చిత్ర బృందం హీరోయిన్ నభా నటేష్‌ను పార్వతి పాత్రలో పరిచయం చేస్తూ ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా విడుదల చేసిన ఈ పోస్టర్‌లో, నభానటేష్ అద్భుతమైన, సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తుంది. హుందాతనం, పవిత్రత, ఆధ్యాత్మికత వెదజల్లుతోంది. ఆమె ముఖంలో కనిపించే ఆత్మీయమైన భావం, భక్తి, పురాణాల మూలాల నుంచి పుట్టిన పాత్రను సూచిస్తుంది. పోస్టర్‌కు మరింత వైభవాన్ని జోడిస్తూ ఆమె చేయి సమీపంలో నీలి రంగు పక్షి దర్శనమిస్తుంది. పక్కనే రాజసంగా నిలిచిన నెమలి, వెనుక కనిపించే ఆలయ నేపథ్యం ఈ అన్నీ పాత్రను అద్భుతంగా ఆవిష్కరిస్తున్నాయి. ఐశ్వర్య మీనన్ మరో కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.నాగబంధం భారతదేశంలోని పురాతన విష్ణు దేవాలయాల నేపథ్యంలో సాగుతుంది. ఈ కథాంశం నాగబంధం సంప్రదాయంలోని పవిత్ర రహస్యాలను అన్వేషిస్తుంది, పురాణాలు, సస్పెన్స్, డివోషన్ బ్యాక్ డ్రాప్‌లో ఒక ఉత్కంఠభరితమైన కథనంగా రూపొందుతోంది. ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో భారీగా విడుదల కానుంది.

# 'సీతా పయనం'లో 'బసవన్న' పాట విడుదల



నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో రాబోతోన్న కొత్త సినిమా 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటిస్తున్నారు. అతని మేనల్లుడు ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రిన్స్ ధ్రువ సర్జా పాత్రను పరిచయం చేస్తూ 'బసవన్న' పాటనం విడుదల చేశారు. ఇందులో బసవన్న పాత్రలో ధ్రువ కనిపించబోతోన్నారు. అనూప్ రూబెన్స్ ఇచ్చిన బాణీలు అందిస్తున్నారు. కాసర్ల శ్యాం సాహిత్యం అందించారు. బసవన్న పాటను నకాస్ అజీజ్, ఎల్. కీర్తన ఆలపించారు. ఈ పాటకు లలితా శోభి, శ్రష్టి వర్మ కొరియోగ్రఫీ అందించారు. ప్రస్తుతం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని పూర్తి చేశారు. ఈ సినిమాను ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కానుంది. జి బాలమురుగన్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ అందించారు.

# 'సంబరాల ఏటిగట్టు' పోస్టర్ రిలీజ్



హీరో సాయి దుర్గతేజ్ పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా ఎస్‌వైజీ (సంబరాల యేటిగట్టు) నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన బ్యానర్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పోస్టర్ సాయి తేజ్‌ను విలేజ్ లుక్‌లో ప్రజెంట్ చేస్తోంది. బూడిద రంగు చొక్కా, సాంప్రదాయ పంచె కట్టు ధరించి, గ్రామీణ నేపథ్యంలో చెప్పులు లేకుండా నడుస్తూ, తెల్లటి ఎద్దును సున్నితంగా నడిపిస్తున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది. గుబురు గడ్డం, తీక్షణమైన చూపు, చిరునవ్వు ఈ మూడు కలిసి ఆయన లుక్ అదిరిపోయింది. ఈ పాత్ర కోసం సాయి దుర్గ తేజ్ కంప్లీట్ గా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. చిత్రంలో ఇప్పటివరకూ ఎన్నడూ చూడని అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. యాక్షన్‌తో నిండిన విజువల్స్ ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇచ్చాయి.

# సైబర్ నేర బాధితులకు గుడ్ న్యూస్

## ఎస్ఒపి ఆమోదించిన హోంమంత్రిత్వ శాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: సైబర్ నేరాలపై స్పందనను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బాధితులకు త్వరితగతిన సహాయం అందించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు జాతీయ సైబర్ నేర నివేదిక పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) లోని సైబర్ ఫైనాన్షియల్ క్రైమ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్మెంట్ సిస్టమ్ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి)కు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి డిజిటల్ వినియోగం అధికంగా ఉన్న రాష్ట్రాల పౌరులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. కొత్త ఎస్ఒపి ప్రకారం.. రూ.50 వేల కంటే తక్కువ మొత్తంతో జరిగిన చిన్నస్థాయి సైబర్ మోసాల విషయంలో కోర్టు ఆదేశం లేకుండానే బాధితులకు రీఫండ అందే అవకాశం ఉంది. కోర్టు లేదా రిస్టోరేషన్ ఆర్డర్ లేని సందర్భాల్లో, ఆ మొత్తాలపై బ్యాంకులు విధించిన 'హోల్డ్‌లను 90 రోజుల్లోగా తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనివల్ల జాప్యం తగ్గి బాధితులపై ఆర్థిక భారం తగ్గనుంది. డిజిటల్ చెల్లింపులు, ఆన్లైన్ బ్యాంకింగ్, ఈకామర్స్ వినియోగం పెరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ నిర్ణయం ప్రత్యేకంగా ప్రాధాన్యత కలిగి ఉంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో డిజిటల్ లావాదేవీలు పెరిగిన కొద్దీ సైబర్ మోసాల ఫిర్యాదులు కూడా పెరుగుతున్నాయి. హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐసిసిసిసి) సేకరించిన డేటా ప్రకారం, గత ఆరు సంవత్సరాల్లో భారత్లో మోసం, చీటింగ్ కేసుల వల్ల ప్రజలు రూ.52,976 కోట్లకు పైగా నష్టపోయారు.

### మూడు స్టేజీల ఎస్కలేషన్ విధానం..

కొత్తగా ఆమోదించబడిన ఎస్ఒపి ద్వారా బ్యాంకులు, పేమెంట్ అగ్రిగేటర్లు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బిఎఫ్‌సి), ఈకామర్స్ ప్లాట్‌ఫారంలు, స్టాక్ ట్రేడింగ్ యాప్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు సైబర్ నేర ఫిర్యాదు నమోదైనప్పుడు అనుసరించాల్సిన నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రక్రియను ఏర్పాటు చేశాయి. అలాగే, ఫ్రీజ్ అయిన ఖాతాలు లేదా నిధులకు సంబంధించిన కేసుల వేగవంతమైన పరిష్కారం కోసం మూడు స్థాయిల ఎస్కలేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎస్ఒపిలో విధానపరమైన ఏకరీతికి ఇచ్చిన ప్రాధాన్యత వేగంగా డిజిటల్ వైపు దూసుకెళ్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. ఇది సురక్షితమైన, నమ్మదగిన డిజిటల్ ఫైనాన్స్ అనే ప్రభుత్వ విస్తృత లక్ష్యానికి మద్దతునిస్తూ వినియోగదారుల ఇబ్బందులను తగ్గిస్తుందని గతేడాది అక్టోబర్ 31 నాటికి, ఈ ప్లాట్ఫారమ్లో నమోదైన 23 లక్షలకుపైగా ఫిర్యాదుల ద్వారా రూ.7,130 కోట్లకు పైగా సొమ్మును కాపాడగలిగారు.

# గగన తలంలో జూపల్లి సాహస యాత్ర

## గోల్కొండలో అట్టహాసంగా ప్రారంభమైన 'హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్



ప్రజాపక్షం/హైదరాబాద్: చారిత్రక గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ వేదికగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో సాహస యాత్ర చేసి సందడి చేశారు. ఆకాశ మార్గంలో సుమారు గంటన్నర సేపు 13 కిలోమీటర్లు విహరించారు. హైదరాబాద్ గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ నుంచి ప్రారంభమైన హాట్ ఎయిర్ బలూన్ అప్పోజిగూడ శివారులో దిగింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... తెలంగాణ పర్యాటక రంగంలో ఇదొక కొత్త అధ్యాయమని మంత్రి అభివర్ణించారు. వినూత్న ఆలోచనలకు తెలంగాణ వేదిక అని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒకవైపు 'ఇంటర్నేషనల్ కైట్ అండ స్వీట్ ఫెస్టివల్' ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం మరియు ఆతిథ్యాన్ని చాటుతుండగా, మరోవైపు 'హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్ల ద్వారా ఆధునిక సాంకేతికతను, భవిష్యత్తు దృక్పథాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు. డెస్టినేషన్ తెలంగాణ ప్రపంచ పర్యాటక కేంద్రంగా.. తెలంగాణలోని సహజ సౌందర్యాన్ని, చారిత్రక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 'డెస్టినేషన్ తెలంగాణ' అనే బ్రాండ్‌ను బలోపేతం చేస్తూ, కేవలం దేశీయ పర్యాటకులనే కాకుండా విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించేలా ఇటువంటి సాహసోపేత క్రీడలు (Adventure Sports) ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటకులు కేవలం సందర్శించడమే కాకుండా, ఒక గొప్ప అనుభూతిని పొందేలా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పర్యాటక విధానం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ, భాగస్వామ్య పద్ధతిలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నాణ్యమైన సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యమన్నారు. ఇదొక అద్భుత అనుభూతి. సంప్రదాయానికి గౌరవం, సాంకేతికతకు స్వాగతం పలుకుతూ పర్యాటక రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతాం. నేడు ఆకాశంలో ఎగురుతున్న ఈ బెలూన్లు.. తెలంగాణ పర్యాటక రంగం ప్రపంచ స్థాయి ఎత్తులకు చేరుకోబోతోంది అనడానికి నిదర్శనం' అని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, యువత, పిల్లలందరికీ ఈ ఫెస్టివల్ ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని, ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో కనువిందుగా 'హాట్ ఎయిర్ బెలూన్' ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు.

# మెట్రో రెండో దశపై సిఎంకు కేంద్రమంత్రి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిని వేగవంతం చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రోరైల్ విస్తరణ పనులు వేగవంతం కావాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై కిషన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మెట్రో మొదటి దశను ఎల్అండ్‌టి సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రభుత్వమే నిర్వహిస్తుందని ప్రకటించిన నేపథ్యంలో, దానికి సంబంధించిన అన్ని ఒప్పందాలు, లావాదేవీలను త్వరగా పూర్తి చేయాలని కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి మెట్రో రెండో దశపై చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. మొదటి దశ లావాదేవీలు పూర్తయిన వెంటనే రెండో దశ పనులపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఖట్టర్ హామీ ఇచ్చినట్లు కిషన్ రెడ్డి తన లేఖలో వెల్లడించారు. మెట్రో పనుల పర్యవేక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, ఇందులో భాగంగా కేంద్రం నుంచి ఇద్దరు, రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారులు సభ్యులుగా ఉండాల్సి ఉందని తెలిపారు.

# ఖమ్మం వేదిక

(మొదటి పేజీ తరువాయి)

తదనంతర పరిణామాలు అందరికీ తెలిసిందే. 1964లో ఉమ్మడి జిల్లాలో సిపిఐ నామ మాత్రంగా మిగిలింది. ప్రధాన నాయకత్వం, ప్రజలు సిపిఐ(ఎం)వైపు వెళ్లగా నల్లమల గిరిప్రసాద్, రావెళ్ల జానకిరామయ్య, కర్నాటి కృష్ణయ్య, పువ్వాడ నాగేశ్వరరావు, ఎం. కొమరయ్య, సర్వదేవభట్ల రామనాథం, విఠల్‌రావు లాంటి అతి కొద్ది మంది మాత్రమే సిపిఐలో మిగిలారు. 1970 తర్వాత మహ్మద్ రజబ్‌అలీ నాయకత్వంలో పెద్ద సంఖ్యలో సిపిఐలో చేరడంతో సిపిఐ పురోగమనం ప్రారంభమైంది. 1980 నాటికి జిల్లాలో సిపిఐ ఒక బలీయ రాజకీయ శక్తిగా నిలిచింది. 1980 దశకంలో రాష్ట్ర మహాసభల సందర్భంగా లక్షలాది మందిని సమీకరించి ఖమ్మంలో సభ జరిపి తన సత్తాను చాటింది. 1981లో జరిగిన శాసన మండలి ఎన్నికల్లో స్థానిక సంస్థల నుండి పోటీ చేసిన పువ్వాడ నాగేశ్వరరావు మాజీ మంత్రి శీలం సిద్దారెడ్డిని ఓడించి చట్ట సభలో అడుగుపెట్టారు. 1983లో ఎన్‌టిఆర్ ప్రభంజనాన్ని తట్టుకుని కమ్యూనిస్టులు ఆరు స్థానాల్లో విజయం సాధించారు. సిపిఐ నుంచి మహ్మద్ రజబ్‌అలీ (సుజాతనగర్), బి.భూపతిరావు (పాలేరు), ఊకె అబ్బయ్య (బూర్గంపాడు)నుంచి గెలుపొందగా సిపిఐ(ఎం) నుంచి మంచికంటి రామకిషన్‌రావు (ఖమ్మం), ముర్ల ఎర్రయ్య రెడ్డి (భద్రాచలం), సిపిఐ(ఎంఎల్) నుండి గుమ్మడి నర్సయ్య (ఇల్లందు) విజయం సాధించారు. కాంగ్రెస్ , మధిర, సత్తుపల్లిలోనూ టిడిపి కొత్తగూడెంలోనూ విజయం సాధించాయి. తొమ్మిదిలో ఆరు స్థానాలు గెలుపొంది కమ్యూనిస్టులు సత్తా చాటారు. 1994లో సిపిఐ ఖమ్మం, ఇల్లందు, బూర్గంపాడు, సుజాతనగర్ అసెంబ్లీ స్థానాలతో పాటు 1996లో భద్రాచలం పార్లమెంటు స్థానాన్ని సైతం గెలుపొందింది.

### ఎమర్జెన్సీలో బలోపేతమైన సిపిఐ :

1975లో ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీని విధించినప్పుడు కాంగ్రెస్ మినహా అన్ని పార్టీలు దెబ్బతిన్నాయి. కానీ ఖమ్మం జిల్లాలో సిపిఐ బలోపేతమైంది. 1970 దశకంలో సిపిఐ చేపట్టిన పోరాటాలే ఇందుకు కారణమయ్యాయి. నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, రజబ్‌అలీ తదితరుల నేతృత్వంలో చారిత్రిక భూ పోరాటాలు నిర్వహించారు. భూ పోరాటం సందర్భంగా భద్రాచలం సమీపంలో తోటపల్లిలో జరిగిన పోలీస్ కాల్పుల్లో వేల్పుల వీరయ్య మరణించాడు. జిల్లా స్థంభించింది. ప్రజలు పోలీసులను తరిమికొట్టి ఆయుధాలను ఎత్తుకెళ్లారు. అదో చారిత్రాత్మక ఘట్టం. గణేశ్వరం, వినోబానగర్, మల్లెలమడుగు, తోటపల్లి మొదలగు వందలాది గ్రామాలు భూ పోరాట కేంద్రాలుగా మారాయి. సిపిఐని ప్రజలు ఆదరించి ఖమ్మం జిల్లాలో ఒక బలమైన రాజకీయ శక్తిగా నిలబెట్టారు.

### గోదావరి జలాలు– బయ్యారం ఐరన్ వోర్ :

గోదావరి జలాలను ఖమ్మం జిల్లా భూములకు మళ్లించాలని దుమ్ముగూడెం వద్ద ఆనకట్ట నిర్మించాలని తొలుత పోరాడింది సిపిఐ మాత్రమే. గోదావరి జలాలను చేతపట్టుకుని సిపిఐ నేతలు తెలంగాణలో యాత్రలు నిర్వహించారు. అంతకు ముందు నంది కొండ పందికొండ అని కొందరు హేళన చేసినప్పుడు నంది కొండ (నాగార్జున సాగర్) సాధన కోసం పోరాడింది కమ్యూనిస్టు పార్టీనే. దుమ్ముగూడెం ప్రాజెక్టు వైఎస్ఆర్ శంకుస్థాపన తర్వాత పెరిగిన జాప్యాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో సిఎం ఇంటిని ముట్టడించిన చరిత్ర ఖమ్మం సిపిఐకి ఉంది. బయ్యారం ప్రాంతంలో నెలకొన్న అపారమైన ఐరన్‌వోర్‌ను తరలించుకుపోతుంటే అడ్డుకున్నది సిపిఐ. తొలుత నిరసనతో ప్రారంభించి 2012లో జిల్లాను దిగ్బంధించింది. ఈ దిగ్బంధనం ప్రజా పోరాటాలకు కొత్త ఊపును ఇచ్చింది. సిపిఐ పోరాట ఫలితంగా ఐరన్ వోర్ లీజును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇది ప్రజా పోరాటం సాధించిన అతి పెద్ద విజయం. సిపిఐ అనుబంధ ఏఐవైఎఫ్ బయ్యారం ఖనిజ సంపద పరిరక్షణ కోసం బయ్యారం నుండి ఖమ్మం కలెక్టరేట్ వరకు పాదయాత్రను నిర్వహించింది. ఎంఎల్‌సిగా పువ్వాడ నాగేశ్వరరావు, ఎంఎల్ఏగా కూనంనేని సాంబశివరావు చట్ట సభల్లోనూ పోరాడారు.

### తెలంగాణ సాధనోద్యమం సిపిఐ :

తెలంగాణ రాష్ట్ర సాధనకు సిపిఐ నిర్ణయం ఒక కొత్త ఊపునిచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు తెలిపిన తొలి జాతీయ పార్టీ సిపిఐ. తెలంగాణ రాష్ట్ర సాధనకు అప్పటి రాష్ట్ర కార్యదర్శి కె. నారాయణ భద్రాచలం నుంచి బస్సు యాత్ర నిర్వహించారు. శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మణుగూరు నుంచి 450 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు. ఈ యాత్రలో అప్పటి జెడ్పి వైస్ ఛైర్మన్ బి. అయోధ్య కూడా పాల్గొన్నారు. కూనంనేని అమరణ నిరాహార దీక్ష చేపట్టగా జైలుకు తరలించారు. జైలులో కూడా కూనంనేని దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు అన్ని పార్టీల రాష్ట్ర నాయకులు తరలివచ్చారు. తెలంగాణ సాధనోద్యమంలో ఈ ఘటన కీలక భూమిక పోషించింది.

### ప్రజా పోరాటాలు – 2023 ఎన్నికలు :

ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగిన పోరాటాల్లో సిపిఐ ముందు వరుసలో నిలిచింది. కార్మిక రైతాంగ సమస్యలతో పాటు సబ్బండ వర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాడింది. 2023 ఎన్నికల్లో కొత్తగూడెం స్థానం నుండి గెలుపొంది తెలంగాణ శాసనసభలో ప్రాతినిథ్యం సంపాదించింది. పదేళ్ల బిఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని అసంఘటిత , సంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసింది చేస్తున్నది సిపిఐ. ఇంతటి చారిత్రిక నేపథ్యం గల సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను ఖమ్మంలో నిర్వహిస్తున్నది.ఈ సభ ఒక చారిత్రిక ఘటనగా, భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు నాంది పలకనుంది. అధికారం లేకపోతే ఆరు నెలలు బతకలేని పార్టీలున్న ఈ దేశంలో వందేళ్లు అధికారానికి దూరంగా ప్రజలతో మమేకమై నిలిచిన సిపిఐ మరో వందేళ్లు పోరాడేందుకు వెనకాడని క్యాడర్‌ను సంసిద్ధులను చేస్తుంది. సిపిఐ ఆవిర్భావం ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంక్షేమం తప్ప ఓట్లు, సీట్లు, నోట్లు కాదని సుదర్ఘీ ప్రస్థానం నిరూపించింది.

తమ త్యాగమేది వృథా కారాదని
తమ స్వప్నాలకు రూపముందని
ముగింపకుడి విప్లవమని
మిగిలిన పని మీ వంతని
అంతిమ విజయం మనదని

వందేళ్ల ప్రస్థానంలో అమరులైన వారికి నివాళులర్పిస్తూ పోరాటపు బరిలో ఒరిగిన యోధుల త్యాగాలతో పునితమైన పోరు భూమి కమ్యూనిస్టు సమర నినాదమే ఖమ్మం.



సభా వేదికను పరిశీలించిన కూనంనేని, బాగం

భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ జరిగే ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో సభా స్థలిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు పరిశీలించారు. పూర్తి డిజిటల్ వేదిక కావడంతో తగు సూచనలు చేశారు. అతిథుల ప్రవేశంకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. మూడు ప్రదర్శనలు ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద ఏకమై సభా స్థలిలోకి ప్రవేశించే మార్గాన్ని పరిశీలించారు. నిర్వాహకులకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com